www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
హైదరాబాద్ సిటీ*
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 166
సోమవారం | 30-9-2024
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: త్రయోదశి రా. 7.07 తదుపరి చతుర్దశి; నక్షత్రం: మఖ ఉ. 6.19 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.3.18-5.05; దుర్ముహూర్తం: మ.12.28-1.16, మ.2.51-3.38; అమృతఘడియలు: రా.2.04-3.52; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.00
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భూకంపం సృష్టించి.. భూస్థాపితం చేసి

బాంబుల వర్షం కురిపించి హిజ్బుల్లా చీఫ్ నస్రల్లాను అంతం చేసిన ఇజ్రాయెల్

ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.. 2లో



ఇజ్రాయెల్ దాడికి ముందు నస్రల్లా దాగింది ఇక్కడే. (ఇన్‌సెట్) అత్యంత కచ్చితత్వంతో చేసిన దాడి తర్వాత విధ్వంసం తీవ్రత ఇలా..



వెంటాడి.. వేటాడి..

శత్రువులపై ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొసాద్ ప్రత్యేక దృష్టి

అద్భుతమైన నిఘా నెట్‌వర్క్‌తో సమాచార సేకరణ

పక్కా ప్రణాళికతో..

తప్పించుకునే వీల్లేకుండా దాడి

ఇటీవలి ఘటనలే నిదర్శనం

రామాయణంలో కబంధుడనే ఒక రాక్షసుడి పాత్ర ఉంటుంది! శాపం కారణంగా తల, కాళ్లు లేని రాక్షస రూపం దాల్చిన ఓ గంధర్వుడు కబంధుడు. కానీ.. అతడి హస్తాలు ఎంతదూరమైనా సాగుతాయి. వాటితో రకరకాల జంతువుల్ని పట్టుకుని తింటుంటాడు. ఎంత దూరమైనా సాగే ఆ కబంధుడి హస్తాల నుంచి తప్పించుకోవడం ఏ జీవికైనా అసాధ్యం. ఇజ్రాయెల్ నిఘా నెట్‌వర్క్ కూడా అలాంటిదే! తమ దేశానికి, తమ పౌరులకు, యూదులకు హాని

మిగతా 2వ పేజీలో...



హిజ్బుల్లాకు మరో దెబ్బ

ఇజ్రాయెల్ దాడిలో కమాండర్ కౌక్ మృతి

నస్రల్లా గుట్టు చెప్పింది ఇరాన్ గూఢచారే..

బంకర్‌పై దాడిలో మృతుల సంఖ్య 20కి

హిజ్బుల్లా కొత్త చీఫ్‌గా హాషీమ్ సఫీద్దీన్

బీరుట్‌పై కొనసాగుతున్న దాడులు

మరో 33 మంది ఉగ్రవాదులు మృతి

2

సిరియాపై అమెరికా దాడులు

37 మంది ఉగ్రవాదుల హతం

హైడ్రా.. ఆచితూచి!

హైదరాబాద్‌లో కూల్చివేతలకు 2-3 వారాల తాత్కాలిక విరామం?



నిరసనలు, హైకోర్టు జోక్యంతో ఉన్నత ఆదేశాలు

ఈ సమయంలో ఫిర్యాదులపై క్షేత్రస్థాయి పరిశీలన

ఇక ముందు నివాసాల కూల్చివేతపై జాగ్రత్తలు

న్యాయ సలహా తీసుకున్నాకే ముందుకు

పేదలను నిలబెట్టడమే మా ఉద్దేశం

మూసీలో నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం

దీనిపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

మల్లన్నసాగర్‌లో వారేం చేశారు?: శ్రీధర్‌బాబు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ వైపు మూసీ ఆక్రమణల మార్కింగ్.. మరోవైపు చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని నిర్మాణాల కూల్చివేత.. వాటిని వ్యతిరేకిస్తూ బాధితుల నుంచి నిరసనలు పెరిగిపోవటం, బాధితుల ఆక్రందనలు సోషల్ మీడియాలో వైరల్ కావటం.. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విభాగాలు పునరాలోచనలో పడ్డాయి. క్షేత్రస్థాయి సర్వే, మార్కింగ్‌లను రెవెన్యూ విభాగం ఇప్పటికే నిలిపివేయగా.. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తోన్న 'హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఎసెట్ ప్రొటెక్షన్' (హైడ్రా) తాత్కాలికంగా కూల్చివేతలకు విరామం ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ విరామం సమయంలో ఫిర్యాదులపై సమగ్ర పరిశీలన చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నోటిఫై అయిన చెరువులకు సంబంధించిన ఫిర్యాదులపై దృష్టి సారించనున్నారు. నిర్ధారిత ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. అదే సమయంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, స్థానిక మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల అనుమతులున్న నిర్మాణాల కూల్చివేతల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని భావిస్తున్నారు. కాగా, హైకోర్టు కూడా పలుమార్లు హైడ్రా దూకుడును ప్రశ్నించింది. కోర్టు విచారణలో ఉన్న ఓ భవనాన్ని కూల్చివేయడంపై తీవ్రంగా స్పందించింది. స్వయంగా లేదా వర్చువల్‌గా హైడ్రా కమిషనర్, అమీన్‌పూర్ తహసీల్దార్ విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఇది కూడా హైడ్రా పునరాలోచనకు ఓ కారణంగా తెలుస్తోంది. వాస్తవానికి, జూలై 19వ తేదీన

మిగతా 11వ పేజీలో...

11

తప్పుడు ప్రచారం చేస్తే
చర్యలు తప్పవు
హైడ్రా కమిషనర్ రంగనాథ్

పేదల ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా

హైడ్రా బుల్డోజర్లు మా పైనుంచే వెళ్లాలి: సంజయ్

ఒక్క కాల్ చేయండి.. అరగంటలో వచ్చేస్తాం

'మూసీ' నిర్వాసితులకు మాజీ మంత్రి హరీశ్ భరోసా

పేదల జోలికి వెళ్లడం తొందరపాటే: ఎమ్మెల్యే దానం

మూసీలో పరామర్శల వరద
బీజేపీ వంటావార్పు



శెభాష్ తెలంగాణ!

మొక్కలు నాటడంలో రాష్ట్ర ప్రజల చొరవ అభినందనీయం

'ఏక్ పేడ్.. మా కే నామ్' లక్ష్యాన్ని మించారు

'మన్ కీ బాత్'లో ప్రధాని అభినందనలు

నాలుగేళ్లుగా ప్రతిరోజూ ఓ మొక్క నాటిన కేఎన్ రాజశేఖర్‌పై ప్రధాని ప్రశంసలు

పదేళ్ల మన్ కీ బాత్‌పై మోదీ భావోద్వేగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): లక్ష్యాన్ని మించి మొక్కలు నాటిన తెలంగాణ ప్రజలపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా రికార్డు స్థాయిలో మొక్కలు నాటారని పేర్కొంటూ రాష్ట్ర ప్రజలకు అభినందనలు తెలిపారు. దేశ ప్రజల్ని ఉద్దేశించి రేడియోలో మోదీ మాట్లాడే 'మన్ కీ బాత్' తాజా ఎపిసోడ్ ఆదివారం ప్రసారమైంది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రారంభించిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమాన్ని ఈ సందర్భంగా మోదీ ప్రస్తావించారు. ప్రజల భాగస్వామ్యానికి ఈ కార్యక్రమం చక్కని ఉదాహరణని, ఎంతోమందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు. తెలంగాణకు చెందిన కేఎన్ రాజశేఖర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన నాలుగేళ్లుగా

మిగతా 2వ పేజీలో...

మహా మెట్రో

116 కిలోమీటర్లు.. రూ.32 వేల కోట్లు!

మెట్రో రెండో దశ విస్తరణ డీపీఆర్‌లో లెక్కఖరారు

నాగోల్-ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్‌లో స్వల్ప మార్పులు

చాంద్రాయణగుట్ట, న్యూహైకోర్టు మీదుగా కొత్త మార్గం

ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కి.మీ కారిడార్

సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ పేరిట మెట్రోస్టేషన్లు

పనులన్నీ రెండో దశలోనే పూర్తికి ప్రభుత్వం నిర్ణయం

నిర్మాణాల అనుమతి కోసం త్వరలో కేంద్రానికి డీపీఆర్





మెట్రో రెండో దశ వివరాలను వెల్లడిస్తున్న ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాలకూ మెట్రో సదుపాయం కల్పించాలనే లక్ష్యంతో ఉన్న రాష్ట్ర ప్రభుత్వం.. ఇందుకోసం రెండో దశలో సరికొత్త కారిడార్లను తీసుకొస్తోంది. ప్రధానంగా శివారు ప్రాంతాల ప్రజలు నగరానికి సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేస్తోంది. మొత్తంగా తొలుత నిర్ణయించిన 78.04 కిలోమీటర్లకు అదనంగా మరో 38.16 కిలోమీటర్లను పూర్తి చేయనుంది. దీంతో ఆరు కారిడార్లలో కలిపి మొత్తం 116.2 కిలోమీటర్లను రూ.32,237 కోట్ల అంచనా వ్యయంతో పూర్తి చేసేందుకు సిద్ధమవుతోంది. ఈ మేరకు మెట్రో రెండో దశ పనులకు సంబంధించిన లెక్క ఖరారు చేసింది. ఇందులో భాగంగా

మిగతా 13వ పేజీలో...

ప్రభుత్వ డేటాతో 'కుటుంబం' గుర్తింపు



డిజిటల్ హెల్త్ కార్డుల పైలట్ ప్రాజెక్టుకు గ్రామాలు, వార్డుల ఖరారు!

5 రోజుల్లో లబ్ధిదారుల వివరాలు పంపాలి

ఆదేశాలు ఇచ్చిన ప్రభుత్వం

13

ఉప్పుడు బియ్యాన్ని తమిళనాడులో
అమ్మేశారు!

ఎఫ్‌సీఐకి సీఎంఆర్ ఎగ్గొట్టి.. అక్రమంగా అమ్ముకున్న మిల్లర్లు

మణికంఠ కన్వేసర్స్ ఏజెన్సీ ద్వారా బియ్యం తరలింపు

మిల్లర్లకు నోటీసులిచ్చిన రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ

అక్రమ రవాణాపై ఆధారాలు సేకరించిన విజిలెన్స్ శాఖ

బ్రోకర్ ఏజెన్సీతోపాటు మిల్లర్లూ విచారణకు రావాలని ఆదేశం



హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమాలకు పాల్పడిన రైస్ మిల్లర్లపై ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. సర్కారు అప్పగించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి బియ్యం అప్పగించకుండా తమిళనాడుకు అక్రమంగా తరలించి బహిరంగ మార్కెట్లో అమ్ముకున్న మిల్లర్లపై చర్యలకు రంగం సిద్ధం చేసింది. కస్టమ్ మిల్లింగ్ రైస్ ఎగ్గొట్టి, వరంగల్ జిల్లాకు చెందిన 'మణికంఠ కన్వేసర్స్' అనే బ్రోకర్ ఏజెన్సీ ద్వారా తమిళనాడుకు రైల్వేవ్యాగన్లలో పారా బాయిల్డ్ రైస్ తరలించినట్లు ఆధారాలు సేకరించిన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు.. ఆ ఏజెన్సీతోపాటు రైస్‌మిల్లుల యజమానులకు నోటీసులు జారీచేశారు. ఒకవేళ మిల్లర్లు ధాన్యం కొంటే రిజిస్టర్లు, డబ్బులు చెల్లించిన రశీదులు, గత మూడు సీజన్లకు సంబంధించిన లావాదేవీల వివరాలతో స్వయంగా హాజరు కావాలని ఆదేశాలు జారీచేశారు. కేవలం 2023-24 సంవత్సరానికి సంబంధించి రబీ సీజన్

మిగతా 14వ పేజీలో...

కులగణన వెంటనే చేపట్టాలి

దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలి

మార్గదర్శకాలపై ఇంకా జాప్యమెందుకు?

సదస్సులో బీసీ నేతలు, మేధావులు

రెడ్లు, ఓసీల ఓట్లు నాకు అవసరం లేదు

2028లో బీసీనే సీఎం: తీన్మార్ మల్లన్న

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ఉన్న బీసీలకు న్యాయం జరగాలంటే.. తక్షణమే కులగణన చేపట్టాలని, దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ నేతలు, మేధావులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం కులగణన చేపడతామంటూనే జాప్యం చేస్తోందని, దీంతో వారి చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోందని అన్నారు. బీసీ కమిషన్‌కు మార్గదర్శకాలు ఇవ్వడంలో అలస్యం ఎందుకని ప్రశ్నించారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో తెలంగాణ వెనుకబడిన తరగతుల ఉద్యోగుల సమాఖ్య, పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్ (పీసీసీసీ) సంయుక్తంగా 'కులగణన' అంశంపై మేధావులు, బీసీ నేతలతో సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. బీసీ గణనతో రానున్న

మిగతా 14వ పేజీలో...



కరీంనగర్‌లో ఎలక్ట్రిక్ బస్సులను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, సజ్జనార్

కొత్త చట్టంతో సామాన్యులకు మేలు

13

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి.. కబ్జాలకు అవకాశమివ్వొద్దు

జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకున్నాకే తహసీల్దార్లపై కేసులు!

తహసీల్దార్లతో సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మహిళా సంఘాలతో బస్సులు కొనిపిస్తాం

13

వాటిని ఆర్టీసీకి అద్దెకు తీసుకుంటాం.. దీనిపై మెప్మాతో సంప్రదిస్తున్నాం

ఖాళీలు భర్తీ చేస్తాం.. దశలవారీగా 2400 ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలు

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు.. రవాణా శాఖ మంత్రి పొన్నం



జమిలిపై ముందుకే!

పార్లమెంటులో 3 బిల్లులు పెట్టనున్న కేంద్రం

వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు

మొదటి దాంతో లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు.. రాష్ట్రాల ఆమోదం అక్కర్లే

రెండో రాజ్యాంగ సవరణ స్థానిక ఎన్నికలపై..

ఎస్ఈసీలతో సంప్రదించి ఒకే ఓటరు జాబితా

దీనిని కనీసం సగం రాష్ట్రాలు ఆమోదించాలి

3

శివరాజ్ సింగ్‌కు బీజేపీ పగ్గాలు?

ఆరెస్సెస్, పార్టీ వర్గాల మద్దతు

సుదీర్ఘ రాజకీయ, పాలన అనుభవం

సవాళ్లను ఎదుర్కోవడంలో దిట్టగా పేరు

మోదీని దించేదాకా
బతికే ఉంటా!

2

కశ్మీరు ఎన్నికల సభలో అస్వస్థతకు గురై తేరుకున్న వెంటనే ఖర్గే వ్యాఖ్యలు

వేదికపై కింద పడబోయిన కాంగ్రెస్ చీఫ్

నువ్వు అవినీతిపరుడివి..
నువ్వే నిందితుడివి!



ఏడీజీపీ చంద్రశేఖర్



కుమారస్వామి

కర్ణాటకలో కేంద్ర మంత్రి వర్సెస్ ఐపీఎస్.. గంగేనహళ్లి భూముల వివాదంపై రోడ్డెక్కిన కుమారస్వామి, చంద్రశేఖర్

కేంద్ర మంత్రిని పందితో పోల్చిన ఐపీఎస్.. నిందితుడు, ఆరోపితుడంటూ వ్యాఖ్యలు.. చంద్రశేఖర్ కబ్జాకోరన్న మంత్రి

పరస్పరం.. తీవ్ర వ్యాఖ్యలు, విమర్శలు.. ఐపీఎస్‌పై కేంద్ర హోం శాఖ సీరియస్!.. చర్యలు తప్పవన్న కేంద్ర మంత్రి జోషి

కర్ణాటకలో కాకరేపుతున్న వ్యవహారం.. జోక్యానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య దూరం

బెంగళూరు, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి, సీనియర్ ఐపీఎస్ అధికారి, లోకాయుక్త ఏడీజీపీ ముద్దు చంద్రశేఖర్ మధ్య వాగ్వాదం తారస్థాయికి చేరింది. ఈ వివాదం ఏకంగా ఢిల్లీని తాకింది. గంగేనహళ్లి భూముల 'డీ నోటిఫికేషన్' వివాదానికి సంబంధించి కుమారస్వామి రెండురోజుల కిందట లోకాయుక్త ముందు విచారణకు హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. లోకాయుక్త సిట్ అధికారి చంద్రశేఖర్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆయన ఓ అవినీతి అధికారి అనీ, అలాంటి వారిని పెట్టుకుని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని విమర్శించారు. రాజ్‌భవన్ సిబ్బందిపైనే విచారణ జరిపేందుకు సదరు ఐపీఎస్ అధికారి అనుమతి కోరారని మండిపడ్డారు. రాష్ట్రపతి కార్యాలయానికి అనుబంధమైన రాజ్‌భవన్ సిబ్బందిపైనే విచారణ జరిపేందుకు సిద్ధమయ్యారంటే పరిస్థితి

మిగతా 3వ పేజీలో...

పాతాళంలో దాక్కున్నా..


ఇజ్రాయెల్ గురి తప్పలేదు



హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా బంకర్ అత్యంత దుర్భేద్యమైనది. పైన ఆరు అంతస్తుల భవనం ఉండగా.. భూగర్భంలో రెండు సెల్లార్ల కింద ఈ బంకర్ ఉంది.

క్షిపణి/బాంబు దాడుల్ని తట్టుకునేందుకు ఉండాల్సిన మందం కంటే ఒకటిన్నర రెట్ల మందంతో బంకర్‌పై 3 లేయర్లను నిర్మించారు. వీటన్నింటినీ ఛేదిస్తూ నస్రల్లాను చంపడం చాలా కష్టమైన పని.

1



ఒకవేళ దాడి జరిగితే తప్పించుకునేందుకు బంకర్ కింది నుంచి రహస్య మార్గం కూడా ఉంది.



2

నస్రల్లా ఈ బంకర్‌లో ఉన్నప్పుడు బంకర్‌ను ఎలా ఛేదించాలనే దానిపై ఇజ్రాయెల్ పైలట్లు ఎన్నో ప్రయోగాలు చేశారు. కొన్ని నెలల పాటు శిక్షణ పొందారు. నస్రల్లా ఈ బంకర్‌లోకి ప్రవేశించాడని ఒక ఇరానీ గూఢచారి ద్వారా ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు సమాచారం అందింది.



పశ్చిమాసియాలో కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాను 32 ఏళ్లుగా ముందుండి నడిపించి.. తమ బలగాలకు పంటికింద రాయిగా ఉన్న నస్రల్లాను అంతమొందించేందుకు ఇజ్రాయెల్‌కు భారీ కసరత్తే చేసింది. మొస్సాద్ సమాచారం..

ఐడీఎఫ్ వ్యూహరచనతో.. వైమానిక దళం 'ఆపరేషన్ న్యూ ఆర్డర్'ను విజయవంతంగా పూర్తిచేసింది. నస్రల్లా ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా పకడ్బందీగా వ్యవహరించింది. బంకర్లను ఛేదించేలా స్క్వాడ్రన్-69 యూనిట్‌కు కొన్ని నెలలుగా ప్రత్యేక శిక్షణనిచ్చింది. ఆపరేషన్ న్యూ ఆర్డర్ మొదలైనప్పటి నుంచి కొందరు ఫైటర్ పైలట్లకు అసలు లక్ష్యమేవరో తెలియకుండా జాగ్రత్తపడింది. త్రివిధ దళాధిపతులు వార్‌రూమ్, ఎయిర్‌బేస్ నుంచి పర్యవేక్షిస్తూ.. లక్ష్యాన్ని ఛేదించిన క్రమం ఇది..



3

ఇజ్రాయెల్ వద్ద ఎఫ్-15ఐ, ఎఫ్-16ఐ, ఎఫ్-35 యుద్ధ విమానాలు ఉన్నాయి. వీటిల్లో ఎఫ్-16, ఎఫ్-35 కాస్త చిన్న సైజువి. ఎఫ్-15ఐ భారీ ఎత్తున ఆయుధాలు మోసుకెళ్లగలిగే పెద్ద విమానం కావడంతో ఇజ్రాయెల్ దానిని ఎంచుకుంది. ఇంతవరకు వైమానిక యుద్ధంలో ఎఫ్-15ను ఏ ఇతర విమానం కూల్చలేకపోయింది. ఒకవేళ బీరుట్‌లో లెబనాన్ విమానాలు ప్రతిఘటించినా వాటిని ఎదుర్కొనేందుకు కూడా ఎఫ్-15 బాగుంటుందని ఇజ్రాయెల్ భావించింది.



4

అమెరికా తయారీ జీబీయూ-28 బాంబులు బంకర్లను ఛేదించేందుకు అనువైనవి. వీటిని బంకర్ బస్టర్ బాంబులు అని పిలుస్తారు. ఇవి మొదట జరిగే ఒక పేలుడుతో కాంక్రీట్ స్లాబుల్లోకి కొంత మేర చొచ్చుకువెళతాయి. ఆ తరువాత మరోసారి పేలుతాయి. తద్వారా స్లాబ్‌ను పూర్తిగా ఛేదించగలుగుతాయి. కానీ ఆరంతస్తుల భవనం, దాని కింద మూడు లేయర్లు కలిగిన బంకర్‌ను ఛేదించాలంటే చాలా బాంబులు కావాలి.



5

నస్రల్లా సమాచారం అందగానే.. హట్జెరిమ్ ఎయిర్ బేస్ నుంచి ఏడు ఎఫ్-15ఐ యుద్ధ విమానాలు బయలుదేరాయి. దాడికి పెద్ద ఎత్తున బాంబులు అవసరం కావడంతో మూడు విమానాలకు పూర్తిగా బాంబులే అమర్చారు. మరి లెబనాన్ యుద్ధ విమానాలు వీటిపై దాడిచేస్తే? వాటిపై ప్రయోగించగలిగే ఎయిర్ టు ఎయిర్ క్షిపణులు అమర్చేందుకు వీటిలో ఇక చోటు లేదు. అందువల్ల మరో నాలుగు ఎఫ్-15లు పూర్తిగా క్షిపణులతో వీటికి రక్షణగా బయలుదేరాయి.



6

ప్రపంచంలో అత్యుత్తమ ఎయిర్ టు ఎయిర్ క్షిపణుల్లో అమ్రామ్ 120డి ప్రథమ శ్రేణిలో ఉంటుంది. మిగ్-25, మిగ్-29, ఎస్‌యూ-24 వంటి అనేక విమానాల్ని కూల్చిన చరిత్ర వీటికి ఉంది. ఇజ్రాయెల్ ఎఫ్-15లలో వీటిని అమర్చారు.

7

నస్రల్లా భవనంపైకి ఎఫ్-15లు చేరుకోగానే.. దాడి చేయాలంటూ హాట్జెరిమ్ ఎయిర్‌బేస్ నుంచి వాటికి ఆదేశాలు అందాయి. ఆ వెంటనే ఫైటర్ పైలట్ 'కెప్టెన్-ఎం' జీబీయూ-28 బాంబులను ఆ భవనంపై జారవిడిచారు. సెకన్లలోనే పదుల సంఖ్యలో బాంబులు పడడంతో.. ఆరంతస్తుల భవనం కుప్పకూలిపోయింది. జీబీయూ-28 బాంబులు నస్రల్లా ఉన్న బంకర్ లేయర్లను చీల్చుకుంటూ వెళ్లాయి. ఒకటిన్నర నిమిషాల్లోనే భవనం కుప్పకూలింది.

ఒక బాంబు వల్ల ఏర్పడిన రంధ్రం ద్వారా మరో బాంబు.. తద్వారా ఇంకో బాంబు.. ఇలా పాతాళం దాకా బాంబులు చేరుకున్నాయి. మొదటి ఒకటిన్నర నిమిషంలోపే నస్రల్లా చనిపోయినట్లు అనిపించినా.. ఎంత మాత్రం తప్పించుకోకూడదు అనే ఉద్దేశంతో 7 నిమిషాలపాటు 80 బాంబులు వేశారు. బాంబుల దాడి ఏ స్థాయిలో జరిగిందంటే.. అక్కడ రిక్టర్ స్కేల్‌పై సుమారు 3.2 తీవ్రతతో భూకంపం రికార్డు అయింది. లెబనాన్ యుద్ధ విమానాల నుంచి ఎఫ్-15లకు ఎలాంటి ప్రతిఘటన ఎదురుకానేలేదు.





శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు సీజే

కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్న జస్టిస్ చంద్రచూడ్

తిరుమల, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయం వద్దకు చేరుకున్నారు. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలోకి వెళ్లిన జస్టిస్ చంద్రచూడ్ ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. తిరిగి ఆలయ ప్రదక్షిణగా రంగనాయకమండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం టీటీడీ ఈవో, అదనపు ఈవో ప్రధానన్యాయమూర్తికి శ్రీవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. సీజేతో పాటు ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. కాగా, సీజేఐ వెంట తిరుమల వచ్చిన సిబ్బందిలో కొందరు అన్యమతస్థులు ఉండడంతో.. ఆలయ సంప్రదాయాల ప్రకారం.. తమకు శ్రీవారిపై విశ్వాసం ఉందని.. అందుకే దర్శించుకోవడానికి వచ్చామని వారితో ఆయన స్వయంగా డిక్లరేషన్ ఇప్పించారు. ఇది చూశాక ఆలయ సంప్రదాయాలు, పద్ధతులు పాటించాల్సిన తీరిదీ అని అందరూ చర్చించుకుంటున్నారు.

మోదీని గద్దె దించేదాకా బతికే ఉంటా..: ఖర్గే



జస్రోటా/జమ్ము, సెప్టెంబరు 29: జమ్మూకశ్మీరులోని కథువా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల ఉగ్రవాదులతో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించిన హెడ్‌కానిస్టేబుల్‌కు వేదికపై నివాళులర్పిస్తుండగా.. ఖర్గే కింద పడబోయారు. వెంటనే పార్టీ నేతలు ఆయన్ను పట్టుకున్నారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించిన వెంటనే తేరుకున్న ఖర్గే ప్రసంగాన్ని కొనసాగించారు. "నాకు 83ఏళ్లు. నేనంత తొందరగా ఏమీ చనిపోను. ప్రధాని మోదీని గద్దె దించే వరకు నేను బతికే ఉంటా"అని స్పష్టంచేశారు. తనకు ఇంకా మాట్లాడాలని ఉన్నప్పటికీ నీరసం వల్ల కూర్చుండిపోవాల్సి వస్తోందని, క్షమించాలని ప్రజలను కోరారు. అంతకుముందు ఆయన కాంగ్రెస్.. దేశం కోసం చేసిన పనులను ఏకరువు పెట్టారు. మరోవైపు ఖర్గేకు ప్రధాని మోదీ ఫోన్ చేసి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

పాక్‌కు ఐఎంఎఫ్ కంటే ఎక్కువ డబ్బు ఇచ్చేవాళ్లం: రాజ్‌నాథ్ సింగ్

గురేజ్, సెప్టెంబరు 29: పాకిస్థాన్ కనుక భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించి ఉంటే ఆ దేశం అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్)ని కోరుతున్న మొత్తం కంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీ ఇచ్చి ఉండేవారమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. జమ్మూకశ్మీర్‌లోని బండిపోరా జిల్లా గురేజ్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల సభలో ఆయన ప్రసంగించారు. భారత్‌కు వ్యతిరేకంగా సీమాంతర ఉగ్రవాదాన్ని అస్త్రంగా చేసుకున్న పాకిస్థాన్ అంతర్జాతీయ వేదికలపై ఏకాకిగా మారిందన్నారు.

హిజ్బుల్లాకు మరో దెబ్బ.. ఇజ్రాయెల్ దాడిలో

కమాండర్ కౌక్ హతం

నస్రల్లా మృతదేహం గుర్తింపు.. ఆస్పత్రికి తరలింపు



ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన బీరుట్‌లోని ఓ భవనం



హిజ్బుల్లా కమాండర్ నబీల్ కౌక్ (ఫైల్)

బీరుట్/టెల్అవీవ్, సెప్టెంబరు 29: లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లాకు మరో గట్టి దెబ్బ తగిలింది. గడిచిన మూడ్రోజులుగా.. హిజ్బుల్లా చీఫ్ నస్రల్లా సహా.. కీలక నాయకులు హతమవ్వగా.. ఆదివారం ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) జరిపిన దాడుల్లో మరో కీలక నేత నబీల్ కౌక్ హతమయ్యాడు. ఆయన హిజ్బుల్లా సెంట్రల్ కౌన్సిల్ డిప్యూటీ చీఫ్‌గా.. దక్షిణ లెబనాన్‌లో మిలటరీ కమాండర్‌గా ఉన్నట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. ఆదివారం బీరుట్‌లోని దహియా ప్రాంతంలో 120 స్థావరాలు, క్రపాలోని 45 ఆయుధాగారాలపై జరిపిన వరుస దాడుల్లో మొత్తం 33 మంది మృతిచెందగా.. 195 మంది గాయపడ్డట్లు తెలిపింది. కాగా.. నస్రల్లాతోపాటు బంకర్‌లో చనిపోయినవారి సంఖ్య 20గా ఉన్నట్లు.. మృతుల్లో హిజ్బుల్లా కమాండర్ అలీ కరాకీ ఉన్నట్లు వివరించింది. నిజానికి అలీ కరాకీ లక్ష్యంగా ఇటీవలే లెబనాన్-సిరియా సరిహద్దుల్లో దాడులు జరిపినా.. అతను తప్పించుకున్నట్లు వెల్లడించింది. నస్రల్లా మరణంతో పాటు.. హిజ్బుల్లాలో నెంబర్-3గా ఉన్న అలీ కరాకీ, కీలక కమాండర్ నబీల్ కౌక్ మృతిచెందడం ఆ ఉగ్ర సంస్థకు కోలుకోలేని దెబ్బ అని ఐడీఎఫ్ భావిస్తోంది. మరోవైపు.. అంతా ఊహించినట్లుగానే తమ తదుపరి చీఫ్‌గా హషీమ్ సఫీద్దీన్ నస్రల్లా నియమితులైనట్లు హిజ్బుల్లా ప్రకటించింది. కాగా.. బీరుట్‌లో నస్రల్లా ఉన్న బంకర్ సమాచారం ఇరాన్‌కు చెందిన ఓ గూఢచారి ద్వారా ఇజ్రాయెల్‌కు అందినట్లు ఫ్రాన్స్‌కు చెందిన పత్రిక 'ల పర్షియా' ఓ కథనాన్ని ప్రచురించింది. నస్రల్లాతోపాటు.. ఇరాన్ ప్రతినిధి, మరికొందరు హిజ్బుల్లా కమాండర్లు ఆ బంకర్‌లో ఉన్నట్లు నిర్ధారించుకున్నాకే.. ఇజ్రాయెల్ వైమానిక దాడులు జరిపినట్లు ఆ కథనం పేర్కొంది. మరోవైపు ఆదివారం ఉదయం లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ దహియాలోని బంకర్ శిథిలాల నుంచి నస్రల్లా మృతదేహాన్ని వెలికి తీసింది. "జెరూసలేం వెళ్లే దారిలో అమరుడైన ఓ వీరుడా" అని అరబిక్‌లో రాసిన ఓ శవపేటికలో మృతదేహాన్ని పెట్టి, బీరుట్ ఆస్పత్రికి తరలించింది. హిజ్బుల్లా వర్గాలు ఆ శవపేటిక ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

ఇజ్రాయెల్ హైఅలెర్ట్!

హిజ్బుల్లా కీలక నేతలను తుదముట్టించినా.. ఆ ఉగ్ర సంస్థపై యుద్ధం పూర్తవ్వలేదని ఇజ్రాయెల్ చెబుతోంది. తాజాగా హిజ్బుల్లా అగ్రనాయకులు బ్లాక్ యూనిట్/షాడో యూనిట్ అనే పేర్లున్న యూనిట్-910ను ఇజ్రాయెల్‌పై పోరాటానికి రంగంలోకి దించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఐడీఎఫ్ మరింత అప్రమత్తమైంది. నస్రల్లా నాయకత్వంలో ఈ యూనిట్ బలపడడమే కాకుండా.. విదేశాలకు విస్తరించింది. అమెరికా, ఐరోపా, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఇజ్రాయెల్ జాతీయులను లక్ష్యంగా చేసుకుని, దాడులు జరపడం ఈ యూనిట్ ప్రత్యేకత. ఐడీఎఫ్ 32 ఏళ్ల క్రితం అప్పటి హిజ్బుల్లా చీఫ్ అబ్బాస్ అల్-ముసావిని తుదముట్టించాక.. ఇజ్రాయెల్‌ను టార్గెట్‌గా చేసుకుని, ప్రతిదాడులు జరిపింది కూడా యూనిట్-910 కావడం గమనార్హం.! కాగా.. లెబనాన్‌లో భూతల దాడులకు ఐడీఎఫ్ సిద్ధమవుతున్నట్లు అమెరికా అంచనా వేస్తోంది. పరిమిత దూరం వరకు భూతల దాడులు ఉంటాయని, గాజాలో మాదిరిగా బుల్‌డోజర్లతో వెళ్లే బలగాలు.. ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

హౌతీలపై డ్రోన్ దాడులు

యెమన్‌లోని హౌతీల స్థావరాలను లక్ష్యంగా చేసుకుని, ఆదివారం డజన్ల కొద్దీ డ్రోన్‌లను ప్రయోగించినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. ఈ దాడుల్లో యెమన్ హుదైదా నౌకాశయం, భారీ విద్యుత్తు కేంద్రం, ఇంధన పైపు లైన్లు ధ్వంసమయ్యాయి. అటు.. గాజాలో హమా‌స్‌కు చెందిన ఒక కిలోమీటరు పొడవైన సొరంగాన్ని గుర్తించినట్లు ఐడీఎఫ్ ప్రకటించింది.

శెభాష్ తెలంగాణ!

(మొదటి పేజీ తరువాయి)

ప్రతి రోజు ఒక మొక్క నాటారని, రాజశేఖర్‌కు ఉన్న నిబద్ధత తనతోసహా అందరినీ ఆశ్చర్య పరుస్తుందని మోదీ తెలిపారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని రాజశేఖర్ ఒక ఉద్యమంలాగా, కఠినమైన వ్రతంలా నిర్వహించారని కొనియాడారు. ఈ ఏడాది ప్రమాదానికి గురైన తర్వాత కూడా ఆయన తన దృఢ సంకల్పాన్ని వదలకపోవడం అత్యంత గొప్ప విషయని ప్రశంసించారు. రాజశేఖర్‌కు హృదయపూర్వకంగా అభినందనలు తెలిపారు. తెలంగాణ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు లక్ష్యానికి మించి మొక్కలు నాటి సరికొత్త రికార్డు సృష్టించాయని మోదీ తెలిపారు. బుధవారం నాటికి దేశవ్యాప్తంగా 80 కోట్ల మొక్కలు నాటడం ద్వారా లక్ష్యాన్ని సాధించామని కేంద్ర పర్యావరణ శాఖ తెలిపిందని గుర్తు చేశారు. ప్రజలు మసాలా వార్తలు, నెగెటివ్ విషయాల పట్ల మాత్రమే ఎక్కువ ఆసక్తి చూపుతారన్న అభిప్రాయాన్ని మన్ కీ బాత్ తప్పని నిరూపించిందని మోదీ పేర్కొన్నారు. పాజిటివ్ వార్తలు, స్ఫూర్తిదాయక కథనాలనే ప్రజలు ఇష్టపడతారని అది నిరూపించిందన్నారు. మన్ కీ బాత్‌కు పదేళ్లు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ.. తాజా ఎపిసోడ్‌తో తాను భావోద్వేగానికి గురవుతున్నానన్నారు. ఇటీవల తన అమెరికా పర్యటనలో ఆ దేశ ప్రభుత్వం భారత్‌కు చెందిన పలు ప్రాచీన కళాఖండాలను తనకు తిరిగి అప్పగించిందని, వీటిలో కొన్ని 4,000 ఏళ్ల కిందటివని మోదీ తెలిపారు.

గత ప్రభుత్వాలకు ఓ ప్రణాళిక లేదు

దేశంలో పట్టణాల అభివృద్ధిపై గత ప్రభుత్వాలకు ఒక ప్రణాళిక ఉండేది కాదని, అందుకే ఆ పాత పని సంస్కృతిని తాను విడిచిపెట్టానని మోదీ తెలిపారు. మహారాష్ట్రలో రూ.11,200 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాల తాలూకు పని సంస్కృతి కొనసాగి ఉంటే పుణె మెట్రో ఫేజ్-1 వంటి ప్రాజెక్టులు అమలయ్యేవి కావన్నారు.



సిరియాపై అమెరికా దాడులు

37 మంది ఉగ్రవాదులు హతం

వీరికి అల్‌ఖైదా, ఐసిస్‌తో లింక్

బీరుట్, సెప్టెంబరు 29: ఓవైపు హెజ్బొల్లా, హమాస్‌లతో ఇజ్రాయెల్ భీకర యుద్ధం చేస్తుండగా.. మరోవైపు పశ్చిమాసియాలోని సిరియాపైన అమెరికా విరుచుకుపడింది. వాయవ్య సిరియాలోని రెండు లక్ష్యాలపై దాడులు చేసి 37 మంది ఉగ్రవాదులను హతమార్చింది. వీరంతా ఐసిస్, అల్‌ఖైదాతో సంబంధం ఉన్నవారిని అగ్ర రాజ్యం ఆదివారం ప్రకటించింది. హుర్రస్ అల్ దీన్ గ్రూప్‌నకు చెందిన సీనియర్ ఉగ్రవాది, మరో 8 మందిని మట్టుబెట్టే ఉద్దేశంతో అమెరికా దాడులకు దిగింది. కాగా, సిరియాపై ఈ నెల 16న కూడా ఓసారి దాడి చేసింది. స్థానిక నాయకులు సహా సెంట్రల్ సిరియాలోని 28 మంది ఉగ్రవాదులను హతమార్చింది. దీన్ని ఐసిస్ శిక్షణ స్థావరంగా పేర్కొంది. 2014 నాటి అంతర్యుద్ధం నుంచి సిరియాలో అమెరికా బలగాలు ఉన్నాయి. ప్రస్తుతం కొందరు కాంట్రాక్టర్లు సహా 900 మంది సిరియాలో ఉన్నారు. ఐసిస్ మళ్లీ పుంజుకోకుండా అడ్డుకోవడమే దీని వెనుక ఉద్దేశం.

వెంటాడి.. వేటాడి..

(మొదటి పేజీ తరువాయి)

కలిగించే, కలిగించిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టదు. ప్రపంచంలో ఏ మూలకెళ్లినా.. ఎంత నక్కినక్కి దాగినా.. పసిగట్టి వారి పనిపడుతుంది. తమ దేశంపై దాడి చేయడం కాదు.. చేయాలన్న ఆలోచన వచ్చినట్టు తెలిసినా.. ఇజ్రాయెల్ వారిని వెంటాడి వేటాడి చంపుతుంది. ఆ కబంధ హస్తాల నుంచి తప్పించుకోవడం దాదాపు అసాధ్యం. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో లక్షలాది మంది యూదుల ఊచకోతలో ప్రధాన పాత్ర పోషించిన అడాల్ఫ్ ఐచ్‌మన్‌ను అర్జెంటీనాలో కిడ్నాప్ చేసి తమదేశానికి తెచ్చి మరణశిక్ష విధించడం నుంచి.. భూగర్భంలోని బంకర్లలో దాక్కున్న హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లాను మట్టుబెట్టడం దాకా.. ఇజ్రాయెల్ చేపట్టిన ఆపరేషన్ల కచ్చితత్వం అనన్యసామాన్యం! ఇరాన్ ప్రాక్సీ అయిన హిజ్బుల్లా చీఫ్‌ని ఇరానీ గూఢచారి సాయంతోనే చంపగలిగిందంటే ఇజ్రాయెల్ నిఘా సామర్థ్యం ఏస్థాయిలో ఉంటుందో.. లెబనాన్ దేశవ్యాప్తంగా ఉన్న 3000 మందికిపైగా హిజ్బుల్లా ఆపరేటర్ల వద్ద ఉన్న పేజర్లను ఏకకాలంలో పేల్చేయగలిగిందంటే ఇజ్రాయెల్ ప్లానింగ్ ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆపరేషన్లలో నిఘా సేవలు అందించేది ఇజ్రాయెల్ గూఢచార సంస్థ మొసాద్. దీంట్లో నాలుగు ప్రత్యేక విభాగాలుంటాయి. మొదటిది.. జోమెట్. మొసాద్‌లో అతి పెద్ద విభాగం ఇదే. విదేశాల్లో గూఢచర్యం నిర్వహించే కేస్ ఆఫీసర్లు ఈ విభాగం కింద పనిచేస్తారు. వీరిని 'కత్సాస్' అని పిలుస్తారు. వీళ్లు ఆయా దేశాల్లో రకరకాల పేర్లతో స్థిరపడి.. స్థానికులను సైతం ఏజెంట్లుగా నియమించుకుని సమాచారాన్ని సేకరిస్తారు. ప్రభుత్వ విభాగాల్లో అత్యున్నత స్థానాల్లోకి సైతం చొచ్చుకుపోతారు. కొందరు మంత్రిత్వ శాఖల స్థాయికి కూడా చేరుకుంటారు. వారిచ్చే సమాచారం ఆధారంగా పని చేసే విభాగం కేసరియా. ఈ విభాగం విదేశీ గడ్డపై ఆపరేషన్లను నిర్వహిస్తుంది. ఈ విభాగం కింద 'కిడోన్ యూనిట్' ఉంటుంది. శత్రువులను మట్టుబెట్టే అసాసిన్లతో కూడిన బృందం ఇది. మూడది కెషెత్ విభాగం. ఇది ఎలక్ట్రానిక్ నిఘా విభాగం. శత్రువుల సమాచార ప్రసారంపై నిఘా వేస్తుంది. వాళ్ల కాల్స్‌ను ట్రాప్ చేసి ఎప్పటికప్పుడు సున్నితమైన సమాచారాన్ని తెలుసుకుంటుంది. చివరిది.. విదేశీ గడ్డపై విధ్వంస చర్యలకు పాల్పడే 'మెత్సాదా' అనే ప్రత్యేక విభాగం.

ఎన్నో ఆపరేషన్లు..

ఇజ్రాయెల్ ఏర్పాటైన ఏడాదికి.. అంటే, 1949లో ఏర్పాటైన మొసాద్ చేపట్టిన పలు ఆపరేషన్ల గురించి ఇప్పటికీ ప్రపంచదేశాలు కథలు కథలుగా చెప్పుకొంటాయి. అయితే, మొసాద్ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి తొలిసారి పరిచయం చేసింది.. 1972లో చేపట్టిన 'ఆపరేషన్ వ్రాత్ ఆఫ్ గాడ్'. ఆ ఏడాది జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన సమ్మర్ ఒలింపిక్స్‌కు వెళ్లిన ఇజ్రాయెల్ ఒలింపిక్ బృందంలోని 11 మంది అథ్లెట్లను.. పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ బ్లాక్‌సెప్టెంబర్ చంపేసింది. రగిలిపోయిన ఇజ్రాయెల్ ఈ ఆపరేషన్‌ను చేపట్టి నిర్వహణ బాధ్యతను మొసాద్‌పై పెట్టింది. తొలుత.. తమ అథ్లెట్లను చంపినవారందరినీ గుర్తించి, వారి జాబితాను తయారుచేసిన మొసాద్.. వారందరినీ చంపేందుకు 15 మంది సభ్యులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం ఫ్రాన్స్, ఇటలీ, సైప్రస్.. ఇలా యూరప్ దేశాల్లో, మధ్యప్రాచ్య దేశాల్లో మూలమూలల దాగున్న బ్లాక్‌సెప్టెంబర్ సభ్యులను అత్యంత క్రూరంగా, నిర్దాక్షిణ్యంగా చంపేసింది. చంపేయడం అంటే ఏదో.. మామూలుగా ఒక బుల్లెట్ కాల్చి చంపడం కాదు. శత్రువుల తలలోకి బుల్లెట్ల వర్షం కురిపించడం.. పరుపు కింద బాంబు పెట్టి పేల్చేయడం.. ఇలా భయంకరంగా ఉంటాయా హత్యలు. 1972లో మొదలుపెట్టిన ఈ ఆపరేషన్ దాదాపు 1986 దాకా కొనసాగింది! అంతకు ముందు.. జర్మనీలో యూదులపై హత్యాకాండ సాగించిన అడాల్ఫ్ ఐచ్‌మన్‌ను అర్జెంటీనాలో పట్టుకుని, ఇజ్రాయెల్‌కు తరలించిన తీరు కూడా ఒక చరిత్రే. 1945లో జర్మనీ నుంచి తప్పించుకున్న ఐచ్‌మన్.. పలు దేశాలు తిరిగి తిరిగి చివరికి.. నాజీ నరహంతకులకు, యుద్ధ నేరగాళ్లకు ఆశ్రయమిస్తున్న అర్జెంటీనాకు చేరాడు. అక్కడే తన ఇద్దరు పిల్లలు, జీవితభాగస్వామితో స్థిరపడ్డాడు. అతడి గురించి సమాచారం అందుకున్న మొసాద్ ఏజెంట్లు 14 మంది అక్కడికి చేరుకుని నిఘా పెట్టారు. అతడి దినచర్యను గమనించి.. ఒకరోజు సాయంత్రం అతడి కిడ్నాప్‌కి ముహూర్తం పెట్టారు. ఫ్యాక్టరీకి వెళ్లి తిరిగివస్తున్న అతణ్ని కిడ్నాప్ చేసి 9 రోజులుపాటు అక్కడే ఒక ఇంట్లో బంధించి ఉంచారు. కిడ్నాప్ చేయడం సులువేగానీ.. అతణ్ని అర్జెంటీనా అనుమతి లేకుండా ఇజ్రాయెల్‌కు తరలించడం కష్టం. దానికీ ఒక మాస్టర్ ప్లాన్ వేశారు. అర్జెంటీనా ఆహ్వానం మీద ఆ దేశానికి వచ్చిన ఇజ్రాయెల్ మంత్రి చార్టర్డ్ విమానం సిబ్బందిలో ఒకడిగా అతణ్ని దేశం దాటించేశారు. తమ దేశానికి తీసుకెళ్లి విచారణ జరిపి ఉరి తీశారు. ఇలా మొసాద్ చేపట్టిన ఆపరేషన్లపై చాలా సినిమాలు, టీవీ సిరీస్‌లు వచ్చాయి.

విభిన్నంగా..

హత్యలు చేయడమే కాదు.. మొసాద్ తనకున్న నిఘా నెట్‌వర్క్ సాయంతో ఇరాక్, ఇరాన్, సిరియా దేశాల అణు కార్యక్రమాలను తీవ్రంగా దెబ్బతీసింది. ఇరాక్‌లో అయితే ఏకంగా న్యూక్లియర్ బేస్‌పైనే బాంబులు వేసింది. ఇరాన్‌కు చెందిన ఆరుగురు అణు శాస్త్రవేత్తలను చంపేయడం ద్వారా ఆ దేశ అణు లక్ష్యాలను నిలువునా నీరుగార్చింది. హత్యలు చేయడంలో కూడా మొసాద్ ఎప్పటికప్పుడు వినూత్న విధానాలను కనిపెడుతుంది. కొత్త విషాలపై ప్రయోగాలు చేస్తుంది. శత్రువులను చంపడానికి అణుధార్మిక పదార్థాలనూ వాడుతుంది. మొసాద్ తన లక్ష్యాలను చేరుకునే క్రమంలో పలు దేశాల గూఢచార సంస్థలతో కలిసి పనిచేస్తుంది. 9/11 దాడుల గురించి అమెరికాకు మొసాద్ ఒక నెలరోజుల ముందే సమాచారం ఇచ్చి హెచ్చరించినట్టు చెబుతారు. అలాగే.. అబొత్తాబాద్‌లో తలదాచుకున్న లాడెన్ లొకేషన్‌ను గుర్తించడానికి ఇజ్రాయెల్ సహకారం ఉందని సీఐఏ మాజీ చీఫ్ జాన్‌బ్రెన్నన్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు.

చివరగా: హిజ్బుల్లా చీఫ్ నస్రల్లాను చంపడానికి ఇజ్రాయెల్ ఏకంగా ఎఫ్15 విమానాలు వేసుకుని ఆ దేశ గగనతలంలోకి వెళ్లి.. బాంబుల వర్షం కురిపించింది! ఎందుకింత కసి అంటే.. 'చంపడం అంటే ఏదో చంపామన్నట్టు ఉండకూడదు. శత్రువు వెన్నులో వణుకు పుట్టాలి. తమ భుజం వెనుక నుంచి మొసాద్ అనుక్షణం తమను గమనిస్తోందన్న భయం, వదిలిపెట్టదన్న భయం వారిలో ఉండాలి. అందుకే ఇలా..' అని మొసాద్ మాజీ చీఫ్ ఒకరు చెప్పారు! అదీ సంగతి!!

- సెంట్రల్ డెస్క్

బీజేపీ పగ్గాలు చౌహాన్ చేతికి?



న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా స్థానంలో పార్టీ పగ్గాలు ఎవరికి అప్పగిస్తారనేది ఆసక్తికరంగా మారింది. పార్టీ అధ్యక్ష పదవికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్(65) పేరును ఆర్ఎస్సెస్‌తో పాటు బీజేపీలోని పలు వర్గాలు సమర్థించినట్లు తెలుస్తోంది. ప్రశాంతంగా ఉండే తత్వం, రాజకీయ చతురతకు తోడు అసాధారణ మీడియా మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు ఉన్న ఆయన బలమైన పోటీదారుగా నిలిచారు. మూడు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న శివరాజ్ సింగ్.. క్లిష్టమైన సవాళ్లను సైతం ఎదుర్కోగలనని నిరూపించుకున్నారని, అధ్యక్ష పదవి కోసం పోటీపడుతున్న ఇతర నాయకుల్లో ఎవరికీ ఈ లక్షణాలు లేవని ఆరెస్సెస్ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ జాతీయ అధ్యక్ష పదవికి ఇప్పటివరకూ చర్చించిన నేతల్లో చౌహాన్ అత్యుత్తమ ఎంపికని, ఆయనకున్న ప్రజాదరణకు తోడు విస్తృతమైన అనుభవంతో పార్టీకి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపాయి. బీజేపీతో పాటు సంఘ్‌తో ఆయనకున్న దశాబ్దాల నాటి అనుబంధం కూడా పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాయి. ఆరెస్సెస్‌లో అజాతశత్రువుగా పేరొందిన శివరాజ్‌కున్న పోరాడే తత్వం, శ్రేణుల్లో ఏకాభిప్రాయాన్ని సాధించే నేర్పు జాతీయ స్థాయిలో బీజేపీని నడిపించే నాయకుడికి ఉండాల్సిన కీలక నైపుణ్యాలని ఆరెస్సెస్ ప్రముఖుడు ఒకరు అభిప్రాయపడ్డారు.

జాబిల్లిపై అతి పురాతన బిలం..!

- ఇది 8.35 బిలియన్ ఏళ్ల క్రితం నాటిది
- ల్యాండర్ దిగింది ఇక్కడే: శాస్త్రవేత్తలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: ఇస్రో ప్రతిష్ఠాత్మక మూన్ మిషన్ చంద్రయాన్-3కు సంబంధించిన మరో కీలక అప్‌డేట్ వచ్చింది. చంద్రయాన్-3 మిషన్, ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించిన శాస్త్రవేత్తలు.. విక్రమ్ ల్యాండర్ జాబిల్లిపై ఉన్న అతిపురాతన బిలంపై దిగి ఉండొచ్చని తెలిపారు. సుమారు 160 కిలోమీటర్ల వ్యాసం కలిగిన ఈ బిలం 8.35 బిలియన్ సంవత్సరాల క్రితంనాటి నెక్టేరియన్ కాలంలో ఏర్పడి ఉంటుందని, ఇది చంద్రుని చరిత్రలో అత్యంత పురాతనమైన కాలాల్లో ఒకటని అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ, ఇస్రో శాస్త్రవేత్తల బృందం పేర్కొంది. ఆ వివరాలను ఇకారస్ అనే సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. 'చంద్రయాన్-3 దిగిన ప్రాంతం మరే ఇతర మిషన్లూ వెళ్లని ఒక ప్రత్యేకమైన భౌగోళిక వాతావరణంలో ఉంది. ల్యాండర్‌లోని ప్రజ్ఞాన్ రోవర్ పంపిన ఈ ప్రాంతానికి సంబంధించిన చిత్రాలు.. కాలక్రమేణా చంద్రుడు ఎలా పరిణామం చెందాడో వెల్లడిస్తాయి' అని ఫిజికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీలో ప్లానెటరీ సైన్సెస్ డివిజన్ అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్ విజయన్ తెలిపారు. సాధారణంగా ఒక గ్రహాన్ని, లేదా చంద్రుడి వంటి భారీ ఉపరితలాన్ని గ్రహ శకలం ఢీకొట్టినప్పుడు బిలం ఏర్పడుతుంది. అలా ఏర్పడిందే ఈ పురాతన బిలమని, విక్రమ్ ల్యాండర్ దిగిన ప్రాంతానికి దగ్గరలోనే ఇది ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు.

యూపీలో రైల్వే ట్రాకుపై అగ్నిమాపక పరికరం

- మరో రెండు చోట్ల కాంక్రీట్ స్తంభం, రాళ్లు

న్యూఢిల్లీ, మహోబా, సెప్టెంబరు 29: ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే ట్రాకులపై దుండగుల దుశ్చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. ముంబై నుంచి లఖ్‌నవూ వెళ్తోన్న పుష్పక్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలెట్ గోవిందపురి స్టేషన్ దగ్గరలో ఆదివారం సాయంత్రం 4.15 గంటలకు రైల్వేట్రాకుపై అగ్నిమాపక పరికరాన్ని(ఎర్రని సిలిండర్) గుర్తించి రైలుకి బ్రేకులు వేశారు. దీంతో దానికి కొద్ది దూరంలో రైలు ఆగింది. ఆ సమయంలో రైలు తక్కువ వేగంతో వెళుతుండడంతో ముప్పు తప్పిందని లోకోపైలెట్ తెలిపారు. కంట్రోల్‌రూమ్‌కి సమాచారం ఇచ్చాక దాన్ని కాన్పూర్ సెంట్రల్ స్టేషన్ తీసుకువచ్చారు. అది రైల్వేకి సంబంధించిన అగ్నిమాపక పరికరమేనని గుర్తించారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఇదే రాష్ట్రంలో బాందా-మహోబా రైల్వే ట్రాకుపై శనివారం మధ్యాహ్నం కాంక్రీట్ స్తంభం ఉంచారు. దీంతో ఆ మార్గంలో వస్తోన్న పాసింజర్ రైలును లోకోపైలెట్ అత్యవసర బ్రేకులు వేసి నిలిపివేశారు. పోలీసులు, రైల్వే రక్షక దళ సిబ్బంది అక్కడికి చేరుకుని రైల్వేట్రాకుపై ఆ స్తంభాన్ని ఉంచిన 16 ఏళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. యూపీలోని భైరియా ప్రాంతంలోనూ శనివారం ఉదయం ఇటువంటి ఘటనే చోటు చేసుకుంది. భైరియా ప్రాంతంలో రైల్వేట్రాకుపై ఉంచిన రాయిని రైలు ఇంజను ఢీకొంది. అయితే లోకోపైలెట్ అత్యవసర బ్రేకులు వేసి ఆపడంతో ఎటువంటి నష్టం వాటిల్లలేదని రైల్వే అధికారులు తెలిపారు. దీనికి కారకులను గుర్తించేందుకు రైల్వే రక్షక దళం ఆదివారం ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. అంతేగాక ఆ మార్గంలో పెట్రోలింగ్ ఏర్పాటు చేశారు.

నువ్వు అవినీతిపరుడివి..

నువ్వే నిందితుడివి!

(మొదటి పేజీ తరువాయి)

అర్థం చేసుకోవచ్చని, ఏపీకి చెందిన చంద్రశేఖర్.. హిమాచల్‌ప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికై 25 ఏళ్లుగా రాష్ట్రంలోనే కొనసాగుతున్నారని తెలిపారు. బెంగళూరులో ఆయనకు ఎవరితో సంబంధాలు ఎలాంటివో, ఎవరెవరితో సన్నిహితంగా ఉన్నారో, ఎలాంటి అక్రమాలకు పాల్పడ్డారో తెలుసని వ్యాఖ్యానించారు. గవర్నర్ కార్యాలయం నుంచే లేఖలు లీకయ్యాయనే కట్టుకథ చెప్పి రాజ్‌భవన్ సిబ్బందిని విచారించాలని లేఖ రాయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. "భూదందాలో రూ.20 కోట్లు డిమాండ్ చేసిన విషయమై ఓ ఇన్‌స్పెక్టరే ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ భార్య పేరిట 38 అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ ఉంది. రాజకాలువపై కట్టారు. చెరువును ఆక్రమించుకున్నారు" అని కుమారస్వామి తీవ్రస్థాయిలో ఆరోపించారు.

బెయిల్‌పై ఉన్న నిందితుడు: చంద్రశేఖర్

కేంద్రమంత్రి కుమారస్వామి ఆరోపణలకు ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్ దీటుగా స్పందించారు. కేసులో నిందితుడైన కుమారస్వామికి భయపడేది లేదన్నారు. ఆయన ఎంత శక్తిమంతుడైనా, ఎంత ఉన్నత హోదాలో ఉన్నా బెయిల్‌పై ఉన్న నిందితుడేనని వ్యాఖ్యానించారు. "పందులతో ఎప్పుడూ కుస్తీ పడరాదు. ఇద్దరికీ మురికి అంటుతుంది. పంది దాన్నే కోరుకుంటుందని జార్జ్ బెర్నార్డ్ షా వ్యాఖ్యానించారు" అని సంచలన కామెంట్లు చేశారు. ఈ మేరకు చంద్రశేఖర్ సిట్ సిబ్బందికి ఓ లేఖ రాశారు. 'ఒక ఆరోపితుడు' అంటూ కేంద్రమంత్రిపై విరుచుకుపడ్డారు. తనపై వ్యక్తిగత ఆరోపణలు చేశారని మండిపడ్డారు. "మాన్యతాటెక్‌పార్క్ సమీపంలో 38 అంతస్తుల భవనం నిర్మిస్తున్నానని ఆరోపించారు. ఇది నిజం కాదు. నిజానికి ఆయనే పలు కేసులు ఎదుర్కొంటున్నారు. సిట్ ప్రాసిక్యూషన్ అనుమతులు కోరగా.. కుమారస్వామి బెయిల్ తెచ్చుకున్నారు. ప్రస్తుతం మమ్మల్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని ఆరోపణలు చేస్తున్నారు" అని లేఖలో ప్రస్తావించారు. సిట్ ముఖ్యుడిగా నిర్భయంగా పనిచేస్తున్నానని, వివాదంలో వాస్తవాలను బయటకు తీస్తానని చెప్పారు. కాగా, ఐపీఎస్ అధికారి చంద్రశేఖర్ ప్రస్తావించిన అంశాలపై కేంద్రమంత్రి కుమారస్వామి నేరుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఫిర్యాదు చేశారు. శనివారం అమిత్‌షాకు ఫోన్ చేసిన ఆయన చంద్రశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని కోరినట్టు సమాచారం. ఐపీఎస్‌పై అమిత్‌షా కూడా తీవ్రంగానే స్పందించినట్టు తెలుస్తోంది. కాగా, ఐపీఎస్ అధికారి వ్యాఖ్యలను జేడీఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది.

చంద్రశేఖర్ క్షమాపణలు చెప్పాలి: ప్రహ్లాద్‌జోషి

లోకాయుక్త ఏడీజీపీ చంద్రశేఖర్ తీరుపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మండిపడ్డారు. కుమారస్వామిపై అసభ్యపదాలు ప్రయోగించడం సరికాదన్నారు. ఆయనపై చర్యలు తీసుకునేలా సూచనలు చేస్తానని, చర్యలు తప్పవని ప్రహ్లాద్‌జోషి హెచ్చరించారు. హుబ్బళ్లిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేంద్రమంత్రి పట్ల అనుచితమైన పదాలు వాడడం సరికాదన్నారు. ఏడీజీపీ హోదాలో ఉంటూ సర్వీస్ కండక్ట్ నిబంధనల గురించి జ్ఞానం లేకుండా లేఖలో ప్రస్తావించారని, వెంటనే క్షమాపణలు చెప్పాలని సూచించారు. కుమారస్వామి ఎవరిపట్ల అసభ్యంగా మాట్లాడలేదనీ, ఏకవచనంతో మాట్లాడలేదని అన్నారు.

అధికారులపై ఆరోపణలు సరికాదు: సిద్దు

లోకాయుక్త ఏడీజీపీపై కేంద్రమంత్రి కుమారస్వామి ఆరోపణలు చేయడం సరికాదని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. మైసూరులో ఆదివారం మాట్లాడుతూ.. ఈ అంశంపై తాను ఇంతకన్నా స్పందించబోనన్నారు. రాష్ట్ర హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ.. రాజ్‌భవన్ నుంచి సమాచారం లీకైన వ్యవహారంపై విచారణకు తాము సిద్ధమని తెలిపారు. దీనికి గవర్నర్ అనుమతి ఇవ్వాలన్నారు. రాజ్‌భవన్ నుంచి సమాచారం లీకైతే దానికి వారే కారకులన్నారు.

జమిలిపై ముందుకే!



పార్లమెంటులో 3 బిల్లులు పెట్టనున్న మోదీ ప్రభుత్వం!

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: లోక్‌సభలో బీజేపీకి సొంతంగా మెజారిటీ లేకపోయినా.. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'పై మోదీ ప్రభుత్వం ఏ మాత్రం వెనక్కి తగ్గడంలేదు. జమిలి ఎన్నికలను సాకారం చేసేందుకు పార్లమెంటులో మూడు బిల్లులను ప్రవేశపెట్టాలని సంకల్పించింది. వీటిలో రెండు రాజ్యాంగ సవరణ బిల్లులు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసులను కేంద్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించిన సంగతి తెలిసిందే. ప్రతిపాదిత మొదటి రాజ్యాంగ సవరణ బిల్లు ప్రకారం.. 'అపాయింటెడ్ డే (ప్రభుత్వం ప్రారంభమయ్యే రోజు)'కు సంబంధించి 82ఏ అధికరణలో కొత్తగా సబ్‌క్లాజ్ (1) చేరుస్తారు. లోక్‌సభ, అన్ని రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల అసెంబ్లీల పదవీకాలాన్ని ఒకేసారి ముగించేందుకు 82ఏలోనే సబ్‌క్లాజు (2) జోడిస్తారు. ఇక లోక్‌సభ పదవీకాలం, రద్దుకు సంబంధించి 83(2) అధికరణను సవరించి కొత్తగా సబ్‌క్లాజ్ (3), (4)లను చేరుస్తారు. రాష్ట్రాల అసెంబ్లీల రద్దు నిబంధనలూ ఇందులో ఉంటాయి. 327అధికరణను సవరించి 'సమాంతర ఎన్నికలు' అనే పదబంధాన్ని జోడిస్తారు. ఈ బిల్లుకు కనీసం సగం రాష్ట్రాలు ఆమోదించాల్సిన అవసరం లేదని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. దీనిని క్యాబినెట్ ఆమోదించింది. ఇక రెండో రాజ్యాంగ సవరణకు మాత్రం కనీసం సగం రాష్ట్రాల అంగీకారం తప్పనిసరి. ఎందుకంటే ఇది స్థానిక ఎన్నికలకు సంబంధించింది. పూర్తిగా రాష్ట్ర జాబితాలోని అంశం. లోక్‌సభ/అసెంబ్లీ ఎన్నికలతో పాటు సమాంతరంగా పంచాయతీరాజ్/పురపాలక, నగరపాలక సంస్థలకూ ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల(ఎస్ఈసీ)తో కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సంప్రదింపులు జరిపి అన్ని ఎన్నికలకూ ఒకే ఓటర్ల జాబితా రూపొందించడానికి ఉద్దేశించిన బిల్లు ఇది. దీనిప్రకారం 324ఏ అధికరణను కొత్తగా చేరుస్తారు. రాజ్యాంగం ప్రకారం ఈసీ, ఎస్ఈసీ వేర్వేరు వ్యవస్థలు. ఈసీ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ, రాజ్యసభ, అసెంబ్లీ, శాసన మండలి ఎన్నికలు నిర్వహిస్తుంది. ఎస్ఈసీ పంచాయతీలు, మునిసిపాలిటీల ఎన్నికల నిర్వహణ బాధ్యత చూస్తున్న సంగతి తెలిసిందే. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియమ నిబంధనలు కేంద్ర పాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, ఢిల్లీ, జమ్మూకశ్మీరు అసెంబ్లీలకు కూడా వర్తించేలా మూడు చట్టాలు.. ఢిల్లీ దేశరాజధాని ప్రాంత ప్రభుత్వ చట్టం (1991), కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం (1963), జమ్మూకశ్మీరు పునర్వ్యవస్థీకరణ (2019) చట్టాలను సవరించాలని మూడో బిల్లులో ప్రతిపాదించనున్నారు. వీటికి సంబంధించిన అధికరణల్లో 12 కొత్త సబ్‌క్లాజులను చేరుస్తారు. రెండు దశల్లో జమిలి ఎన్నికలను నిర్వహించాలని కోవింద్ కమిటీ సూచించింది. మొదటి దశలో లోక్‌సభ, అన్ని రాష్ట్రాలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని పేర్కొంది. ఇవి జరిగిన వంద రోజుల్లోపు రెండో దశలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరపాలని సిఫారసు చేసింది.

'ఆయుష్మాన్ భారత్'లో

అర్హులైన వృద్ధులను చేర్చండి

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: 'ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా' పథకంలో అర్హులైన వృద్ధులను చేర్పించాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. 70 ఏళ్లు, ఆ పైన వయసున్న వారిని ఈ పథకంలో చేర్చాలని సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ అదనపు కార్యదర్శి ఎల్.ఎస్. చాంగ్‌సాంగ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. ఈ పథకంలో వృద్ధుల నమోదుకు ఆయుష్మాన్ మొబైల్ యాప్, వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరాలనుకునే వృద్ధులు యాప్ లేదా పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఏడాదంతా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ పథకం కింద సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు పైబడిన వృద్ధులందరికీ ఆరోగ్య బీమా (ఏడాదికి రూ.5 లక్షలు) వర్తిస్తుందని తెలిపారు. ఆధార్‌లో ఉన్న వయసు ఆధారంగా వృద్ధులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తమిళనాడు ఉప ముఖ్యమంత్రిగా

ఉదయనిధి స్టాలిన్

- సెంథిల్‌బాలాజీకి మళ్లీ మంత్రి పదవి



చెన్నై, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా డీఎంకే అధ్యక్షుడు, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తనయుడు ఉదయనిధి స్టాలిన్ పదవీ బాధ్యతలు చేపట్టారు. సీఎం స్టాలిన్ సిఫారసు మేరకు యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రిగా ఉన్న ఉదయనిధిని గవర్నర్ రవి ఉపముఖ్యమంత్రిగా నియమిస్తూ శనివారం రాత్రి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. తమిళనాట తొలిసారిగా స్టాలిన్ ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత అన్నాడీఎంకే హయాంలో ఓ. పన్నీర్‌సెల్వం ఉప ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టారు. తమిళనాడు మూడో ఉప ముఖ్యమంత్రిగా ఉదయనిధి నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం రాజ్‌భవన్‌లో కొత్తగా నలుగురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో అక్రమ నగదు బట్వాడా తదితర అవినీతి కేసులో అరెస్టయి 15మాసాలపాటు జైలులో గడుపుతూ ఇటీవల సుప్రీం కోర్టు జారీ చేసిన బెయిలుపై విడుదలైన సెంథిల్‌బాలాజీ కూడా ఉన్నారు. ఈయనకు మళ్లీ విద్యుత్, ఎక్సైజ్‌శాఖలను కేటాయించారు.

వైద్య ఖర్చులు పైపైకి..!

- భారత్‌లో ప్రతి ఏటా 14% పెరుగుదల
- గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు అధికం
- అకో ఇండియా హెల్త్ ఇండెక్స్‌లో వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 29: పెరుగుతున్న ధరలు, ఇతర వ్యయాలతో నెలనెలా కుటుంబ బడ్జెట్ తలకిందులవుతోంది. వీటికితోడు ఇటీవల వైద్య ఖర్చులు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. భారత్‌లో ప్రజల ఆస్పత్రి ఖర్చులు ఏడాదికి 14% పెరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అకో (ఏసీకేవో) అనే బీమా సంస్థ రూపొందించిన తాజా నివేదికలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సంస్థ విడుదల చేసిన 'అకో ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ ఇండెక్స్-2024'... భారత్‌లో ఆరోగ్య ద్రవ్యోల్బణం 14 శాతంగా ఉందని, ఆరోగ్య సంరక్షణ వ్యయం ప్రతి ఏడాది 14% పెరుగుతోందని పేర్కొంది. 23% మంది ఈ ఆస్పత్రి చార్జీలను రుణాల ద్వారా సమకూర్చుకుంటున్నారని, ఇది ఆయా కుటుంబాలను విపరీతమైన ఆర్థిక కష్టాల్లోకి నెడుతున్నాయని నివేదిక పేర్కొంది. దేశంలో ఇంకా 68% మంది ఆరోగ్య ఖర్చులను తమ జేబు నుంచే చెల్లిస్తున్నారని తెలిపింది. దేశవ్యాప్తంగా నమోదవుతున్న ఆరోగ్య పాలసీ క్లెయిములను విశ్లేషించిన అకో.. మూత్ర పిండాల వ్యాధుల్లో దేశ రాజధాని ఢిల్లీ అగ్రస్థానంలో ఉన్నట్టు గుర్తించింది. కిడ్నీ చికిత్స క్లెయిములు ఇక్కడే ఎక్కువగా ఉన్నాయని, ఆ తర్వాతి స్థానం కొచ్చిదని తెలిపింది. కొచ్చితోపాటు హైదరాబాద్, బెంగళూరు, జైపూర్‌లో దాఖలవుతున్న క్లెయిముల జాతీయ సగటు కంటే అధికంగా ఉందని తెలిపింది. కిడ్నీ చికిత్సలకు క్లెయిమ్ చేసే రోగుల సగటు వయస్సు 47 ఏళ్లుగా ఉందని పేర్కొంది. మూత్రపిండాల ఆరోగ్యంతోపాటు గుండెజబ్బులు, ఇతర క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను కూడా ఈ నివేదిక ఎత్తి చూపింది. గుండె జబ్బుల చికిత్స క్లెయిములు ఎక్కువగా నమోదైన నగరాల్లో కోల్‌కతా, ముంబై ముందువరుసలో ఉన్నాయని తెలిపింది. 2020 నుంచి 2024 మధ్యకాలంలో క్యాన్సర్ కేసులు 13% పెరిగాయని ఈ నివేదిక వెల్లడించింది.

విశాఖలో 8-స్క్రీన్ ఐమ్యాక్స్ మల్టీప్లెక్స్ మాల్

- విజయవాడ, తిరుపతిల్లో హైపర్ మార్కెట్ల నిర్మాణం
- ఏపీలో ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్ కేంద్రాల ఏర్పాటు
- లులూ గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ ట్వీట్

అమరావతి, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుతో తనకు 18ఏళ్ల అనుబంధం ఉందని, ఆయనతో జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయని లులూ గ్రూపు చైర్మన్ యూసుఫ్ అలీ పేర్కొన్నారు. శనివారం తమ బృందంతో పాటు అమరావతికి వచ్చిన యూసుఫ్ అలీ ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో మధ్యాహ్నం దాదాపు రెండు గంటల పాటు చంద్రబాబు వారితో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. దీనికి సంబంధించి ఆదివారం యూసుఫ్ అలీ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. విశాఖపట్నంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 8-స్క్రీన్ ఐమ్యాక్స్ మల్టీప్లెక్స్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించాలని, విజయవాడ, తిరుపతిలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన హైపర్ మార్కెట్లతో పాటు ఏపీలో అధునాతనమైన ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, లులూ ప్రతినిధి బృందంతో చర్చల సారాంశాన్ని చంద్రబాబు 'ఎక్స్' వేదికగా వివరించారు. 'యూసుఫ్ అలీ, ఇతర ప్రతినిధి బృందంతో ప్రొడక్టివ్ మీటింగ్ జరిగింది. రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులతో పాటు వైజాగ్‌లో మాల్, మల్టీప్లెక్స్, హైపర్ మార్కెట్, విజయవాడ, తిరుపతిల్లో మల్టీప్లెక్స్‌ల నిర్మాణ ప్రణాళికలపై చర్చించాం. లులూకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం, మద్దతు అందిస్తుంది' అని ఆ ట్వీట్‌లో చంద్రబాబు పేర్కొన్నారు.

లోన్ యాప్ వేధింపులకు యువకుడు బలి

భీమదేవరపల్లి, సెప్టెంబరు 29 : లోన్ యాప్ వేధింపులు భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో జరిగింది. ముల్కనూర్ గ్రామానికి చెందిన మాడ్గుల అనిల్ (29) డిగ్రీ పూర్తి చేసి నిరుద్యోగిగా ఇంటి వద్దే ఉంటున్నాడు. తన స్నేహితులు, బంధువులతో కలిసి ఆయా లోన్‌యాప్‌లతో పాటు పలువురి వద్ద సుమారు రూ. 9 లక్షల వరకు అప్పులు చేశాడు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించకపోవడంతో లోన్‌యాప్‌ల నుంచి వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో ఆదివారం క్రిమిసంహారక మందు తాగాడు. వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ఫోక్ సింగర్ మల్లిక్‌తేజపై అత్యాచారం కేసు

- లైంగికంగా వేధించాడని యువతి ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 29: జగిత్యాల జిల్లాకు చెందిన జానపద గాయకుడు మల్లిక్‌తేజపై అత్యాచారం కేసు నమోదైంది. మల్లిక్‌తేజ తనపై అత్యాచారం చేశాడని జగిత్యాల మండలానికి చెందిన ఓ యువతి పోలీసులను ఆశ్రయించింది. జగిత్యాల జిల్లాలో సాంస్కృతిక సారథిలో ఉద్యోగం చేస్తున్న మల్లిక్‌తేజ తనను బ్లాక్‌మెయిల్ చేసి పలుమార్లు స్టూడియోలో అత్యాచారం చేశాడని యువతి ఆరోపించింది. తన యూట్యూబ్ ఛానల్, ఇన్‌స్టాగ్రామ్ ఐడీల పాస్‌వర్డ్‌లను మల్లిక్‌తేజ మార్చాడని.. పెళ్లి చేసుకోకుంటే పాస్‌వర్డ్‌లు ఇవ్వనని వేధిస్తున్నాడని పేర్కొంది. యువతి ఫిర్యాదుతో మల్లిక్‌తేజపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్ట్ షాపు నిర్వహిస్తే రూ.లక్ష జరిమానా

- యాదాద్రి భువనగిరి జిల్లా సంగ్యాతండాలో తీర్మానం

తుర్కపల్లి, సెప్టెంబరు 29: గ్రామంలో మద్యం విక్రయించే బెల్ట్ షాపులను నిర్వహిస్తే లక్ష రూపాయల జరిమానా విధించాలని గ్రామ పెద్దలు, యువకులు తీర్మానించారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం జేతురాంతండా పంచాయతీ పరిధిలోని సంగ్యాతండా గ్రామస్థులు ఆదివారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. మండలకేంద్రానికి 3 కి.మీ.దూరంలో ఉన్న ఈ తండాలో 500మందికిపైగా జనాభా ఉంది. మండల కేంద్రం సమీపంలో 3 మద్యం దుకాణాలుంటే సంగ్యాతండాలో అనధికారికంగా ఆరు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. తండాలో మద్యం విక్రయాలతో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, యువత భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని గ్రామ పెద్దలు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో బెల్ట్ షాపు నిర్వహిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని తీర్మానించారు.

పదేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం

నిందితుడి ఇంటికి నిప్పుపెట్టిన స్థానికులు

- సిద్దిపేట జిల్లాలో ఘటన



మంటల్లో నిందితుడి ఇల్లు

చేర్యాల, సెప్టెంబరు 29: సిద్దిపేట జిల్లాలో ఇంట్లో ఒంటరిగా ఉన్న పదేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. తనపై జరిగిన అఘాయిత్యాన్ని ఎవ్వరికీ చెప్పకుండా తనలోనే దాచుకున్న ఆ చిన్నారి అస్వస్థతకు గురవ్వగా.. తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లడంతో విషయం బయటపడింది. దీంతో విషయం పోలీసుల దృష్టికి వెళ్లగా నిందితుడు అరెస్టయ్యాడు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురిలో రెండో అమ్మాయి(10) ఐదో తరగతి చదువుతోంది. ఎప్పట్లాగే శుక్రవారం కూడా పాఠశాలకు వెళ్లి వచ్చిన ఆ బాలిక సాయంత్రం ఇంట్లో ఒంటరిగా ఉంది. బాధిత బాలిక చెల్లెలు ఇంటి బయట ఆడుకుంటుంది. వారి ఎదురింట్లో ఉండే షర్ఫుద్దీన్(20) ఇదే అదనుగా భావించి ఇంట్లోకి ప్రవేశించి ఆ చిన్నారిపై అత్యాచారం చేసి వెళ్లిపోయాడు. షర్ఫుద్దీన్ తమ ఇంట్లో నుంచి బయటికి రావడాన్ని బాధిత బాలిక చెల్లెలు చూసింది. అయితే, అత్యాచారం విషయాన్ని దాచిన బాధిత బాలిక.. తనకు నొప్పిగా ఉందని, జ్వరం కూడా ఉందని శనివారం ఉదయం తల్లిదండ్రులకు చెప్పగా వారు స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో షర్ఫుద్దీన్ ఇంటికి వచ్చి వెళ్లిన విషయాన్ని బాలిక చెల్లెలు తల్లిదండ్రులకు చెప్పడంతో అసలు విషయం బయటకొచ్చింది. దీంతో బాధిత కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా బాలికను వైద్య పరీక్షలకు తరలించి, నిందితుడు, అతని కుటుంబాన్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఆదివారం ఉదయం ఈ అత్యాచారం విషయం తెలుసుకున్న స్థానికులు, బాధిత కుటుంబ తరపు వారు నిందితుడి ఇంటిపై పెట్రోలు పోసి నిప్పుపెట్టారు. ఇంటి ఆవరణలో ఉన్న ఓ కారు, ఎక్స్‌కవేటర్‌ను ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకుని న్యాయం చేస్తామని చెప్పి శాంతింపజేశారు. కాగా, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బాధితురాలి తల్లితో ఫోన్ మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆదివారం సాయంత్రం గ్రామానికి చేరుకున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

నిందితుడి అరెస్ట్ : సీపీ

మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ తెలిపారు. బాధిత బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. బాలికను సిద్దిపేట ఏరియా ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నామని తెలిపారు. ఈ ఘటనపై సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. కోపోద్రిక్తులై నిందితుడి ఇంటిపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు అనురాధ తెలిపారు. గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ ఇంటి వద్ద రెక్కీ

- అర్ధరాత్రి సెల్‌ఫోన్లలో ఇంటి చిత్రీకరణ
- ఇద్దరు నిందితులను పట్టుకున్న స్థానికులు
- వారి ఫోన్లలో రివాల్వర్లు, బుల్లెట్ల చిత్రాలు



నిందితులు ఖాజా మహ్మద్, షేక్ ఇస్మాయిల్

అఫ్జల్‌గంజ్/మంగళ్‌హాట్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహించిన ఇద్దరిని స్థానికులు పట్టుకున్నారు. ఆపై దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు. బోరబండకు చెందిన ఖాజా మహ్మద్ (24), షేక్ ఇస్మాయిల్(30) కొద్ది రోజులు ర్యాపిడోలో వాహనాలు నడిపారు. ప్రస్తుతం మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి వారిద్దరూ బైక్‌పై ధూల్‌పేటలోని రాజాసింగ్ ఇంటి వద్దకు చేరుకున్నారు. వారి సెల్‌ఫోన్లలో ఆ ఇంటిని చిత్రీకరించారు. గమనించిన స్థానికులు.. అనుమానంతో వారి సెల్‌ఫోన్లను చెక్ చేశారు. అందులో రాజాసింగ్ ఇంటి ఫొటోలతోపాటు రివాల్వర్, బుల్లెట్ల ఫొటోలు కనిపించాయి. దీంతో వారిని పోలీసులకు అప్పగించారు. అయితే, తాము రాజాసింగ్‌ను చంపడానికి రాలేదని, తమకు ఉగ్రవాదులతో సంబంధాలులేవని నిందితులు విచారణలో చెప్పినట్లు తెలిసింది. ఓ విషయంలో స్నేహితులతో గొడవ పడ్డామని, రాజాసింగ్‌తో పాటు ఆయన ఇంటి ఫొటోలను స్టేటస్‌లో, ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టి..వారిని భయపెడదామని అనుకున్నామని చెప్పినట్లు సమాచారం. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు.

విచారణలో నిజం తెలుస్తుంది: రాజాసింగ్

తన ఇంటి వద్ద 2010లోనూ ఇదే తరహా ఘటన జరిగిందని ఎమ్మెల్యే రాజాసింగ్ తెలిపారు. ఐఎస్ఐ ఉగ్రవాదిగా అనుమానిస్తున్న ఓ వ్యక్తి తన ఇంటిపై రెక్కీ చేశాడని, అతడిని కర్ణాటక పోలీసులు అరెస్ట్ చేసిన తర్వాత ఆవిషయం తెలిసిందన్నారు. 2012 లోనూ పాతబస్తీలోని భాగ్యలక్ష్మి దేవాలయాన్ని, తనను టార్గెట్ చేసినట్టు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఇప్పుడు నిందితులు ఎవరన్నది విచారణలో తెలియాల్సి ఉందన్నారు.

వివిధ
vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక
బొమ్మలు: అక్బర్

ఓ నాలుగు కెరటాలు


సముద్రం
ఓ పేద్ద చేప
అలలు
మొప్పలు
మామూలు చేప
నీళ్ళల్లో బతుకుతుంటే
ఇది చిత్రంగా
భూమ్మీద జీవిస్తుంది

సముద్రం
ఓ పేద్ద గుండె
అలలు
ధమనులు
మామూలు గుండె
లబ్ డబ్ అని కొట్టుకుంటుంటే
ఇది ఆటుపోట్లతో స్పందిస్తుంది

సముద్రం
ఓ సజీవపద్యం
అలలు
పాదాలు
మామూలు పద్యం
చదివితేగాని అర్థం కాదు
దీన్ని చూడగానే గొప్ప రససిద్ధి కల్గుతుంది

సముద్రం
దిగంతాలకు ఆవలినుండి
ఆత్రంగా ఆత్మీయంగా
తీరాన ఉన్న నన్ను
తనివితీరా
చూసిపోవడానికొస్తున్న మా అమ్మ

■ నలిమెల భాస్కర్



రచయిత తపన అర్థమైతేనే మంచి అనువాదం

– అవినేని భాస్కర్

పాఠకులు ఎంతో ఇష్టపడి చదివిన 75 అనువాద కథలు, 2 అనువాద సంపుటాలతో తెలుగు తమిళ పాఠకులను కథాసూత్రంతో బంధించిన రచయిత, తను నిమిత్తమాత్రుడై మూలరచనను, మూలరచయితను ఎత్తిపట్టి పాఠకులకి చేరువ చేయడానికి తపన పడే అరుదైన అనువాదకుడు అవినేని భాస్కర్‌తో ముఖాముఖి.

■ కె. ఎన్. మల్లీశ్వరి



తెలుగు, తమిళ భాషల మధ్య అనువాదం చేయగల సయోధ్య ఎలా సాధించారు?

తెలుగు, తమిళం రెండూ ఒకే నది నుండి చీలిన పాయలలాంటివి. రెండు సంస్కృతులకూ చాలా దగ్గరి పోలికలు, సూక్ష్మ భేదాలు ఉన్నాయి. తమిళనాడులో పుట్టి పెరిగిన తెలుగువాణ్ణి. తెలుగు నా మాతృభాష. తమిళసాహిత్యం ఊహ తెలిసిననాటి నుండి చదువుతూనే ఉన్నాను. ఈ రెండు భాషల సాహిత్యంతో నాకున్న పరిచయం, ప్రవేశం వల్ల సయోధ్య సాధించడం సులభమైంది.

అనువాదాలు ఎలా మొదలుపెట్టారు?

తమిళనాడులో పుట్టి, పెరిగి, తమిళంలో విద్యాభ్యాసం చేసిన తెలుగువాడిని. తమిళ సాహిత్యం చదువుతూ పెరిగాను. మరోవైపు ఇంట్లో పెద్దలు ప్రాచీన తెలుగు సాహిత్యం చదివి వినిపిస్తూ ఉండటం వల్ల ఆ సాహిత్యానికీ చేరువగానే ఉండగలిగాను. ఇరవై ఏళ్ళొచ్చాక ఉద్యోగరీత్యా బెంగుళూరులో ఒక్కణ్ణే ఉంటున్నరోజుల్లో తెలుగు సాహిత్యం చదివి వినిపించే తోడెవ్వరూ లేరు. దాంతో తెలుగు స్వయంగా చదవడం నేర్చుకోవాలన్న కోరిక కలిగింది. పెద్దమ్మకొడుకు మోహన్ ప్రోత్సాహంతో తెలుగు చదవడం నేర్చుకున్నాను. పాటలరూపంలో విన్న అన్నమయ్య పదసాహిత్యంలోని కవిత్వం బాగా ఆకర్షించింది. అన్నమయ్య 29 సంపుటాలూ తెచ్చుకుని చదివాను. తర్వాత పోతన నుండి మొదలుపెట్టి అనేక ప్రాచీన తెలుగు కావ్యాలూ, ఆధునిక సాహిత్యంలోని కథలూ నవలలూ కవిత్వాలు చదువుకున్నాను. కొత్త భాషాసాహిత్యాలతో కొంత పరిచయం ఏర్పడితే ఏ భాషలో ఎలాంటి సాహిత్యం ఉందని పోల్చుకోవడం లోలోపల మొదలైపోతుంది. అలా తెలుగు సాహితీ మిత్రులకు తమిళసాహిత్యం, తమిళమిత్రులకు తెలుగుసాహిత్యం పరిచయం చేస్తుంటే, వాటినెందుకు అనువాదం చెయ్యకూడదూ అనడిగారు. అలా నా అనువాద ప్రయత్నం కవిత్వంతో మొదలైంది.

అనువాదకులకు, మూలరచనలు, మూలరచయితలతో స్పర్థ ఏర్పడే సందర్భాలు ఉంటాయా?

రచనాస్ఫూర్తి దెబ్బ తిందన్న అభిప్రాయం కానీ, పాఠకులకు సరిగా చేరలేదన్న అభిప్రాయం కానీ మూలరచయితకు కలిగితే, స్పర్థ ఏర్పడే అవకాశం ఉంది. కానీ, మూలరచనలో బలం, అనువాదంలో నిజాయితీ నాణ్యతా ఉంటే పాఠకులు మూల రచయితను, రచనలోని ఆత్మను పోల్లుపోకుండా పట్టుకోగలుగుతారు. కొన్ని రచనలకు సందర్భం ఉంటుంది. స్థలకాలాల నుండి విడదీయలేని బంధం ఉంటుంది. అనువాదం చేసేటప్పుడు కొత్త పాఠకులకు ఇవి ఎంతవరకు అవసరమన్నది అనువాదకులు అర్థం చేసుకోవాలి. తదనుగుణంగా నిర్ణయం తీసుకోవాలి. ఇలాంటి శ్రద్ధ, జాగ్రత్త అనువాదకులకి ఉంటే, స్పర్థలు ఏర్పడే అవకాశం తగ్గవచ్చు. మనమున్న AI ప్రపంచానికి అనువాదం దానికదే సమస్య కాదు. గొప్ప విషయమూ కాదు. కానీ రచయిత హృదయ సంస్కారాన్ని, రచనలో అన్నిసార్లూ దొరకని రచయిత తపనను అవి సంపూర్ణంగా అర్థమైన పాఠకులు అనువాదకులైతే, అనువాదంలో తీసుకురాగలిగిన శోభ వేరు. ఆ అనుభవాన్ని మరొక భాషలోని మిత్రులకు అందివ్వాలన్న తపన తప్ప వేరే ఉద్దేశ్యాలు లేనందుకేమో, నేనసలు స్పర్థలకు కారణాలు కూడా ఊహించలేకపోతున్నాను. అనుమతులు హక్కులు రాయల్టీల దగ్గర చర్చ ఉండచ్చు. వాటికి సంబంధించి అంగీకారం తప్పకుండా కుదుర్చుకోవాల్సిందే.

అనువాదకుల పాత్రని మీరెలా నిర్వచిస్తున్నారు?

పాఠకుడిగా నన్ను కదిలించిన రచనే అనువాదయోగ్యమైనదని అనుకోను. అనువాదానికి తీసుకున్న రచనావస్తువు, చెప్పేతీరు, పాఠకులలో కలిగించబోయే ప్రేరణ, తాత్వికచింతన లక్ష్యభాషలో లేనిదిగా ఉండాలి. లక్ష్యభాషలో అలాంటి రచనలు అదివరకే ఉన్నట్టయితే పాఠకుల మీద అనువాదాల భారం మోపడమే అవుతుంది లేదా పక్కభాషలో కూడా మన లాంటి రచనలే వస్తున్నాయి అని చెప్పడానికే పనికొస్తుంది. కాబట్టి, రచనను అనువాదానికి ఎంచుకునేటప్పుడు దాని వల్ల ప్రయోజనం ఏమిటన్నది ప్రశ్నించుకోవాలి. అనువాదం రెండుసంస్కృతుల మధ్య వారధి నిర్మించే పెద్దబాధ్యత!

ఎ. ముత్తులింగం కథనం చేసిన శ్రీలంక తమిళుల జీవితాలను తెలుగులోకి అనువాదం చేయడానికి ప్రత్యేక కారణం ఉందా?

ఎ. ముత్తులింగం శ్రీలంకలో పుట్టిన తమిళుడు. ఐక్యరాజ్యసమితి ఉద్యోగి. వృత్తిరీత్యా ప్రపంచంలోని పలుదేశాల్లో నివసించారు. కాబట్టి ఆయనకథలకు విభిన్న సంస్కృతులనుండి, దేశాలనుండి, రకరకాల మనుషుల జీవితాలనుండి కథావస్తువులు లభించాయి. శ్రీలంక తమిళుల గురించే కాకుండా సమస్త మానవాళికి సంబంధించిన కథలు రాశారు. నిజానికి ఆయన కథలన్నీ తమిళ సాహిత్య ప్రపంచానికి కూడా కొత్తవే! ఆయన కథచెప్పే విధానం కూడా ఎంతో ప్రత్యేకమైనది. తెలుగువారికి కొత్తతరహా కథలను పరిచయం చేసినట్టు అవుతుందని ఆ కథలను అనువాదం చేశాను. 'ఐదు కాళ్ళ మనిషి' పేరిట వచ్చిన పదిహేను కథల పుస్తకం నా మొదటి అనువాద సంపుటి.

'నెమ్మినీలం'లోని జయమోహన్ తాత్వికతని అనువాదంలోకి అలవోకగా తీసుకువచ్చారు, ఎటువంటి కృషి చేశారు?

జయమోహన్ కాల్పనిక సాహిత్యంతోబాటు ఆయన తత్వ, ఆధ్యాత్మిక రచనలు కూడా బహుకాలంగా చదువుతూ ఉన్నాను. అంచేత ఆయన రాసే కాల్పనిక సాహిత్యంలో అంతఃసూత్రమయిన

> పాఠకుడిగా నన్ను కదిలించిన రచనే అనువాదయోగ్యమైనదని అనుకోను. అనువాదానికి తీసుకున్న రచనావస్తువు, చెప్పేతీరు, పాఠకులలో కలిగించబోయే ప్రేరణ, తాత్వికచింతన లక్ష్యభాషలో లేనిదిగా ఉండాలి. లక్ష్యభాషలో అలాంటి రచనలు అదివరకే ఉన్నట్టయితే పాఠకుల మీద అనువాదాల భారం మోపడమే అవుతుంది

తాత్వికత ఏమిటన్నది పాఠకుడిగా తెలుసు. అది నా లోనూ కొంత ఇంకిపోయింది. ఆయన రచనావిధానంలోనే ఆ తాత్వికత అంతర్లీనంగా ఇమిడిపోయి ఉంటుంది. ఆయన అదేమీ బిగ్గరగా చెప్పరు. కనుక ప్రత్యేకంగా దానిని అనువాదంలోకి తీసుకురావడమన్న శ్రమ లేదు. నిజానికి మీరిచ్చిన ప్రశంస రచయితగా జయమోహన్‌కి చెందాల్సింది అనుకుంటాను. ఆయన రాసిన అన్ని కథలూ ఒకెత్తయితే 'నెమ్మి నీలం' సంపుటంలోని కథలు మరో ఎత్తు. ఈ కథలు రచయత స్వరూపాన్ని అన్నికోణాల్లో నుండీ ఆవిష్కరిస్తాయి. ధర్మమే అంతఃసూత్రంగా సాగే ఈ కథల్లో ఎన్నో పొరలున్నాయి.

ఇతరభాషల నుండి మనకి అనువాదరచనలు విస్తృతంగానే వస్తున్నాయి. మరి ఇక్కడ నుండి ఇతరభాషలలోకి మన రచనలు వెళ్తున్నాయా?

ఇతర భాషల గురించి ఎక్కువ తెలియదు గానీ, మన పక్క రాష్ట్రాల వాళ్ళకు మన రచనలు అందటం లేదు. ఏ దక్షిణాదిభాషకూ లేనంత వెసులుబాటు మన భాషకుంది. మనకు రెండురాష్ట్రాలున్నాయి, అనేక విశ్వవిద్యాలయాలున్నాయి. దక్షిణాదిలోనే సంఖ్యాపరంగా అతిపెద్దజాతి మనది. అయితే సాహిత్యం చదవడంలో మాత్రం అట్టడుగున ఉన్నదీ మనమే! కొన్ని దశాబ్దాల క్రితం వరకు తెలుగుసాహిత్యం చదివే పాఠకులు బాగానే ఉండేవారు. ఈ మధ్య కాలంలో చదివేవాళ్ళశాతం తగ్గిపోయింది. ఐటీలు, ఇంజినీరింగులు, విదేశీవలసలు, హీరోల పేరిట అభిమానసంఘాలు, కార్తీకమాస వనభోజనాలు, రాజకీయాలు మాత్రమే కాదు తెలుగు సంస్కృతంటే! సాహిత్యం చదవడం, పుస్తకాలు పంచుకోవడం, దాని గురించి మాట్లాడటం కూడా సంస్కృతిలో భాగమేనని తెలుగువారు గుర్తుపెట్టుకోవాలి. ఉద్యమంలాగా సాహిత్యపఠనాన్ని తెలుగువాళ్ళు మళ్ళీ అందిపుచ్చుకోవాలి. అప్పుడు తెలుగులో సాహిత్యానికి ఆదరణ పెరుగుతుంది, చదువుతారు, చదివినదాన్ని ఇతరభాషల్లోకి తీసుకెళ్ళాలన్న తపన మొదలవుతుంది.

రాజకీయ నాయకులకీ, సినీతారలకీ ప్రజాదరణ, ఆకర్షణ దక్షిణాది రాష్ట్రాలలో ఎక్కువే. తమిళనాడు రాజకీయ నాయకుల్లో యాభైశాతానికి పైగా రచనారంగంతో సంబంధాలున్నవారే. తమిళ సినిమా రంగంలోనూ సాహిత్యాన్ని చదివేవారు ఎక్కువే. మన సినిమాతారలూ, రాజకీయనాయకులూ పుస్తకాలు చదువుతామని బయట చెప్పుకోవడానికి మొహమాటపడతారేమో! వాళ్ళు చెప్తే ఎక్కువమంది చదువుతారు. బిగ్‌బాస్ (తమిళం) షోలో కమల్‌హాసన్ ప్రతి ఎపిసోడ్‌లోనూ కొన్ని పుస్తకాలను, రచయితలను ప్రేక్షకులకు పరిచయం చేశారు. అక్కడ దర్శకులు కూడా కాల్పనిక సాహిత్యాన్ని సినిమాలకు వస్తువులుగా ఎంచుకుంటారు, వీలున్నంతవరకు ఆ రచయితతోనే సంభాషణలు రాయించుకుంటారు. మనవాళ్ళూ ఇలాంటివిచేస్తే మన పుస్తకాలు కూడా చెప్పుకోదగ్గ సంఖ్యలో తెలుగుపాఠకులను సంపాదించుకుంటాయి. పాఠకులు పెరిగితే అనువాదకులూ పెరిగినట్టే.

(avineny@gmail.com)

దేశాతీత హృదయ స్పందనలు కలిపి కుట్టిన 'క్విల్ట్'!

అమెరికాలో స్థిరపడి తెలుగు సాహిత్యాభివృద్ధికి తోడ్పడుతున్న వాళ్ళల్లో గొర్తి సాయి బ్రహ్మానందం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆయన 'అంతర్జ్వలనం', 'నేహల' లాంటి నవలల్ని, 'కోనసీమ కథలు', 'క్విల్ట్' లాంటి కథా సంపుటాల్ని వెలువరించారు. అమెరికాలో నివసిస్తున్న తెలుగువాళ్ళను గూర్చి మాత్రమే కాకుండా అక్కడ నివసిస్తున్న అమెరికన్లను గూర్చి ఈ రచయిత 'క్విల్ట్' కథా సంపుటిలో కథలు రాయటం విశేషం.

అమెరికా ప్రజల జీవిత విధానం ఎలా ఉంటుంది, అక్కడ మానవ సంబంధాలెలా ఉంటాయి, వాళ్ళ అలవాట్లు, వాళ్ళ అభిరుచులు, సంప్రదాయాలు, వాళ్ళ వివాహ వ్యవస్థ, స్నేహితుల మధ్య సంబంధాలు... ఇలాంటి ఇతివృత్తాలతో సాయి బ్రహ్మానందం ఈ కథల్ని రచించిన విధానం చాలా వినూత్నంగా ఉంది. పాత్రల్ని మన ముందు పెట్టటం తప్ప ఆ పాత్రల్ని గురించి తానేమీ చెప్పడు. జీవితాన్ని గురించి ఏవో వ్యాఖ్యానాలు చేసి తన తెలివిని, జ్ఞానాన్ని ప్రదర్శించుకోవాలని ప్రయత్నించడు. అనవసరమైన వర్ణనలు, పదాడంబరం ఆయన కథల్లో కనిపించవు. కథల ద్వారా మనకేదో సందేశం ఇవ్వాలని ప్రయత్నించడు.

ఈ సంపుటిలోని కొన్ని కథల్ని సాయి బ్రహ్మానందం 'నేను' అంటూ ఉత్తమ పురుషలో చెప్పాడు. కొన్ని కథల్ని ఉత్తరాల రూపంలో చెప్పాడు. మరికొన్నింటిని సినిమాల్లో వాడే 'ఫేడ్ ఇన్', 'డిస్సాల్వ్ టు', 'కట్ టు' లాంటి టెక్నిక్‌తో రాశాడు. మరికొన్ని కథల్ని పూర్తిగా థర్డ్ పర్సన్‌లో (అంటే ఒకర్ని గూర్చి మరొకరు చెబుతున్నట్టుగా) రాశాడు. ఇలా ఈ కథల్లో ఎప్పుడూ చాలామంది కథకులు వాడే




> అమెరికా ప్రజల జీవిత విధానం ఎలా ఉంటుంది, అక్కడ మానవ సంబంధాలెలా ఉంటాయి, వాళ్ళ అలవాట్లు, వాళ్ళ అభిరుచులు, సంప్రదాయాలు, వాళ్ళ వివాహ వ్యవస్థ, స్నేహితుల మధ్య సంబంధాలు... ఇలాంటి ఇతివృత్తాలతో గొర్తి సాయి బ్రహ్మానందం ఈ కథల్ని రచించిన విధానం చాలా వినూత్నంగా ఉంది.

రచయిత దృష్టికోణం నుండే రాయటం కాకుండా చాలా వైవిధ్య భరితంగా రాశాడు.

'క్విల్ట్' అనే కథలో ఒంటరిగా, దూరంగా నివసిస్తున్న అమ్మమ్మకు దగ్గరకు వెళ్ళిన మనుమరాలు ఆ అమ్మమ్మ కోరుకున్న 'క్విల్ట్'ను ప్రెజెంట్ చేస్తుంది. క్విల్ట్ అంటే చలికాలంలో కప్పుకునే దుప్పటి లాంటిది. చాలా దళసరి గుడ్డల్ని ఒకదానితో మరొకదాన్ని జతచేసి వాటిని సూదితో గుచ్చి క్విల్ట్‌ని తయారు చేస్తారు (మన భాషలో 'బొంత' అని చెప్పొచ్చు). తనకెంతో అవసరమైన క్విల్ట్‌ను ప్రెజెంట్ చేసినందుకు అమ్మమ్మకు చాలా సంతోషిస్తుంది. తను చనిపోయినప్పుడు శవం పక్కనే ఆమెకెంతో ఇష్టమైన మరికొన్నింటితో పాటు ఈ 'క్విల్ట్'ను కూడా పెట్టాలని అమ్మమ్మ కోరుకోవటం మనల్ని కదిలిస్తుంది. మానవ హృదయ స్పందనలు ఇండియాలోనైనా అమెకిరా లోనైనా ఒకే విధంగా ఉంటాయి కదా అనిపిస్తుంది. ఈ సార్వజనీనతే సాహిత్యం తనలో ఇముడ్చుకున్న ఔన్నత్యం.

'ఆ ఇంట్లో ఒకరోజు' అనే కథ తల్లిదండ్రులకు వారి సంతానానికి మధ్య ఉండే సంబంధాన్ని చెబుతుంది. తమకు దూరంగా ఉంటున్న కొడుకు తమతో ఉంటే తామెంతో సంతోషించేవాళ్ళమని ఆ తల్లిదండ్రులు అనుకుంటారు. అమెరికాలో తల్లిదండ్రులను చాలా చిన్న వయసులో వదిలేసి ఎక్కడో ఉండే కొడుకులను గూర్చి మనకు తెలుసు. ఇప్పుడు మన దేశంలో కూడా అదే పరిస్థితి నెలకొంటున్నది. కొడుకులు దూరమైనప్పుడు అమెరికన్ తల్లిదండ్రులు కూడా ఎలా బాధపడ్తారో ఈ కథ చిత్రిస్తుంది.

ఈ సంపుటిలోని చాలా మంచి కథల్లో 'అతను' అనేదొకటి. ఒక విమానంలో అమెరికా నుండి ఇండియాకి వస్తున్న ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ రూపంలో ఈ కథ సాగుతుంది. ఈ ఇద్దరిలో ఒకరు స్త్రీ, ఒకరు పురుషుడు. ఆ ఇద్దరికీ ఇదివరకు ఒకరికొకరు పరిచయం లేదు. అతనికి ఆమె పక్కనే సీటు దొరుకుతుంది. ఆమె పేరు ఉత్పల. ఆమెకు అతనితో మాట్లాడాలని లేకపోయినా అతడే అతిగా కల్పజేసుకొని ఆమెకు సంబంధించిన వివరాలన్నీ తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటాడు. అతన్ని భరించక తప్పదని నిర్ణయించుకున్న ఉత్పల క్లుప్తంగానైనా అతడు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెబుతుంటుంది. తను అమెరికాలో డాక్టర్‌గా పని చెయ్యటానికి అర్హత సంపాదించానని, కాని తను డాక్టర్‌గా పని చెయ్యటానికి భర్త ఒప్పుకోవటం లేదని ఆమె చెబుతుంది. తను అమెరికా నుండి ఇండియాకొచ్చేస్తున్నానని మళ్ళీ తనకు అమెరికాకు వెళ్ళే ఉద్దేశ్యం లేదని చెబుతుంది. తనకో కూతురు కూడా ఉందని, ఆ కూతురిని భర్తకే అప్పజెప్పి ఇండియాకి వచ్చేస్తున్నానని కన్నీళ్ళతో చెబుతుంది. ఎందుకిలా చేస్తున్నది అంటే: అమెరికాలో ఉన్నంత కాలం ఆమె భర్త ఆమెను డాక్టర్‌గా ప్రాక్టీసు చెయ్యనివ్వడు. ఇండియాకి వచ్చి డాక్టర్‌గా ప్రాక్టీసు చేస్తూ పేద వాళ్ళకు సహాయం చెయ్యాలనే ఆమె ఉద్దేశ్యం అతడు అర్థం చేసుకుంటాడు. ఈ కథలోని చాలా విషయాల్ని వాళ్ళ మధ్య జరిగిన సంభాషణల ద్వారా మనమే అర్థం చేసుకోవాలి తప్ప రచయిత యేమీ చెప్పడు. భర్త అన్ని విధాలా మంచి వాడే అయినా అతని లోని 'మేల్ ఈగో' ఎలా పనిచేస్తున్నదో మనం తెలుసుకుంటాం. చక్కని శిల్పంతో మలచబడిన ఈ కథ ఈ సంపుటిలోని ఉత్తమ కథల్లో ఒకటి.



అమెరికన్ సంస్కృతికి మన తెలుగువాళ్ళ సంస్కృతికి ఎంత వ్యత్యాసం ఉందో ఈ కథలు చాలా సంయమనంతో, అవగాహనతో చెబుతాయి. ఈ కథల్లో ఉన్న మరో గొప్ప గుణమేమిటంటే కథను మొదలెట్టామంటే పూర్తి చెయ్యకుండా ఉండలేం.

■ అంపశయ్య నవీన్



విఘడియ

మాను కింద నేను,
పైన నక్షత్ర రాత్రి,
నేనేవేవో గుబురు కలలు కంటూ,
మన బుగ్గలు మీటుతూ సుతారంగా ఓ వీచిక,
మన చేతిలో చేయి,
సమక్షానికి సరిపడిన ఓ పాటను కోరాను,
కానీ, మౌనమే నను చేరిన బదులు.
అప్పుడు సుతారంగా నా చెవులు నిమురుతూ,
చేరింది అంతే లలితంగా నీ లావణ్యం స్వరం.
బంగారం ఆ గాత్రం!
సుడులుగా సుందర గిరికీలుగా,
స్వర్గంలో నాకు పొందుపరచిన తమకంలా,
మధురమైన పాట నిలిచిపోయింది.
నీ తల నా ఎగు భుజాన వాలింది.
ఆ స్పర్శ నాకు ఈ నాటికీ ఎరుకే.
నేనది బాల్యంగా కోల్పోయినదే.
అప్పుడు అమ్మగా,
ఇప్పుడు నువ్వుగా,
అయినా నువ్వు అపరిచితవే నేటికీ,
అయినా నీ ప్రేమ అనిబంధనీయమే,
కాటుక ఆకాశంలో తళుకుల తార,
గాలికి రాలే ఎండుటాకులు
నగ్న పాదాలను తాకుతూ
అంతటా.
ఇంద్రజాల ఆవరణం.
దివి నుంచి వానగా చిలికే సుధ.
ఏం హేళ?
అమిత తన్మయమూ మట్టికరిపిస్తుంది కదూ!
అతి మంచీ భరించలేనిదిగా పరిణమిస్తుంది కదూ!
మన చంపల జమిలి
నాకు సుదీర్ఘ నిద్రను ప్రసాదిస్తుంది.
ఆ తేనె తెలి తుషారాలు,
ఏమిటనుకున్నావు?
అవి, వివేక సౌరభాలు!
ఈ ఘడియలే ముమ్మాటికి
నా బతికిన క్షణాలు.

ఇంగ్లీష్ మూలం ■ బి. నర్సింగరావు
తెలుగు అనువాదం ■ అనంతు చింతలపల్లి

AKBAR

రెండో పుస్తకం వచ్చే దాకా 'తంగెడుపూల గోపి' అనే పిలిచారు!

నా మొట్టమొదటి కవితా సంపుటి 'తంగెడుపూలు' 1976లో వెలువడింది. దానిలో 1967 నుండి 73 వరకు రాసిన 31 కవితలున్నాయి. శీలావీర్రాజు గారు ముఖచిత్రం వేశారు. రామ్‌కోటిలో మాక్స్‌ముల్లర్ భవన్ పక్కన ఆయన ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాను. "తంగెడుపూలు ఎలా వుంటాయో తెలియదే" అన్నారు. అప్పుడు ఘట్‌కేసర్ దాక బస్సులో వెళ్ళి ఓ తంగెడుకొమ్మను తెంపుకొచ్చి ఆయనకిచ్చాను. చక్కటి బొమ్మ వేశారు. డబ్బులు తీసుకో లేదు. ఆయనే కాచిగూడలోని మోహన్ ప్రాసెస్‌కు తీసికెళ్లి బ్లాక్‌లు చేయించారు. మహానుభావుడు!

కుందుర్తి గారు దానికి ఓ సుదీర్ఘమైన ముందుమాట రాశారు. దానిపేరు 'ప్రతిధ్వని'. అంటే ఇతని కవిత్వంలో ధ్వని ఉంది అని మెచ్చుకుంటూ ఆ పేరు పెట్టారు. అభ్యుదయ కవిత్వంలో సూర్యవంశపుకవులు, చంద్రవంశపు కవులున్నారనీ, గోపి చంద్రవంశం కవి అని సూత్రీకరించారు. ఆ పుస్తకాన్ని సినారె కు అంకితమిచ్చాను. "పల్లవదశలోనే నాలోని కవిత్వాన్ని గుర్తించి నాపై ఆప్యాయతను చిందించే గురువు గారికి చిరుకానుకగా" అని అంకితవాక్యాలు రాశాను. ఇక్కడ ఓ మంచి జ్ఞాపకం ఏంటంటే అంకితం ఫోటో కోసం నారాయణగూడలో ఇప్పటి తాజ్‌మహల్ హోటల్ పక్కన గోవింద్ స్టూడియో అని వుండేది, ఇద్దరం బస్సులో వెళ్ళాం, అప్పుడాయనకు కారు వుండేది కాదు. ఫోటో పట్ల ఆయనకున్న శ్రద్ధ నా పైన ప్రేమకు తార్కాణం.

'తంగెడుపూలు' ఆవిష్కరణ సభ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరిగింది. దేవులపల్లి రామానుజరావు గారి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీ కుందుర్తి ఆవిష్కరించారు. సభ ఘనంగా పండింది. అంతకు రెండేండ్ల ముందు అరుణతో నా వర్ణాంతర వివాహం ఆ లైబ్రరీ ఆవరణలోనే జరగడం ఒక యాదృచ్ఛిక సంతోషం. ఆ రోజుల్లోనే 'బయోడేట' అనే సంచలన కవిత రాశాను.

ఈ పుస్తకం లకిడికాపూల్ లోని వరలక్ష్మి ప్రెస్‌లో అచ్చయ్యింది. అది శివారెడ్డి ఇంటిపక్కనే వుండేది. రోజూ వెళ్ళి పడిగాపులు పడేవాణ్ణి. పూర్తి కావడానికి ఆరు నెలలు పట్టింది. ఆ రోజుల్లోనే ద్వారకా మిత్రుల సమావేశాలు అక్కడ ప్రారంభమౌతున్నాయి. అప్పుడు పైసలెక్కడివి! ముద్రణ ఖర్చు ఏడు వందల రూపాయలయ్యింది. మిత్రుల ఆర్థిక హస్తాలతోనే అది సాధ్యమైంది. 70 పేజీల పుస్తకానికి 3 రూపాయల ధర నిర్ణయించాను. ఆ రోజుల్లోనే మా అబ్బాయి చైతన్య జన్మించాడు. వాడి పేరనే 'చైతన్య ప్రచురణలు' అని నామకరణం చేశాను.



తంగెడుపూలు లోని 'కత్తికార్చిన కన్నీరు' అనే కవితకు సృజన పత్రిక నిర్వహించిన కవితల పోటీలో ప్రత్యేక బహుమతిని ప్రకటించారు. దాని ఎడిటర్ వరవరరావు ఓ బి.ఏ విద్యార్థిని ఆర్ట్స్ కాలేజి మెట్లమీద వెతికిపట్టుకొని 'సృజన, నవత' సంచికలు పురస్కారం కింద బహూకరించడం ఓ మధురమైన అనుభూతి.

అలాగే 'తంగెడుపూలు' ఆ రోజుల్లో నా సిగ్నేచర్ కవిత. "తంగెడుపూలు అంటే ఒప్పుకోను/ బంగారుపూలు" అని కవి సమ్మేళనాల్లో చదవగానే కరతాళ ధ్వనులు మిన్నుముట్టేవి. మరో



నా మొదటి పుస్తకం

■ ఎన్. గోపి ✆ 93910 28496

> 'తంగెడుపూలు' ఆవిష్కరణ సభ శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో జరిగింది. దేవులపల్లి రామానుజరావు గారి అధ్యక్షతన జరిగిన సభలో శ్రీ కుందుర్తి ఆవిష్కరించారు. సభ ఘనంగా పండింది. అంతకు రెండేండ్ల ముందు అరుణతో నా వర్ణాంతర వివాహం ఆ లైబ్రరీ ఆవరణలోనే జరగడం ఒక యాదృచ్ఛిక సంతోషం.

ఎనిమిదేళ్లకు 'మైలురాయి' సంపుటి వచ్చేదాక నన్ను 'తంగెడుపూల గోపి' అనే వ్యవహరించేవారు. ఎనిమిదేళ్ళ ఆలస్యం ఎందుకంటే నేనప్పుడు వేమన రిసెర్చ్‌లో పీకల లోతుగా మునిగి వున్నాను కాబట్టి. ఆ తరువాత 'వేమనగోపి' అనే వాడుక ఏర్పడింది.

ఆ రోజుల్లోనే ఆంధ్ర మహిళాసభలో దుర్గాబాయి దేశ్‌ముఖ్ గారు 'దేవులపల్లి కృష్ణశాస్త్రి పురస్కారం' అని స్థాపించారు. తొలి అవార్డు తంగెడుపూలకే లభించడం ఒక మహోద్వేగం. ఇవాళ తంగెడుపూలు 'తెలంగాణ'కు ఒక ఐడెంటిటీ. 1967 లో అంటే నా 17వ యేట రాసిన ఈ కవిత ఇప్పటికీ 'వన్నెయుం వాసియున్' చెడకపోవడం ఆనందచందనం. ■

శిఖామణి సాహితీ పురస్కారాలు

కవి సంధ్య – శిఖామణి జీవన సాఫల్య కవితా పురస్కారం 2024 కు వాడ్రేవు చినవీరభద్రుడు, శిఖామణి యువ కవితా పురస్కారానికి పాయల మురళీ కృష్ణ ఎంపిక అయ్యారు. జీవన సాఫల్య పురస్కారానికి రూ.10వేలు, యువ కవితా పురస్కారానికి రూ.5వేల నగదు, శాలువా, జ్ఞాపికలతో సత్కారం ఉంటుంది. పురస్కార ప్రదాన సభ అక్టోబర్ చివరి వారంలో యానాంలో జరుగుతుంది.

దాట్ల దేవదానం రాజు

25ఏండ్ల తెలంగాణ కథల సంకలనం

బి. ఎస్. రాములు విశాల సాహితి పురస్కారం పొందిన కథలతో పాటు మరికొన్ని కథలు ఎంపిక చేసి 75 ఉత్తమ కథలతో 25 ఏండ్ల తెలంగాణ ఉత్తమ ప్రాతినిధ్య కథల సంకలనం తేనున్నాము. రచయితలు 25 ఏళ్లలో తాను రాసిన కథ ఉత్తమ కథల్లో ఒకటి అని ఎందుకు భావిస్తున్నారో, గత 25 ఏండ్లలో చదివిన కథల్లో పది ఉత్తమ కథలు ఏమిటో ఎందుకో చెబుతూ రాయాలి. పావు శతాబ్దం కథల సమీక్ష మూల్యాంకనం చేస్తూ వెలువడే ఈ కథా సంకలనం కోసం మరిన్ని వివరాలూ కావాలి. అవేమిటో తెలుసుకొనేందుకు 8331966987లో సంప్రదించండి.

విశాల సాహిత్య అకాడమి

యూత్ లిటరరీ ఫెస్ట్ – 2024

తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో అక్టోబర్ 4, 5 తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూత్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించనున్నాం. ఇందులో యువ కవులు, రచయితలు (40ఏండ్ల లోపు వారు) స్వీయ రచనలపై మాట్లాడతారు. నవల, కథ, విమర్శ, పాట, కవిత్వం అనే ఐదు అంశాలపై చర్చలు చేస్తారు. అతిథులు సైతం యువతే ఉండటం ఈ ఫెస్ట్ ప్రత్యేకత. వివరాలకు: 8897765417

కె. ఆనందాచారి

'పంచుకుందాం రా!' కవిత్వం

సుప్రీమ్ కోర్టు రిజర్వేషన్ల పంపిణీ న్యాయం తీర్పు నేపథ్యంలో కృపాకర్ మాదిగ రాసిన 'పంచుకుందాం రా!' కవిత్వ పుస్తకావిష్కరణ సభ సెప్టెంబరు 30సా.6.30గంలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. జూపాక సుభద్ర అధ్యక్షతన జరిగే సభలో కె. శ్రీనివాస్, జిలుకర శ్రీనివాస్, అంబటి సురేంద్ర రాజు, జి.వి.రత్నాకర్, కవి యాకూబ్, గజవెల్లి ఈశ్వర్, ఎస్.ఎం. బాషా, సుంకిరెడ్డి నారాయణరెడ్డి, స్వేచ్ఛ వోటార్కర్ తదితరులు పాల్గొంటారు.

దండోరా పబ్లికేషన్స్, జంబూద్వీపం.

'కథ 2023' ఆవిష్కరణ

జాషువా సాహిత్య వేదిక, ఖమ్మం నిర్వహణలో కథ సాహితి సంకలనాల పరంపరలో 34వది 'కథ 2023' ఆవిష్కరణ సభ అక్టోబర్ 6 సా.5.30కి జడ్.పి.హాల్, ఖమ్మంలో జరుగుతుంది. అధ్యక్షత రవిమారుత్, ఆవిష్కరణ కె. శ్రీనివాస్, ఆత్మీయ అతిథులు కె. శివారెడ్డి, మువ్వా శ్రీనివాసరావు, పుస్తక సమీక్ష పి. జ్యోతి, కథా సాహితి సంపాదకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్. ఆవిష్కరణ అనంతరం కథ 2023 కథా రచయితలతో ముఖాముఖి ఉంటుంది. ఎ.వి. రమణమూర్తి నిర్వహణలో కథ 2023 సంకలనంలోని కథా రచయితలు తమ కథా నేపథ్యాన్ని వివరిస్తారు.

వాసిరెడ్డి నవీన్

డబుల్ ఇళ్లు.. ఫర్ సేల్!



- పలు ప్రాంతాల్లో ఆత్మగౌరవ గృహాల అమ్మకాలు
- గుర్తించిన ప్రభుత్వ విభాగాలు
- పూర్తి వివరాల సేకరణ
- నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో జోరుగా క్రయవిక్రయాలు
- త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక
- నోటరీ ద్వారా అమ్మకాలు చెల్లవంటోన్న అధికారులు

ఆత్మగౌరవ గృహాల(రెండు పడకల ఇళ్లు) అమ్మకంపై ప్రభుత్వ విభాగాలు ఆరా తీస్తున్నాయి. పలువురు లబ్ధిదారులు ఇళ్లు విక్రయించారన్న సమాచారం నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. ఏ కుటుంబానికి కేటాయించారు, ప్రస్తుతం ఎవరు ఉంటున్నారు, క్రయవిక్రయాలు జరిగాయా..? అన్నది రెవెన్యూ, జీహెచ్ఎంసీ విభాగాలు పరిశీలిస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రెండు పడకల ఇళ్ల క్రయవిక్రయాలపై అధికారులు దృష్టి సారిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు గత ప్రభుత్వం దాదాపు 60 వేల మందికి రెండు పడకల ఇళ్లను కేటాయించింది. అంతకు ముందు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారందరికీ పట్టాలు అందజేశారు. వీటిలో 50 శాతానికిపైగా ఇళ్లలో లబ్ధిదారులు ఉంటున్నట్టు అధికారులు చెబుతున్నారు. వేల సంఖ్యలో ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఇతరత్రా వసతులు లేకపోవడంతో కొందరు ఇళ్లలోకి వెళ్లేందుకు విముఖత చూపుతున్నారు. దీంతో ఇటీవల వాటర్‌బోర్డు, టీజీఎస్‌పీడీసీఎల్‌కు ఆయా విభాగాలు చేయాల్సిన పనుల నిమిత్తం నిధులు మంజూరు చేసినట్టు ఓ అధికారి తెలిపారు.

త్వరలో నివేదిక..

నగరంలో దాదాపు 9 వేల (ఇన్-సిటు) ఇళ్లు నిర్మించగా.. శివార్లలోని కొల్లూరు, రాంపల్లి, ప్రతాపసింగారం, దుండిగల్, డీ పోచంపల్లి, నార్సింగి, బాచుపల్లి తదితర ప్రాంతాల్లో మెజార్టీ రెండు పడకల ఇళ్ల నిర్మాణం జరిగింది.

నోటరీలతో..

నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన ఇళ్లను అమ్ముకునే అధికారం లబ్ధిదారులకు ఉండదు. క్రయవిక్రయాలూ చెల్లవు. కొనుగోలు చేసినా రిజిస్ట్రేషన్ జరగదు. కేవలం నోటరీ ద్వారానే ప్రస్తుతం అమ్మకాలు జరుగుతున్నాయి. ఇది అధికారికంగా చెల్లదని అధికారులు చెబుతున్నారు. అయినా పరస్పర అవగాహనతో లబ్ధిదారులు, కొనుగోలుదారులు ముందుకు సాగుతున్నారు. నోటరీల వివరాలు తెలిసే అవకాశం లేని దృష్ట్యా.. కేటాయించిన లబ్ధిదారులే ఇళ్లలో ఉంటున్నారా..? అన్నది తెలుసుకోవాలని అధికారులు భావిస్తున్నారు. లబ్ధిదారులు కాకుండా ఇతర కుటుంబాలు ఇళ్లలో ఉన్న పక్షంలో ఆ గృహాల విషయంలో ఏం చేయాలన్న దానిపై ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకుంటారని చెబుతున్నారు.

ఈ ప్రాంతాలు నగరానికి కొంత దూరంగా ఉన్నాయి. దీంతో అక్కడి ఇళ్లలోకి వెళ్లేందుకు కొందరు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు. ప్రస్తుతం పని చేస్తోన్న చోటికి దూరంగా ఉండడం.. పిల్లల చదువులు, తదితర విషయాలను వారు కారణాలుగా చెబుతున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో పలువురు తమ ఇళ్లను అమ్మకానికి పెడుతున్నారు. ఔటర్ పక్కనే ఉన్న కొల్లూరులో పదుల సంఖ్యలో ఇళ్లను లబ్ధిదారులు విక్రయించారని ప్రభుత్వ విభాగాలు గుర్తించాయి. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఓ లబ్ధిదారుడు రూ.16 లక్షలకు అమ్మినట్టు తమ దృష్టికి వచ్చిందని ఓ అధికారి తెలిపారు. ప్రస్తుతం రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు క్రయవిక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం ఉందని చెప్పారు. ప్రతాపసింగారం, డీ పోచంపల్లి, తిమ్మాయిగూడలోని పలు ఇళ్ల క్రయవిక్రయం జరిగినట్టు చెబుతున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కేటాయించిన ఇళ్ల అమ్మకమూ జరిగిందని తెలుస్తోంది. ఈ క్రమంలో ఇళ్లు అమ్మిన లబ్ధిదారుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. త్వరలో ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆంధ్రజ్యోతికి తెలిపారు.



భారీవర్షం

- జలమయమైన ప్రధాన రహదారులు
- ఆర్సీపురంలో అత్యధికంగా 5.6 సెం.మీ
- మరో రెండు రోజులు వర్ష సూచన

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు పలు ప్రాంతాల్లో భారీవర్షం కురిసింది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రామచంద్రాపురంలో అత్యధికంగా 5.6 సెంటీమీటర్లు, షేక్‌పేటలో 3.5 సెంటిమీటర్ల వర్షం కురిసింది. జూబ్లీహిల్స్ బంజారాహిల్స్, ఫిలింనగర్, షేక్‌పేట, మెహిదీపట్నం, గచ్చిబౌలి, మాదాపూర్, శేరిలింగంపల్లి, గోల్కొండ, లింగంపల్లి ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రోడ్లపై భారీగా వరదనీరు నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలులతో పలు ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగి తీగలపై పడటంతో విద్యుత్ సరఫరాలో

మిగతా 8వ పేజీలో..

దూకేసిందా.. తోసేశారా?

- 18వ ఫ్లోర్ నుంచి పడి మూడేళ్ల కుమార్తె సహా తల్లి మృతి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): మై హోమ్ అవతార్ 10వ టవర్‌లోని 18వ అంతస్తుపై నుంచి పడి మూడేళ్ల చిన్నారి సహా తల్లి మృతి చెందింది. ఇది ఆత్మహత్యా లేక ఎవరైనా తోసేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మై హోమ్ అవతార్‌లోని 3వ టవర్‌లో మానస దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కృషా అనే మూడేళ్ల కుమార్తె ఉంది. కుమార్తెతో కలిసి మానస 10వ టవర్‌కు వెళ్లింది. అందులోని 18వ ఫ్లోర్ నుంచి కింద పడి ఇద్దరూ మృతి చెందారు. నార్సింగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాలను ఉస్మానియాకు తరలించారు. 3వ టవర్‌లో ఉండే మానస 10వ టవర్‌కు ఎందుకు వెళ్లింది..? ఆ సమయంలో మానస భర్త ఎక్కడికి వెళ్లాడు..? కుమార్తెతో కలిసి తానే దూకి ఆత్మహత్య చేసుకుందా, లేక మరేదైనా జరిగిందా అనే కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలోనే తెలుస్తాయని నార్సింగి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



దసరా నేపథ్యంలో కళాకారులు దుర్గమ్మ విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. తిరుమలగిరిలో ఓ కళాకారుడు ఇలా విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతూ కనిపించాడు.

స్నేహితుడే చంపేశాడు!

- హత్య కేసును ఛేదించిన పోలీసులు

కవాడిగూడ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్ గోశాల వద్ద శనివారం రాత్రి దారుణ హత్యకు గురైన వ్యక్తిని, నిందితుడిని పోలీసులు గుర్తించారు. స్నేహితుడే అతడిని హత్య చేసినట్లు నిర్ధారించారు. పోలీసుల కథనం ప్రకారం.. ముషీరాబాద్ భరత్‌నగర్‌కు చెందిన మహ్మద్ బషీర్ (30) కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఫయాముద్దీన్ స్నేహితుడు. కొంతకాలం క్రితం బషీర్ కుటుంబం తూంకుంటలోని కౌకూర్‌కు మకాం మార్చింది. కానీ, బషీర్ ఇంటికి వెళ్లకుండా ఫుట్‌పాత్, స్నేహితుల ఇంట్లో ఉంటున్నాడు. కాగా, బషీర్, ఫయాముద్దీన్ మధ్య ఏదో విషయంలో గొడవలు జరిగాయి. ఫయాముద్దీన్‌ను చంపేస్తానని మహ్మద్ బషీర్ పలుమార్లు బెదిరించాడు. బషీర్‌తో ప్రాణభయం ఉన్న ఫయాముద్దీన్ అతడిని చంపేయాలని అనుకున్నాడు. శనివారం రాత్రి కవాడిగూడ సింగాడికుంటలో ఉన్న బీఎస్ వైన్స్ వద్ద ఇద్దరూ కలిసి మద్యం తాగారు. అనంతరం గోశాల సమీపంలో మూత్ర విసర్జన చేయడానికి ఇద్దరూ వెళ్లారు. ఇదే అదునుగా బషీర్‌పై వెనకనుంచి ఫయాముద్దీన్ పిడిగుద్దులు గుద్దాడు. బ్లేడుతో గొంతుకోసి పారిపోయాడు. రంగంలోకి దిగిన దోమలగూడ పోలీసులు క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్, సీసీ కెమెరాల ద్వారా పరిశీలించారు. తొలుత గుర్తుతెలియని వ్యక్తి హత్యగా కేసు నమోదు చేసి, ఆ తర్వాత చనిపోయిన వ్యక్తి బషీర్‌గా, నిందితుడు ఫయాముద్దీన్‌గా నిర్ధారించినట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఫయాముద్దీన్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. బషీర్ తల్లి గౌరీబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రన్‌లో పాల్గొన్న నగరవాసులు



రన్‌ను ప్రారంభిస్తున్న దామోదర రాజనర్సింహ

పింక్ పవర్ రన్

రొమ్ము కేన్సర్ పట్ల అవగాహన కల్పించేందుకు తెలంగాణా ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్టర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన పింక్ పవర్ రన్‌లో నగరవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ రన్‌ను ప్రారంభించారు.



జోకర్ వేషధారణలో సందడి

సీసీరోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో..

- రెడ్‌హిల్స్‌లో పనులు ప్రారంభించి నాలుగు నెలలు

8

ఆదాయమే లక్ష్యం.. శివార్లపైనే గురి

- బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితా విడుదల చేసిన దక్షిణ డిస్కం

మమ్మల్ని తరలించొద్దు!

- కొనసాగుతున్న మూసీ నిర్వాసితుల ఆందోళనలు
- పలుచోట్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సుందరీకరణ పేరుతో అన్యాయం చేయవద్దని వినతి
- రివర్‌బెడ్ మార్కింగ్‌కు బ్రేక్ వేసిన అధికారులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. నివాసముంటున్న ప్రాంతం నుంచి తమను దూర ప్రాంతాలకు పంపించి అన్యాయం చేయొద్దని బాధితులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్నారు. సుందరీకరణ పేరుతో తమ జీవితాలను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూసీనది అభివృద్ధిలో భాగంగా మూడు రోజుల క్రితం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నదీగర్భంలోని ఇళ్లకు మార్కింగ్ చేశారు. ఇక్కడి నుంచి ఖాళీ చేసి ప్రభుత్వం కల్పిస్తున్న డబుల్ బెడ్‌రూమ్‌లకు వెళ్లి ప్రశాంతంగా జీవించాలని సూచించారు. అయితే ఏళ్ల తరబడి ఇక్కడ ఉంటున్న తమను అర్ధాంతరంగా పంపించడం తగదని, రెండు పడకల ఇళ్లలో కొడుకు, కోడళ్లు, మనుమలు, మనమరాళ్లతో కలిసి ఉండలేమని బోరున విలపిస్తున్నారు. ఈ క్రమంలో మార్కింగ్ చేసేందుకు వచ్చిన అధికారులు, పోలీసులతో చాలా మంది వాగ్వాదానికి దిగడంతో శనివారం నుంచి తాత్కాలికంగా విరామం ఇచ్చారు. కాగా, ఆదివారం కూడా మూసీ పరివాహకంలో అధికారులు కనిపించని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే మార్కింగ్ చేసి డబుల్ బెడ్‌రూమ్‌లకు వెళ్లేందుకు

మిగతా 6వ పేజీలో..



న్యాయం కావాలని హసీంనగర్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బాధితులు

బుజ్జగిస్తున్న అధికారులు..

మూసీ నిర్వాసితులను బుజ్జగించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు తరలించేందుకు రెవెన్యూ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మూసీనది పక్కన ఉండి దోమలు, ఈగలతో ఇబ్బందులు పడడం కంటే.. రెండు పడకల ఇళ్లలో ప్రశాంతంగా ఉండవచ్చని సూచిస్తున్నారు. దీంతో కొంతమంది అధికారుల మాటలకు అంగీకరిస్తుండగా.. మరికొందరు వ్యతిరేకిస్తున్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఇక్కడి నుంచి కదిలేది లేదని తేల్చి చెబుతున్నారు. సోమవారం నుంచి విద్యాశాఖకు సంబంధించిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు (సీఆర్‌పీలు) మూసీ నిర్వాసితులున్న ప్రాంతాలను సందర్శించనున్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లేందుకు ఆసక్తి కలిగిన తల్లిదండ్రుల పేర్లను నోట్ చేసుకుని వారి పిల్లలను స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

జోలపాట నుంచి పెళ్లిపీటల వరకు..


- చిన్నారిని చేరదీసి పెంచి పెద్దచేసిన సెయింట్ అల్ఫోన్సా కరుణాలయం
- 2న ఆ యువతికి వివాహం

రాజేంద్రనగర్, సెప్టెంబర్29(ఆంధ్రజ్యోతి): మానసిక పరిస్థితి బాగాలేని తల్లితో రైలులో కనిపించిన ఏడాది పాపను చేరదీసి పెంచి పెద్ద చేశారు. విద్యాబుద్ధులు నేర్పించారు. ఇప్పుడు దగ్గరుండి వివాహం జరిపించనున్నారు మానసిక వికలాంగుల కేంద్రం నిర్వాహకులు. వివరాల్లోకి వెళ్తే.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సమర్పిత అనే మహిళ 2002లో సంవత్సరం బాలికతో రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉంది. ఆమెను చూసిన రైల్వే ఉద్యోగులు వివరాలు అడగగా, తమది ఒడిశా అని, ఎవరూ లేరని చెప్పింది. దీంతో రైల్వే ఉద్యోగులు ఆమెను, పసిపాపను బుద్వేల్ శ్రీ శివసాయికాలనీలోని సెయింట్ అల్ఫోన్సా కరుణాలయం నిర్వాహకులకు అప్పగించారు. ఆనాటి నుంచి వారి ఆలనాపాలనను ఫాదర్ థామస్ చూస్తూ వచ్చారు. పసిపాపకు క్రిస్టీనా అని నామకరణం చేసి శామీర్‌పేట్ అలియాబాద్‌లోని ఆశ్రమంలో ప్రాథమిక విద్య, కేరళలో ఇంటర్ వరకు చదివించారు. తాజాగా ఆమెకు శామీర్‌పేట్‌కు చెందిన బొమ్మ వికాస్‌తో అక్టోబర్ 2 సాయంత్రం 7 గంటలకు అల్ఫోన్సా కరుణాలయంలో వివాహం చేయనున్నారు.



అక్టోబర్ 2న ఒక్కటి కానున్న క్రిస్టీనా, బొమ్మ వికాస్

DEVARA THANDAVAM



MASS JATHARA



మమ్మల్ని తరలించొద్దు!

(5వ పేజీ తరువాయి)

ఆసక్తి కలిగిన వారిని వివిధ ప్రాంతాల్లోని గృహ సముదాయాలకు తరలిస్తున్నారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు

మూసీ సుందరీకరణను అడ్డుపెట్టుకుని 20-30 ఏళ్ల నుంచి నివాసముంటున్న తమను దూర ప్రాంతాలకు పంపిస్తున్నారంటూ కొందరు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలుపుతున్నారు. కాగా, ఆదివారం లంగర్‌హౌజ్, హైదర్షాకోట్, గంధంగూడ, బండ్లగూడ జాగీర్, బైరాగిగూడ, తదితర ప్రాంతాలకు చెందిన మూసీ నిర్వాసితులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేపట్టడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో కొందరు రివర్‌బెడ్‌లో ఉండగా, మరికొందరు బఫర్‌జోన్లలో ఇళ్లు కట్టుకున్నారు. కాగా, మూసీ, హైడ్రా బాధితులకు అండగా నగర బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు హైదర్షాకోట్‌లో పర్యటించారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు తిరిగి వారికి భరోసా కల్పించారు.


నర్తకి వేక్షాహ్నికను సత్కరిస్తున్న అతిథులు

వండర్ బుక్ ఆఫ్ రికార్డులోకి చిన్నారి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): అతిచిన్న వయసులో గంట పాటు నిరంతరాయంగా నర్తించిన చిన్నారి నర్తకి వేక్షాహ్నిక పంచాది వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించుకుంది. ఈ మేరకు కళాంజలి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వేక్షాహ్నిక రికార్డు ప్రదర్శన చేసింది. నాట్యగురువు సుధాకర్‌రెడ్డి శిక్షణలో కూచిపూడి నాట్యం నేర్చుకున్న వేక్షాహ్నిక గంటపాటు నిర్విరామంగా నర్తించి భళా అనిపించింది. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సౌత్ ఇండియా చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జ్యోతి రంగా రికార్డు పత్రాలను వేక్షాహ్నికకు అందజేశారు. కార్యక్రమంలో నర్తకి తల్లిదండ్రులు డి.వి.ప్రసాద్, శ్వేత పాల్గొన్నారు.


కరుణకుమారికి నియామకపత్రం ఇస్తున్న పాండు యాదవ్

బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలిగా కరుణకుమారి

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా గోల్కొండ జిల్లా అధ్యక్షురాలిగా కరుణకుమారి నియమితులయ్యారు. ఆదివారం గౌలిగూడలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు వి.పాండు యాదవ్ నియామకపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా కరుణకుమారి మాట్లాడుతూ మహిళా మోర్చాను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీజీ వర్సింగ్, కార్వాన్ నియోజకవర్గ కన్వీనర్ గోవర్ధన్, శివ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కార్పొరేటర్ పవన్‌కుమార్ యాదవ్

రంగనాయకులకాలనీని అభివృద్ధి చేస్తా

● కార్పొరేటర్ పవన్‌కుమార్ యాదవ్

పహాడీషరీఫ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ రంగనాయకులకాలనీని అభివృద్ధిలో మొదటిస్థానంలో నిలుపుతానని కార్పొరేటర్ యాతం పవన్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం రంగనాయకులకాలనీలో సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో ఇప్పటికే కాలనీని అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.


'మన్‌కీ బాత్' వింటున్న బీజేపీ నాయకులు

కిస్మత్‌పూర్‌లో 'మన్‌కీ బాత్'

నార్సింగ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన 'మన్‌కీ బాత్' కార్యక్రమాన్ని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు బండ్లగూడ మున్సిపాలిటీ కిస్మత్‌పూర్‌లో ఆలకించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మహేష్‌యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర జీవనశైలితో దీర్ఘాయుషు

సైదాబాద్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యకరమైన జీవనశైలితో గుండె పదిలంగా ఉంటుందని, సంతోషంగా ఎక్కువకాలం జీవించవచ్చని సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) డీఎస్పీ సత్తయ్యగౌడ్ అన్నారు. వరల్డ్ హార్ట్ డేను పురస్కరించుకుని చంపాపేటలోని ఓనస్ రోబోటిక్ ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కే రన్ నిర్వహించారు. ఈ ర్యాలీని డీఎస్పీ సత్తయ్యగౌడ్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో ఆస్పత్రి ఎండీ రామనాయుడు, డాక్టర్ బాలరాజునాయుడు, కార్డియాలజిస్ట్ డాక్టర్ లక్కిరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.


5కే రన్‌లో నార్సింగ్‌వాసులు

స్వచ్ఛత సేవలో భాగంగా 5కే రన్

నార్సింగ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత సేవ కార్యక్రమంలో భాగంగా 5కే రన్‌వే వాక్‌ను నార్సింగ్ మున్సిపాలిటీ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు స్వచ్ఛత సేవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సాయి, కౌన్సిలర్లు అమరేందర్‌రెడ్డి, పత్తి శ్రీకాంత్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నిర్వాహకులు రమేశ్, ప్రభాకర్, చంద్రహాస్, గిరిధర్, డీఈ నరసింహరాజు, యోగేశ్, ఏఈ శ్రీనివాస్, అఖిల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కృష్ణమోహన్‌రెడ్డి, తదితరులు

నైతిక విలువలతో మంచి సమాజం

● వరంగల్ ఎంపీ కడియం కావ్య

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): చెడుకు దూరంగా ఉంటూ నైతిక విలువలతో జీవితం గడిపితే మంచి సమాజం ఏర్పడుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అభిప్రాయపడ్డారు. ఆదివారం నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో జమాతె ఇస్లామీ హింద్ ఉమెన్స్ వింగ్ నిర్వహించిన సభలో 'నైతికతే నిజమైన స్వేచ్ఛ' అనే అంశంపై ఆమె మాట్లాడారు. ముస్లిం మహిళలు నైతిక విలువల ప్రచారం కోసం క్యాంపెయిన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మహిళా సాధికారత అంటే ఆర్థిక సాధికారత మాత్రమే కాదని, ఆరోగ్య సాధికారతనూ సాధించాలని అన్నారు. సమాజం బాగుపడాలంటే పిల్లల్ని నైతికంగా తీర్చిదిద్దాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన జమాతె ఇస్లామీ హింద్ జాతీయ కార్యదర్శి షాయిస్తా రఫత్ మాట్లాడుతూ సమాజంలో యువత వ్యసనాలకు బానిసై అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. బలమైన నైతిక బావాలు బలమైన


మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య

సమాజానికి పునాదులు అని అభిప్రాయపడ్డారు. ఎంపీ కావ్యకు జమాతె ఇస్లామీ హింద్ తెలంగాణ విభాగం తరపున ఖురాన్‌ను బహూకరించారు. సభలో ముస్లిం పర్సనల్ లా బోర్డు నాయకురాలు జలీసా సుల్తాన, ప్రొఫెసర్ షగుఫ్తా షాహీన్, నాసిరా ఖానం తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురా మేకలమండిని తెరిపించేందుకు కృషి

● బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్



మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్

చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా మేకలమండిని తెరిపించేందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. ఆరెకటిక పొదుపు, పరపతి సహకార సంఘం 10వ వార్షికోత్సవాన్ని ఆదివారం గౌలిపురా గాంధీబొమ్మ వద్ద గల ఆరెకటిక భవనంలో నిర్వహించారు. నిరంజన్‌తో పాటు మాజీ కార్పొరేటర్లు ఆలె జితేంద్ర, శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌలిపురా మేకలమండి ఎందరో ఆరెకటికలకు జీవనోపాధి కల్పించిందని గుర్తు చేశారు. మండి మూతపడడం వల్ల వారు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని అందరూ స్వాగతించాలని కోరారు. తెలంగాణలో ఆరెకటికలు సుమారు 4 లక్షల మంది ఉంటారని, వారిని బీసీ-'డి' నుంచి బీసీ-'ఏ'కు మార్చాలని నిరంజన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు యు.యశ్వంత్‌రావు, ఉపాధ్యక్షుడు ఎం.రమేశ్, ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌రాజ్, కోశాధికారి అంబదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఇళ్లు కూల్చాలి

మదీన/పహాడీషరీఫ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మూసీ పరీవాహక ప్రాంతాల్లో పేదలకు ప్రత్యామ్నాయం చూపిన తర్వాతే ఇళ్లు కూల్చాలని బీఆర్ఎస్ కిషన్‌బాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయికిరణ్ డిమాండ్ చేశారు. కిషన్‌బాగ్‌లో పేదలకు నివాసాలకు హైడ్రా అధికారులు రెడ్‌మార్క్ వేసిన ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం పేదలను రోడ్డున పడేయవద్దని సూచించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హైడ్రా నాటకాలు ఆపి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమీద్ డిమాండ్ చేశారు.

హైదర్షాకోట్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

నార్సింగ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ హైదర్షాకోట్, మూసీనది పరీవాహక ప్రాంతాల్లో మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం పర్యటించారు. విషయం తెలుసుకున్న ఇళ్లు కోల్పోయిన ప్రజలు ప్లకార్డులతో నిరసన తెలుపుతూ తమను ఆదుకోవాలని వారు బీఆర్ఎస్ నాయకులకు, కార్యకర్తలకు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఇళ్లు కోల్పోయిన వారు అధైర్య పడవద్దని, బీఆర్ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సీతారాం ధూళిపాళ్ల, ధన్‌రాజ్, రూపారెడ్డి, కౌన్సిలర్లు నవీన్, రాజేంద్రప్రసాద్, నరేందర్, విఠల్, యాలాల కిరణ్,


ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న మహిళలు, చిన్నారులు

లక్ష్మయ్య, శ్రీకాంత్, షేక్ ఆరీఫ్ పాల్గొన్నారు.

నేడు అత్తాపూర్‌కు కేటీఆర్

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): మూసీ నిర్వాసితులకు ధైర్యం చెప్పేందుకు నేడు సాయంత్రం 5గంటలకు రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్‌లోని నందనవనం అపార్ట్‌మెంట్ వద్దకు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు టి.హరీష్‌రావు, పి.సబితారెడ్డి, యువనేత పి.కార్తీక్‌రెడ్డి రానున్నారని ఆ పార్టీ నాయకుడు కొలన్ సుభాష్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

సీఎం దృష్టికి బాలచెలిమి గ్రంథాలయాల ప్రాముఖ్యత


చెలిమి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రియాజ్, వేదకుమార్ తదితరులు

అఫ్జల్‌గంజ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): బాలచెలిమి గ్రంథాలయాల ప్రాముఖ్యతను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ తెలిపారు. రానున్న గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బాలచెలిమి వారియర్స్‌తో ఒక పూట సమావేశం ఏర్పాటు చేస్తానని ఆయన పేర్కొన్నారు. ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్ సెమినార్‌హాల్‌లో ఆదివారం చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ అధ్యక్షుడు, బాలచెలిమి, దక్కన్ ల్యాండ్ పత్రికల సంపాదకులు ఎం.వేదకుమార్ అధ్యక్షతన వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా వేదకుమార్ చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ లక్ష్యాలు, కార్యాచరణ గురించి వివరించారు. 15 జిల్లాల్లో బాలచెలిమి గ్రంథాలయాలు ఏర్పాటు చేశామని, మరో వంద ఏర్పాటు చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట డిగ్రీ కాలేజీ లైబ్రేరియన్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, సిటీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సీహెచ్ రవికుమార్, రచయిత్రి డాక్టర్ ఎ.నీరజ, మహా అకాడమీ డైరెక్టర్ మల్లికార్జునరావు ప్రసంగించారు. బాలచెలిమి గ్రంథాలయాల రాష్ట్ర కన్వీనర్ జి.అశోక్ కుమార్, కో-ఆర్డినేటర్ ఖైజర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దళిత ఎస్ఐ సతీమణికి గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ సీఐ వేధింపులకు తాళలేక ఆత్మహత్య చేసుకున్న ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ సతీమణి కృష్ణవేణికి రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వాలని పలు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శ్రీనివాస్ పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చేర్పించాలని, ఆయన కుటుంబానికి కోటి రూపాయల నగదు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జాతీయ కన్వీనర్ బండారి లక్ష్మయ్య, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు గడ్డం సదానందం, గాయకుడు మచ్చ దేవేందర్, సావిత్రీబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గన్నారపు సరోజన, సీనియర్ పాత్రికేయుడు ఇంద్రవెల్లి రమేష్, మాలమహానాడు జాతీయ నాయకుడు పిల్లి సుధాకర్, కేపీఎస్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉరిమిళ్ల రాజు తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య, చిత్రంలో ఎస్ఐ శ్రీనివాస్‌రావు సతీమణి కృష్ణవేణి తదితరులు

మాట్లాడారు. శ్రీనివాస్ ఆత్మహత్యకు కారకులైన సీఐ జితేందర్‌రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. నిందితులకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కృష్ణవేణి మాట్లాడుతూ తన భర్త ఎస్సీ కులానికి చెందిన వారు కావడం వల్లే ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేయడం లేదని ఆరోపించారు.

తిరుపతి లడ్డూ కల్తీపై సీబీఐ విచారణ చేయాలి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లడ్డూ కల్తీపై సీబీఐతో విచారణ చేయిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మాదిగ హిందూ హక్కుల పోరాట సమితి(ఎంహెచ్‌హెచ్‌పీఎస్) అధ్యక్షుడు డాక్టర్ టీఎన్ వంశీతిలక్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్ టీఎన్ వంశీతిలక్ మాట్లాడుతూ దళితులను హైందవ మతం నుంచి దూరం చేయడానికి కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. మాదిగలు జాంబవంతుల వారసులని స్పష్టం చేశారు. మాజీ సీఎం వైస్ జగన్‌కు తిరుమల వేంకటేశ్వరస్వామిపై నమ్మకం ఉంటే డిక్లరేషన్ చేసిన తర్వాతే శ్రీవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో అనవసరంగా దళితులను లాగుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సమితి నాయకులు చిన్నవీరయ్య, నవీన్‌కుమార్, గోనె సత్యనారాయణ, ప్రకాష్, పరశురాం పాల్గొన్నారు.



బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎంహెచ్‌హెచ్‌పీఎస్ నేతలు

చాంద్రాయణగుట్టను ఆదర్శంగా నిలుపుతాం : బీజేపీ

చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదులో చాంద్రాయణగుట్ట నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఎడ్ల పండరినాథ్ తెలిపారు. ఆదివారం పలు డివిజన్లలో బీజేపీ సభ్యత్వ నమోదును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతీ యువకులు, విద్యావంతులు, మేధావులు బీజేపీ సభ్యత్వం తీసుకోవడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి, జిల్లా కార్యదర్శి బర్ల శ్రీనివాస్, లలితాబాగ్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఎం.బాబురావు, నాయకులు మాణిక్‌రావు, సంజీవ్, శ్రీధర్, సంతోష్, సాయిప్రసాద్ పాల్గొన్నారు.


సభ్యత్వ నమోదులో బీజేపీ నాయకులు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/mmoPe3E లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రమణాచారి తదితరులు

సత్యశోధన పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

రవీంద్రభారతి, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ స్ఫూర్తితో సమాజహితం కోరుతూ పాదయాత్ర చేయాలనుకోవడం అభినందనీయమని రిటైర్డ్ ఐఏఎస్ డా.కేవీ రమణాచారి అన్నారు. విశ్రాంత జిల్లా విద్యాశాఖ అధికారి శివార్చక విజయ్‌కుమార్ బాపు బాటలో సత్యశోధన పేరిట పాదయాత్రను అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం రమణాచారి ఆవిష్కరించారు. చేనేత వస్త్రధారణ, మద్యం, మత్తుమందు వాడకాల నివారణ, స్వదేశీ వైద్యం, సేంద్రీయ వ్యవసాయం, యోగా, పౌష్టికాహారం, నైతికత, ఆధ్యాత్మిక విలువలతో కూడిన విద్య కోసం కృషి చేస్తూ ఈ పాదయాత్ర చేయనున్నట్లు శివార్చక విజయ్‌కుమార్ తెలిపారు. ఈ పాదయాత్ర వంద రోజుల పాటు వెయ్యి కిలోమీటర్లు సాగుతుందని పేర్కొన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పాదయాత్ర చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బడేసాబ్, గంట మనోహర్‌రెడ్డి, విజయ్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, రజాక్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రవికిరణ్

జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ సౌత్ జోన్ క్రీడా పోటీలో రాజేంద్రనగర్ భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమమ్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 18, 19, 20వ తేదీల్లో తమిళనాడు చెంగల్‌పట్టులోని శ్రీ గోకులం పబ్లిక్ స్కూల్‌లో జరిగిన సీబీఎస్ఈ సౌత్‌జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలో రాజేంద్రనగర్ భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమమ్‌కు చెందిన కౌసర్ ఫాతిమా అండర్-17 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికైంది. అక్టోబర్ 17 నుంచి 20వ తేదీ వరకు హరియాణా మహేందర్‌ఘర్‌లోని ఎస్‌డీ సీనియర్ సెకండరీ స్కూల్‌లో జరుగనున్న పోటీల్లో పాల్గొననుంది. అండర్-17 బాక్సింగ్ విభాగంలో చుప్పితాయాదవ్ బ్రాంజ్ మెడల్ గెలుచుకోగా, లక్ష్మీనరసింహ అండర్-14 విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నారు. వీరిని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమమ్ యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవికిరణ్, ఫిజికల్ డైరెక్టర్ బి.మురళీకృష్ణ, ఎన్.సంతోష్, విద్యార్థులు అభినందించారు.


దుర్గామాత స్వాగత హారతిలో కార్తీక్‌రెడ్డి, తదితరులు

ఘనంగా దుర్గామాత స్వాగత హారతి

పహాడీషరీఫ్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ శ్రీరామ కాలనీలో దేవీ నవరాత్రులు ప్రారంభంకానున్న నేపథ్యంలో దుర్గామాత స్వాగత హారతి నిర్వహించారు. స్థానిక కౌన్సిలర్ పల్లపు శంకర్ ఆధ్వర్యంలో జయభేరి యూత్ కమిటీ సభ్యులు, మహిళలు హారతులు, పూలతో అమ్మవారికి ఘనస్వాగతం పలికారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.


శ్రీ చెన్నమల్లికార్జునస్వామి ఆలయం

శ్రీ చెన్న మల్లికార్జునస్వామి ఆలయంలో 3 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): చాంద్రాయణగుట్టలోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ సమేత శ్రీ చెన్న మల్లికార్జునస్వామి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. భ్రమరాంబదేవిని పునఃప్రతిష్ఠ చేసి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ సంవత్సరం అమ్మవారికి సహస్ర చండీయాగ పూర్వక పుష్కర కుంభాభిషేక మహోత్సవం నిర్వహించేందుకు దైవ సంకల్పం చేయడమైనదని వారు పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు తిరుపతి నుంచి 35 మంది శైవాగమ పండితులు రానున్నారని తెలిపారు. ధర్మ సంరక్షణార్థం లోక కళ్యాణార్థం నిర్వహించే ఈ మహత్తర కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


మధుసూదన్‌రెడ్డి

రాజేంద్రనగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం రాజేంద్రనగర్ హనుమాన్‌నగర్ వద్ద జరిగింది. కర్మన్‌ఘాట్ క్రాంతినగర్‌కు చెందిన పి.మధుసూదన్‌రెడ్డి(57) తన ద్విచక్రవాహనం(ఏపీ29 సీ9150)పై హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్ వైపు వస్తున్నాడు. హనుమాన్‌నగర్ పత్తికుంట వద్ద హోటల్ వైపు రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ మౌనిక సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో-నేడు

- స్టాన్లీ మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ వార్షికోత్సవం మాదాపూర్‌లోని శిల్పారామంలో మధ్యాహ్నం 1.30 గంటకు ప్రారంభం.
- హైదర్‌గూడ, కిషన్‌బాగ్, అత్తాపూర్‌లలో మూసీ నిర్వాసితులతో సాయంత్రం 5 గంటలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం.
- దండోరా పబ్లికేషన్స్ ఆధ్వర్యంలో 'పంచుకుందాం రా.. బహుజన మహాకావ్యం' పుస్తకావిష్కరణ సభ రవీంద్రభారతి మినీహాల్‌లో సాయంత్రం 6 గంటలకు ప్రారంభం.
- విశ్వహిందూ పరిషత్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో తిరుమల లడ్డూ వివాదంపై రాష్ట్రవ్యాప్త నిరసనలు.

చిన్నారి క్యాన్సర్ వైద్యానికి దాతల సాయం

- రూ.50వేలు అందజేసిన బాలకృష్ణ ఫ్యాన్స్
- 2వ కీమోథెరపీ ఖర్చులు భరిస్తామన్న కేటీఆర్ ఆఫీసు
- గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా అందుతున్న విరాళాలు


అరుషి తల్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న బాలకృష్ణ ఫ్యాన్స్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆ పసిబిడ్డను ఆదుకోవడానికి దాతలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు క్యాన్సర్ సర్జరీ చేయించుకున్న అయిత గోని రవి, మమత దంపతుల ఏకైక కుమార్తె ఆరుషి(20 నెలలు)కి ప్రస్తుతం కీమోథెరపీ చేయిస్తున్నారు. ఆరు సైకిల్స్ కీమోథెరపీ అవసరం పడడంతో వైద్య ఖర్చుల కోసం తల్లిదండ్రులు దాతల సాయం కోరుతున్నారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో ఈనెల 23న ప్రచురితమైన 'పసికూనపై క్యాన్సర్ ప్రతాపం' అనే వార్తా కథనం దాతలను కదలించింది. నందమూరి బాలకృష్ణ అభిమానులు ఆదివారం ఆరుషి ఇంటికి వెళ్లి రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మాజీ మంత్రి కేటీఆర్ ఆఫీసు నుంచి ఫోన్ చేసి ఆదుకుంటామని హామీ ఇచ్చినట్లు చిన్నారి తండ్రి రవి తెలిపారు. 2వ కీమోథెరపీకి అయ్యే ఖర్చులో రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు భరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. పలువురు దాతలు గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా రూ.1,96,200 వరకు పంపించినట్లు బాలిక తండ్రి చెప్పారు. చిన్నారి ఆరుషికి ఇప్పటి వరకు ఒక కీమోథెరపీ పూర్తయింది. మరో 5 కీమో సైకిల్స్ ఉన్నట్లు ఆయన తెలిపారు.


నిరసన దీక్షలో పాల్గొన్న జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు బాధితులు, నిరసన దీక్ష సన్నాహక కమిటీ ప్రతినిధులు

జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును తరలించాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దమ్మాయిగూడలో ఉన్న జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును నగర నలుమూలలకు తరలించి తమను కాపాడాలని జవహర్‌నగర్ డంపింగ్‌యార్డు సన్నాహక కమిటీ నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జవహర్‌నగర్ డంపింగ్‌యార్డును వెంటనే మూసివేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద డంపింగ్‌యార్డు బాధితులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నిరసన దీక్ష సన్నాహక కమిటీ కన్వీనర్లు రామకృష్ణ, పద్మాచారి, సమ్మిరెడ్డి, సంజీవ్‌రెడ్డి, సందీప్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన నాటి నుంచి స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాజిగిరి ఎంపీగా ఉన్న సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి డంపింగ్ యార్డు విషయంలో తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే డంపింగ్‌యార్డు తరలింపుపై నిర్ణయం తీసుకోకపోతే రాబోయే రోజుల్లో తమ ప్రాంతాలకు చెత్తను తీసుకొచ్చే లారీలను ఎక్కడికక్కడ అడ్డుకొని, నగరాన్ని దిగ్బంధిస్తామని వారు హెచ్చరించారు.


అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ లాలూప్రసాద్ రాథోడ్‌లను సత్కరిస్తున్న వైద్యులు

వైద్యుల సంఘం అధ్యక్షుడిగా డాక్టర్ నరహరి ఎన్నిక

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కోర్టు ఆదేశాల మేరకు ఆదివారం ఉస్మానియా మెడికల్ కాలేజ్ ఆవరణలోని అలుమ్ని భవనంలో నిర్వహించిన ఎన్నికల్లో ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ప్రొఫెసర్ డాక్టర్ నరహరి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్లు లాలూ ప్రసాద్ రాథోడ్ విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకొని, వైద్యుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించి అందుకు అనుగుణంగా ముందుకు సాగుతామన్నారు.


పర్యటన నిమిత్తం రాష్ట్రానికి వచ్చిన మేఘాలయ గవర్నర్ సీహెచ్ విజయ్‌శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన వెంగళరావు నగర్ నలంద విద్యాసంస్థల చైర్మన్ ఎం.శ్రీనివాస్ రాజా
- పంజాగుట్ట (ఆంధ్రజ్యోతి)

ముషీరాబాద్ బీఆర్ఎస్ నేతపై పోలీసుల దాడి

- విరిగిన బాధితుడి చెయ్యి


ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితుడు సత్యనారాయణ బాబు

ముషీరాబాద్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలుచున్న బీఆర్ఎస్ ముషీరాబాద్ మీడియా సెల్ ఇన్‌చార్జి సత్యనారాయణబాబుపై పోలీసులు దాడి చేయడంతో చెయ్యి విరిగింది. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు సత్యనారాయణ బాబు తనపై జరిగిన దాడి వివరాలను వెల్లడించారు. శనివారం రాత్రి వినోబానగర్‌లోని తన ఇంటికి సమీపంలో రోడ్డు పక్కన నిల్చున్న తనను పార్శిగుట్ట నుంచి వినోబానగర్ వైపు వెళ్తున్న పోలీసులు ఇంటికి వెళ్లిపోవాలని హెచ్చరించడంతో పక్కనే తెరిచి ఉన్న బార్‌ను మూయించరా అని ప్రశ్నించానని తెలిపారు. దీంతో 'మమ్మల్నే ప్రశ్నిస్తావా నీకు ఎంత ధైర్యం' అంటూ దుర్భాషలాడుతూ ముషీరాబాద్ ఏఎస్ఐ మోహన్‌రావు, ఇద్దరు కానిస్టేబుళ్లు, రక్షక్ వాహన డ్రైవర్ తనపై లాఠీలతో విచక్షణారహితంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు కొట్టిన దెబ్బల బాధను భరించలేక చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి వెళ్తే వైద్యులు పరీక్షలు చేసి చెయ్యి విరిగిందని చెప్పారని ఆయన తెలిపారు. ఆదివారం దాడి విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు, మాదిగ రాజ్యాధికార పోరాట సమితి నేతలు బాధితుడు సత్యనారాయణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం బాధితున్ని తీసుకొని ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ రాంబాబుకు ఫిర్యాదు చేశారు. సత్యనారాయణ బాబుపై దాడి చేసిన పోలీసులపై కేసు నమోదు చేసి సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమానికి ప్రాధాన్యం

- అవగాహన ర్యాలీలో మంత్రి సీతక్క



వయోవృద్ధుల అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి అనసూయ(సీతక్క) తెలిపారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రతి జిల్లాలో ఓల్డ్ ఏజ్ హోంలు ఏర్పాటు చేసి వారిని సంరక్షించే బాధ్యత తీసుకుంటామని తెలిపారు. అక్టోబర్ 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారత శాఖ ఆధ్వర్యంలో పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్ నుంచి పీపుల్స్ ప్లాజా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున వయోవృద్ధులతో పాటు దివ్యాంగులు పాల్గొన్నారు. వయోవృద్ధుల సంరరక్షణ బాధ్యత తీసుకుంటామని ప్రతిజ్ఞ చేయించి ర్యాలీను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ కోసం యూపీఏ హయాంలో చట్టాన్ని తెచ్చారని, దీన్ని ఎవరు అతిక్రమించినా, చట్టపరంగా శిక్షలు తప్పవని హెచ్చరించారు. ఈ అవగాహన ర్యాలీలో డైరెక్టర్ శైలజ, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా కార్డియాక్ రెహాబ్ రన్


రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువత

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): ప్రపంచ గుండె దినం సందర్భంగా నగరంలోని పీవీ నర్సింహారావు మార్గంలో జరిగిన హెల్త్ రన్ ఉత్సాహంగా సాగింది. 3కే ,5కే, 10కే, 16కే, 21కే విభాగాల్లో సంజీవయ్య పార్కు నుంచి పరుగును బ్రిటిష్ హైకమిషన్ తెలంగాణ జాయింట్ డైరెక్టర్ రేయిహ జెండా ఊపి ప్రారంభించారు. ఇందులో యువతతో పాటు పలు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు. కార్డియాక్ రెహాబ్ ఫౌండేషన్ చైర్మన్, సీఈవో డాక్టర్ మురళీధర్ బాబీ మాట్లాడుతూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే గుండెను పదిలంగా కాపాడుకోవచ్చునని తెలిపారు. మన దేశంలో చిన్నవయస్సు వారికే కరోనరీ హార్ట్ డిసీజ్‌లు రావడం ఆందోళన కలిగించే విషయమని, ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు, వారంలో కనీసం 5సార్లు వ్యాయామం చేయాలని సూచించారు. పెద్ద ఎత్తున యువత పాల్గొనడంతో నెక్లెస్‌రోడ్, ట్యాంక్‌బండ్‌లపై సందడి కనిపించింది.


రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, కళాకారులు

ఘనంగా భారతీయ కళామహోత్సవ్ వేడుకలు

తిరుమలగిరి సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి నిలయంలో భారతీయ కళామహోత్సవ్ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం కలర్స్ ఆఫ్ ది నార్త్ ఈస్ట్ అనే పేరుతో నిర్వహించిన నృత్య ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభమైంది. ఎనిమిది రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు సంప్రదాయ నృత్య రూపకాలను ప్రదర్శించారు. వివిధ రాష్ట్రాల మండపాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మొదటి రోజు తామర పట్టు నేయడం, కుండలు, బుట్టలు అల్లడం వంటివి క్రాఫ్ట్ రూపాల్లో సందర్శించే అవకాశం కల్పించారు. అస్సాం నుంచి వచ్చిన ఆరు స్ట్రింగ్ బ్యాండ్, డాక్టర్ అండ్ ది బ్యాండ్ సంగీత ప్రదర్శనలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. అష్టలక్ష్మి రంగోళీ, ఎనిమిది రాష్ట్రాలకు సంబంధించిన అందమైన దృశ్య రూపకం సందర్శకులకు కనులవిందు చేసింది. భారతీయ కళా మహోత్సవ్ అక్టోబర్ 6 వరకు కొనసాగుతుందని, సందర్శకులు ఉచిత ప్రవేశం కోసం టికెట్లను 'విజిట్.రాష్ట్రపతిభవన్.గొవ్.ఇన్' వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవచ్చని లేదా రాష్ట్రపతి నిలయం వద్ద కౌంటర్‌లో పొందవచ్చని తెలిపారు. ప్యారడైస్ మెట్రోస్టేషన్ నుంచి రాష్ట్రపతినిలయం వరకు షటిల్ బస్సు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

శరీరాన్ని నడిపించే ఇంజన్ గుండె

వరల్డ్ హార్ట్ డే వాక్‌లో డాక్టర్ అమన్ సాల్వాన్


ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ అమన్ సాల్వాన్, డాక్టర్ కృష్ణ మోహన్, చాప్టర్ ప్రతినిధులు

కవాడిగూడ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): శరీరాన్ని నడిపించే ఇంజన్ గుండె అని, అది మానవునికి ప్రధానమైందని ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ అమన్ సాల్వాన్ అన్నారు. ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర చాప్టర్ ఆధ్వర్యంలో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఆదివారం ఇందిరాపార్కులో వరల్డ్ హార్ట్‌డే వాక్‌ను నిర్వహించారు. ఈ వాక్‌ను సొసైటీ గౌరవ కార్యదర్శి డాక్టర్ కృష్ణమోహన్ లాలుకోటతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్యాన్సర్, హెచ్ఐవీ, మలేరియాతో ప్రతియేటా అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ మరణాలకు హృదయ సంబంధ వ్యాధులు ప్రధానకారణమని వివరించారు. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలు మాని వ్యాయామం, వాకింగ్ చేయాలని, పౌష్టికాహారం తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ది కార్డియాలజీ సొసైటీ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ ప్రతినిధులు, డాక్టర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొని ఇందిరాపార్కులో వాకింగ్‌చేసే వారికి అవగాహన కల్పించారు.

ఒత్తిడితోనే గుండె సంబంధిత వ్యాధులు

- స్టార్ హాస్పిటల్స్ గ్రూప్ ఎండీ డా.గోపీచంద్


సినీ నటుడు పద్మశ్రీ బ్రహ్మానందంకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

మోతీనగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి కారణంగానే గుండె సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తున్నాయని స్టార్ ఆస్పత్రుల గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపీచంద్ పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు ఒత్తిడిని తగ్గించుకోవాలని ఆయన సూచించారు. ఆదివారం అంతర్జాతీయ హృదయ దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో 'హార్ట్ టూ హార్ట్' ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండె వ్యాధులను నియంత్రించేందుకు శారీరక శ్రమకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలన్నారు. సినీ హాస్య నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ.. మంచితనం, మానవత్వంతో పాటు సామాజిక స్పృహతో వైద్య వృత్తిలో కొనసాగినప్పుడే సమాజంలో ఉత్తమ వైద్యులుగా గుర్తింపు వస్తుందన్నారు. వైద్యులు మన్నం గోపీచంద్, గూడపాటి రమేష్ అలాంటి వారేనన్నారు. స్టార్ హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గుడపాటి మాట్లాడుతూ.. ప్రపంచంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి గుండె సంబంధిత వ్యాధులున్నాయన్నారు. భారతదేశంలో ప్రతి ఏడాది గుండె జబ్బుల కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోందన్నారు. అయితే గుండె జబ్బుల్లో 80 శాతం వరకు పూర్తిగా నయం చేయగలిగినవేనని ఆయన పేర్కొన్నారు. గత 16 ఏళ్లలో ఐదు లక్షల మంది రోగులకు విజయవంతంగా చికిత్స అందించినట్లు తెలిపారు. కార్డియో సర్జరీల్లో 99.8 శాతం సక్సెస్ రేట్ ఉందన్నారు.

పంచాయతీరాజ్‌లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలి

- రాహుల్‌గాంధీకి ఆర్.కృష్ణయ్య లేఖ

రాంనగర్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్‌సభ ఫ్లోర్ లీడర్ రాహుల్‌గాంధీకి ఆదివారం లేఖ రాశారు. అన్ని రాజకీయ పార్టీలు దీనిపై విధానప్రకటన చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు మెంబర్ల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20నుంచి 42 శాతానికి పెంచుతామని మేనిఫెస్టోలో తెలిపిన ప్రకారం పెంచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కులగణన ప్రక్రియ ప్రారంభం కాలేదని రాహుల్‌గాంధీ స్పందించి చర్యలు వేగవంతం చేయాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అందుకోసం రాజ్యాంగ సవరణ చేయాలని కృష్ణయ్య డిమాండ్ చేశారు.

ముగిసిన సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నగరంలో జరుగుతున్న సివిల్ సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు ఆదివారం ముగిశాయి. కోఠి ఉమెన్స్ కాలేజీ, బజార్‌ఘాట్‌లోని బాలుర జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన సెంటర్లలో ఈనెల 20, 21, 22, 28, 29తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. కాగా, ఆదివారం చివరి రోజు ఉదయం, మధ్యాహ్నం జరిగిన సెషన్‌లో మొత్తం 707 మంది అభ్యర్థులకు 662 మంది (93.64 శాతం) హాజరుకాగా, 45 మంది గైర్హాజరైనట్లు జిల్లా రెవెన్యూ అధికారి, పరీక్షల అసిస్టెంట్ కోఆర్డినేటింగ్ సూపర్‌వైజర్ వెంకటాచారి తెలిపారు. మొత్తం 5 రోజుల్లో జరిగిన పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు చెప్పారు.

సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహిస్తున్నాం

సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్న గ్రామీణ ప్రాంతాల యువతను ప్రోత్సహించేందుకు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ, టైల్రో ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన కల్పతరు 3.0 పోటీ పరీక్షకు 2500 మంది విద్యార్థులు హాజరయ్యారని అకాడమీ నిర్వాహకురాలు బాలలత ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరీక్షలో టాప్ 10లో వచ్చిన విద్యార్థులకు సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీలో సివిల్స్ కోచింగ్ ఉచితంగా ఇస్తామని.. టాప్ 100లో ఉన్న వారికి ఉచితంగా మెటీరియల్ అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక స్తోమత లేని విద్యార్థులు వారి లక్ష్యాన్ని చేరుకోవడంలో సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని, ఇలాంటి కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాల్లో భవిష్యత్‌లోనూ నిర్వహిస్తామన్నారు.

గ్లామన్ మిసెస్ ఇండియా హేమలతారెడ్డి



బంజారాహిల్స్, సెప్టెంబర్ 29(ఆంధ్రజ్యోతి): టీవీ జర్నలిస్ట్, యాంకర్, 'నిన్ను చూస్తూ' అనే సినిమాలో హీరోయిన్‌గా నటించిన హేమలతా రెడ్డిని గ్లామన్ మిసెస్ ఇండియా-2024 అవార్డు వరించింది. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మలేషియాలో ఈనెల 28న జరిగిన పోటీలతో మిసెస్ ఇండియా-2024 అవార్డు దక్కించుకోవడంతో పాటు బెస్ట్ టాలెంట్ అండ్ ఫొటోజెనిక్ విభాగంలో కూడా అవార్డును గెలుచుకున్నానని తెలిపారు. ఈ అవార్డులు తనకు రావడం ఎంతో ఆనందంగా ఉందని, భవిష్యత్‌లో మరిన్ని వేదికలపై తాను అవార్డులు గెలుచుకుంటానని ఆమె తెలిపారు.

సీసీరోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడో?

- రెడ్‌హిల్స్‌లో పనులు ప్రారంభించి నాలుగు నెలలు
- ఆ దారి గుండా వెళ్లేవారికి తప్పని ఇబ్బందులు



ఫ్యాప్సీ నుంచి నాంపల్లి కోర్టుకు వెళ్లే మార్గంలో కొనసాగుతున్న పనులు

మంగళ్‌హాట్, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి నియోజకవర్గంలోని రెడ్‌హిల్స్ డివిజన్‌లో ఉన్న ఫ్యాప్సీ మార్గ్ నుంచి నాంపల్లికోర్టుకు వెళ్లే మార్గంలో సీసీరోడ్డు పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. పురోగతి లేకపోవడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటికి వెళ్లేందుకు కూడా నానా అవస్థలు పడుతున్నారు. నత్తనడకన సాగుతున్న ఈ పనుల కారణంగా నాంపల్లి క్రిమినల్ కోర్ట్ భవనంలోనే దాదాపు 30 కోర్టుల్లో పనిచేసే న్యాయమూర్తులతో పాటు పెద్ద సంఖ్యలో ఈ మార్గంలో ప్రయాణించే న్యాయవాదులు, కక్షిదారులతో పాటు స్థానికులు సైతం ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో పాఠశాలలు, కళాశాలు కూడా ఉండడంతో విద్యార్థులు, మహిళల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఒకవైపు నుంచి రోడ్డు పనులు పూర్తి చేసుకుని వచ్చి మరోవైపు పనులు ప్రారంభించి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నత్తనడకన సాగుతున్న పనులను వెంటనే పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బండ్లగూడలో అర్ధరాత్రి ముజ్రా పార్టీ

- 8 మంది నిర్వాహకులు, నలుగురు ట్రాన్స్‌జెండర్ల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): అసభ్య గీతాలు, అశ్లీల నృత్యాలతో అర్ధరాత్రి నిర్వహిస్తున్న ముజ్రా పార్టీపై సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. 8మంది నిర్వాహకులను, నలుగురు ట్రాన్స్‌జెండర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి లౌడ్‌స్పీకర్స్, యాంప్లీఫైర్ బాక్స్ స్వాధీనం చేసుకున్నారు. అడిషనల్ డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడకు చెందిన హమీద్ గౌస్‌నగర్ లేక్‌వ్యూ హిల్స్‌లో ముజ్రా పార్టీ నిర్వహించాడు. నలుగురు ట్రాన్స్‌జెండర్స్‌ను పిలిపించి అర్ధరాత్రి దాటిన తర్వాత అసభ్య గీతాలతో డీజే సౌండ్స్‌తో అర్ధనగ్నంగా అశ్లీల నృత్యాలు చేయించాడు. సమాచారం అందుకున్న సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు బండ్లగూడ పోలీసులతో కలిసి లేక్‌వ్యూ హిల్స్‌పై దాడి చేశారు. పార్టీలో నృత్యాలు చేస్తున్న నలుగురు ట్రాన్స్‌జెండర్లను, 8మంది నిర్వాహకులను అరెస్టు చేశారు. ప్రధాన ఆర్గనైజర్ హమీద్ పరారీలో ఉన్నాడు. బండ్లగూడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆదాయమే లక్ష్యం.. శివార్లపైనే గురి

- బదిలీలకు దక్షిణ డిస్కం గైడ్‌లైన్స్‌తో సందడి
- పోస్టింగుల కోసం పెద్ద ఎత్తున పైరవీలు
- అభ్యంతరాలపై నేడు సాయంత్రం 5 వరకు గడువు
- అక్టోబర్ 7నాటికి బదిలీల ప్రక్రియ పూర్తి



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్ల బదిలీలకు గైడ్‌లైన్స్ విడుదల కావడంతో దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల్లో సందడి మొదలైంది. బదిలీ అయ్యే ఉద్యోగుల జాబితాను డిస్కం ప్రకటించడంతో కొంతమంది అధికారులు శివారు ప్రాంతాల్లో పోస్టింగుల కోసం పైరవీలు ప్రారంభించారు. శివారు ప్రాంతాలు వేగంగా విస్తరిస్తుండటంతో పాటు పెద్ద సంఖ్యలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణంతో ఆదాయం ఎక్కువగా వస్తుందనే కారణాలతోనే అక్కడ పోస్టింగుల కోసం పోటీపడుతున్నారు. బదిలీల్లో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలోని 10 సర్కిళ్లలో 80 శాతం డివిజన్ ఇంజనీర్లు (డీఈ), అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు(ఏడీఈ) మారే అవకాశాలున్నాయి. డీఈ, ఏడీఈలతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఈ), అదనపు అసిస్టెంట్ ఇంజనీర్లు(ఏఏఈ), సబ్ ఇంజనీర్లు, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్, అకౌంట్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్లు పెద్ద సంఖ్యలో బదిలీ కాబోతున్నారు. మేడ్చల్, కొండాపూర్, ఇబ్రహీంబాగ్, కందుకూర్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, గ్రీన్‌ల్యాండ్స్, జీడిమెట్ల, కూకట్‌పల్లి, చంపాపేట డివిజన్లలో ఆపరేషన్ విభాగంలో పోస్టింగ్ కోసం ఇప్పటికే కొందరు అధికారులు పెద్దఎత్తున పైరవీలు ప్రారంభించారు. మంత్రులతో పాటు తమకున్న ఇతర పరిచయాలతో ప్రభుత్వం పెద్దలను కలుస్తూ కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్ కోసం ప్రయత్నిస్తున్నారు. కొందరైతే భారీగా ఖర్చుపెట్టేందుకు సైతం సిద్ధంగా ఉన్నారంటూ ఇంజనీరింగ్ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. డిస్కం విడుదల చేసిన జాబితాలో అభ్యంతరాలుంటే సోమవారం సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత అధికారులకు సమాచారం అందించే అవకాశాన్ని ఉద్యోగులకు కల్పించారు. అర్హత కలిగిన ఉద్యోగులు పోస్టింగుల కోసం వెబ్‌పోర్టల్‌లో అక్టోబర్ 2 ఉదయం 10 గంటల నుంచి 4వ తేదీ రాత్రి 12 గంటల వరకు దరఖాస్తు చేసుకోవాలని మార్గదర్శకాల్లో వెల్లడించారు. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు అక్టోబర్ 7 లోపు వెలువడనుండగా, బదిలీ అయిన ఉద్యోగులంతా అక్టోబర్ 10 నాటికి కొత్త స్థానాల్లో చేరాల్సి ఉంటుంది.

ఏడీఈ పోస్టులకు భారీ డిమాండ్

డీఈలతో పాటు శివారు ప్రాంతాల్లో ఆపరేషన్ విభాగంలో ఏడీఈ పోస్టులకు మంచి డిమాండ్ నెలకొంది. దక్షిణ డిస్కంలో మొత్తం 204 మంది ఏడీఈల బదిలీలు జరుగుతుండగా మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలోని 20కి పైగా ఆపరేషన్ సబ్‌డివిజన్లలో పోస్టింగులు తెచ్చుకునేందుకు కొందరు అధికారులు పోటాపోటీగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఆపరేషన్ విభాగంలో కీసర, షాద్‌నగర్, ఇస్నాపూర్, ఇబ్రహీంపట్నం, ఆమన్‌గల్, పటాన్‌చెరు, రామచంద్రాపురం, తుర్కయాంజాల్, ఎల్‌బీనగర్, హయత్‌నగర్, మల్కాజిగిరి, శామీర్‌పేట, కుత్బుల్లాపూర్, మేడ్చల్ ప్రాంతాల్లో పోస్టింగుల కోసం ఎక్కువమంది ఇంజనీర్లు పోటీ పడుతున్నారు. దక్షిణ డిస్కంలో డీఈలు 83 మంది, ఏడీఈలు204 మంది, ఏఈలు 521 మంది బదిలీ కానున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా ఇంజనీర్ల బదిలీలు భారీగా జరుగుతుండటంతో విద్యుత్ సరఫరా, బిల్లుల జారీ విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

భారీవర్షం

(5వ పేజీ తరువాయి)

అంతరాయాలు తలెత్తాయి. ఖైరతాబాద్, సంజీవ రెడ్డినగర్, ఎర్రగడ్డ మెట్రోస్టేషన్ల కింద వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొండాపూర్ ఆర్టీఓ ఆఫీస్ పరిసరాలు, మాదాపూర్, సైబర్ టవర్స్ శిల్పారామం ఎదురుగా వర్షం నీరు ఆగకుండా హైడ్రా సిబ్బంది చర్యలు చేపట్టారు.

పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం (రాత్రి 8 గంటల వరకు)

ప్రాంతం	కురిసిన వర్షపాతం (సెం.మీ)
రామచంద్రాపురం	5.6
షేక్‌పేట	3.5
గచ్చిబౌలి	3.3
చందానగర్	3.3
మియాపూర్	2.7
లింగంపల్లి	1.7

మరో రెండురోజులు

గ్రేటర్ పరిధిలో మరో రెండు రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీచేసింది. పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు 30-40కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముంటుందని తెలిపారు. ఉపరితల గాలులు గంటకు 6-10 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయ, దక్షిణ దిశలో వీచే అవకాశముంటుందని వెల్లడించారు.

సముద్రంలో మన సాహసయాత్ర

దూరం 40 వేల కిలోమీటర్లు.. వ్యవధి 8 నెలలు. అది నేల మీద సాగే ప్రయాణం కాదు. ప్రమాదాలు పొంచి ఉండే, సముద్ర ప్రయాణం. ఎగసిపడే అలలు, విరుచుకు పడే తుఫాన్లు, పోటెత్తే సముద్ర జలాలు... ఇలాంటి ఒళ్లు గగుర్పొడిచే ప్రకృతి శక్తులతో పోరాడుతూ, పడవలో ప్రపంచాన్ని చుట్టబెట్టే సాహసయాత్రకు పూనుకోబోతున్నారు నౌకాదళానికి చెందిన ఇద్దరు మహిళా అధికారులు. అక్టోబరు 2న ప్రారంభమయ్యే ఆ యాత్రా విశేషాల గురించిన ఆసక్తికరమైన కథనమిది.

మహిళల్లో ధైర్యసాహసాలకు కొదవ లేదని నిరూపించే బృహత్తర ప్రయత్నంలో భాగంగా భారత నావికా దళం, 2017లో నావికా సాగర్ పరిక్రమ ఎడిషన్‌ను ప్రారంభించింది. సముద్ర ప్రయాణాల పట్ల స్వతహాగా ఆసక్తిని కలిగి ఉన్న మహిళా నావికాదళ అధికారులను నావికాదళం, ఇలాంటి సాహసయాత్రల కోసం ఎంచుకుంటూ ఉంటుంది. అలా రెండవ నావికా సాగర్ పరిక్రమ యాత్రకు, పుదుచ్చేరికి చెందిన ల్యూటినెంట్, క్యాడర్ రూప, కాలికట్‌కు చెందిన ల్యూటినెండ్ క్యాడర్ డిల్నాలు ఈ యాత్రకు ఎంపికయ్యారు. నౌకాదళ కుటుంబాలకు చెందిన 30 ఏళ్ల ఈ ఇద్దరు నౌకాదళ అధికారులు గత మూడేళ్లుగా ఈ సాహసయాత్ర కోసం శిక్షణ పొందుతూ ఉన్నారు. అక్టోబరు 2న, గోవాలోని నేవల్ ఓషన్ సెయిలింగ్ నోడ్, ఐఎన్ఎస్ మండోవి నుంచి వీళ్ల సాహసయాత్ర మొదలు కాబోతోంది.

సమర్థమైన శిక్షణ తీసుకుని...

ఎలాంటి బాహ్య సహాయసహకారాలు లేకుండా, కేవలం పవన శక్తి ఆధారంగా, 21,600 నాటికల్ మైళ్లు (40 వేల కిలోమీటర్లు) దూరం ఈ సముద్రయానం సాగబోతోందని డిల్నా ఈ సాహసయాత్ర గురించి వివరిస్తోంది. ఈ సముద్రాంతర సాహసయాత్రకు సంబంధించిన సన్నాహాల్లో భాగంగా, ఈ ఇద్దరు మహిళా అధికారులు, గత ఏడాది ఆరుగురు సిబ్బందితో కలిసి, గోవా నుంచి కేప్ టౌన్ మీదుగా రియో డి జనీరోకు సముద్రయానం చేశారు. అలాగే గోవా నుంచి శ్రీ విజయపురం (పోర్ట్ బ్లెయిర్)కు కూడా సముద్రంలో ప్రయాణించారు. ఈ ఏడాది ప్రారంభంలో గోవా నుంచి మారిషస్‌లోని పోర్ట్ లూయిస్‌కు కూడా ప్రయాణించి వచ్చారు. ఈ ప్రపంచ సాహసయాత్రను, నావికా ప్రధాన కార్యాలయంలోని, ఇండియన్ నేవల్ సెయిలింగ్ అసోసియేషన్‌తో పాటు, గోవాలోని ఓషన్ సెయిలింగ్ నోడ్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

ప్రమాదకరమైన ప్యాసేజీ గుండా...

ఈ సముద్రయానంలో భాగంగా డిల్నా, రూప, అత్యంత ప్రమాదకరమైన మార్గాల గుండా ప్రయాణించబోతున్నారు. అత్యంత అల్లకల్లోలమైన జలాలు ఆవరించి ఉండే కేప్ లూవిన్, కేప్ హార్న్, కేప్ ఆఫ్ గుడ్ హోప్‌ల గుండా వీళ్ల ప్రయాణం సాగబోతోంది. ఈ ప్రయాణంలో భాగంగా అత్యంత భయంకరమైన డ్రేక్ ప్యాసేజ్ గుండా ప్రయాణించవలసి ఉంటుందని కూడా డిల్నా అంటోంది. 16వ శతాబ్దపు బ్రిటిష్ అన్వేషకుడు సర్ ఫ్రాన్సిస్ డ్రేక్ పేరుతో ప్రసిద్ధి పొందిన ఈ ప్యాసేజ్, కేప్ హార్న్, చిలి, అర్జెంటీనా, అంటార్కిటికాల మధ్య నెలకొని ఉన్న సముద్ర ప్రాంతం. రెండు మహాసముద్రాలను విడగొట్టే ఈ మార్గంలో అలలు 40 అడుగుల మేరకు ఎగసి పడుతూ ఉంటాయి. ఈ ఇద్దరు మహిళలూ, మొదటి విడతలో భాగంగా 45 నుంచి 50 రోజుల పాటు ప్రయాణించి, ఆస్ట్రేలియాలోని ఫ్రెమాంటిల్‌లో మొదటి మజిలీ చేస్తారు. తర్వాత న్యూజిలాండ్‌లోని లిటిల్‌టన్, ఫాక్‌ల్యాండ్‌లోని పోర్ట్ స్టాన్లీ, దక్షిణాఫ్రికాలోని కేప్ టౌన్‌కు చేరుకుని, అంతిమంగా గోవాకు తిరుగు ప్రయాణమవుతారు. ఈ ప్రయాణం గురించి వివరిస్తూ... "మేం 40 డిగ్రీల దక్షిణ అక్షాంశానికి దిగువ నుంచి, 56 డిగ్రీల మేర దక్షిణం వరకూ ప్రయాణిస్తాం. అంటార్కిటికా మాకు కేవలం 800 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఈ ప్రయాణం అసాంతం పడవ ఎన్నో ఒడిదొడుకులకు లోనవుతూ ఉంటుంది కాబట్టి మేం తరచూ ఓడరేవుల్లో ఆగుతూ, పడవ పరిస్థితిని గమనించుకుంటూ ఉండడం అవసరం. 2017లో ఆరుగురు సభ్యులు పాల్గొన్న మొట్టమొదటి సముద్రాంతర ఐఎన్ఎస్‌వి తరుణి పడవనే ఈ యాత్ర కోసం ఉపయోగిస్తున్నాం. కాబట్టి ఆగిన ప్రతి చోటా రెండు వారాల పాటు విరామం తీసుకుంటూ ముందుకు సాగుతూ ఉంటాం' అంటోంది డిల్నా.



మొదటి యాత్రలో మన తెలుగమ్మాయిలు

2017లో నావికాదళం చేపట్టిన నావికా సాగర్ పరిక్రమ మొదటి ఎడిషన్‌లో పాల్గొన్న ఆరుగురు సిబ్బందిలో, మన తెలుగమ్మాయిలు, నేవీ లెఫ్టినెంట్ కమాండర్ 'ఐశ్వర్య బొడ్డపాటి', పి. స్వాతి కూడా ఉన్నారు. 2007, జులైలో నేవీలో చేరిన ఐశ్వర్య, 2014లో ఈ సాహసయాత్రకు దరఖాస్తు చేసుకుంది. 500 మంది మహిళా నౌకాదళ అధికారుల్లో అంతిమంగా 40 మందిని మాత్రమే ఎంపిక చేశారు. వీరిలో 38 మంది వేర్వేరు కారణాల వల్ల శిక్షణ మధ్యలోనే వెనుదిరగడంతో అంతిమంగా ఆరుగురు మహిళా నావికా అధికారులే మిగిలారు. వారిలో ఐశ్వర్య, స్వాతి ఉన్నారు. ఒంటరిగా సముద్రంలో ప్రపంచాన్ని చుట్టివచ్చిన కెప్టెన్ దిలీప్ దొండే నేతృత్వంలో శిక్షణ పూర్తి చేసుకున్న వీళ్లు, 254 రోజుల పాటు సముద్రంలో ప్రయాణించి, సముద్ర యానంతో ప్రపంచాన్ని చుట్టి వచ్చిన మొట్టమొదటి తెలుగమ్మాయిలుగా గుర్తింపు పొందారు. ఈ ప్రయాణంలో భాగంగా, గోవా నుంచి కేప్ టౌన్ వరకూ, 21,600 నాటికల్ మైళ్లు ప్రయాణించి, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, ఫాక్ ల్యాండ్ (యుకె), దక్షిణాఫ్రికా, మారిషస్ దేశాలను చుట్టబెట్టారు. మహిళా సాధికారతతో పాటు, ప్రపంచ వేదిక మీద భారతీయ మహిళా శక్తిని ప్రదర్శించడమే ప్రధానంగా నావికాదళం ఈ సాహసయాత్రలకు రూపకల్పన చేయడం విశేషం.

ఫిర్ భీ దిల్ హై హిందుస్థానీ



పుట్టింది ఇంగ్లిస్తాన్(బ్రిటన్)లో... ఉద్యోగం చేసింది జపాన్‌లో... కానీ సంధ్యాసూరి మనసంతా భారతీయం. ఎందుకంటే... ఆమె తీసిన రెండు డాక్యుమెంటరీలు, ఒక షార్ట్ ఫిల్మ్, తొలి ఫీచర్ ఫిల్మ్ 'సంతోష్'... అన్నిటికీ ఇండియానే నేపథ్యం. 'సంతోష్' ఈ ఏడాది 'కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్'లో ప్రదర్శితమయింది. దాన్ని యూకె ప్రభుత్వం 'ఆస్కార్'కు తమ అధికారిక ఎంట్రీగా ఎంపిక చేసింది. 'జీవితానుభవాలు, సమాజంలోని సంఘటనలే గొప్ప కథలవుతాయి' అంటున్న సంధ్య తన సినీ ప్రయాణం గురించి ఏం చెబుతున్నారంటే...

"నా చిన్నప్పుడు... రోజూ రాత్రి నాన్న ఇంటికి వచ్చేవరకూ మేలుకొని ఉండేదాన్ని. నిద్రపోయేముందు ఆయన ఎన్నో కథలు చెప్పేవారు. అవన్నీ దాదాపు ఇండియాకు సంబంధించినవే. నాలో భారతీయ మూలాలు, భావోద్వేగాలు బలపడడానికి అవే కారణం. నాన్న యశ్‌పాల్ సూరి డాక్టర్. బ్రిటన్‌లోని టీసైడ్‌లో ఉన్న ఒక ఆసుపత్రిలో ఉద్యోగం.. నేను పుట్టింది, పెరిగింది టీసైడ్‌కి దగ్గర్లో ఉన్న డార్లింగ్టన్‌లో. అందరూ నేను నాన్నలా డాక్టర్ అవుతాననుకున్నారు. కానీ నాకు లెక్కలంటే ఆసక్తి. అందులోనే గ్రాడ్యుయేషన్ చేశాను. ఉద్యోగం మాత్రం బ్రిటన్‌లో చెయ్యకూడదనుకున్నాను. జపాన్‌లో టీచర్ ఉద్యోగానికి అప్లై చేస్తే.. నన్ను ఎంపిక చేశారు. ఈ సంగతి చెప్పినప్పుడు నా కుటుంబం కానీ, స్నేహితులు కానీ ఆశ్చర్యపోలేదు. ఎందుకంటే... "అందరి విషయాలూ సంధ్యకే కావాలి. ప్రతిదానిలో దూరిపోతుంది' అనే గొప్ప 'పేరుంది నాకు. అది నిజమే... అన్నీ తెలుసుకోవాలనే కుతూహలం నాకు బాగా ఎక్కువ. అలాగే అపరిచితమైన ప్రదేశాల్లో పర్యటించడం కూడా. జపాన్ నాలో సృజనాత్మకతకు రెక్కలు తొడిగింది. ఖాళీ దొరికినప్పుడల్లా కెమేరాతో ఏదో ఒక ప్రాంతానికి వెళ్ళడం, ఫొటోలు, వీడియోలు తియ్యడం... ఇదే పని. అప్పుడే ఫిలిమ్ మేకర్ కావాలనే కోరిక కలిగింది. అది నానాటికీ బలపడింది. జపాన్ నుంచి వెనక్కు వచ్చాను. బ్రిటన్‌లోని బకింగ్‌హామ్‌షైర్‌లో ఉన్న 'నేషనల్ ఫిలిమ్ అండ్ టెలివిజన్ స్కూల్' (ఎన్ఎఫ్‌టిఎస్)లో 'డాక్యుమెంటరీ ఫిలిమ్ మేకింగ్ కోర్సు'లో చేరాను. స్కాలర్‌షిప్ కూడా సాధించాను. దాంతో నా జీవితంలో కొత్త అధ్యాయం మొదలైంది.

నాన్న టేపులతో...

ఒక చిత్ర నిర్మాణంతో ముడిపడి ఉండే ప్రతి దశ గురించి 'ఎన్ఎఫ్‌టిఎస్'లో నేను తెలుసుకున్నాను. 'ఎలాంటి కాన్సెప్టులు ఎంచుకోవాలి?, వాటిని ఆకట్టుకొనేలా ఎలా చెప్పాలి?' అని ప్రణాళికలు వేసుకొనేదాన్ని. కానీ కోర్సు పూర్తయ్యాక, ఒక డాక్యుమెంటరీ తియ్యాలని అనుకున్నప్పుడు... భారతదేశ నేపథ్యంలోనే అది ఉండాలనుకున్నాను. కానీ నేను పెద్దగా కష్టపడలేదు. దానికి కారణం కూడా మా నాన్నే. ఆయన చాలా క్రియేటివ్ పర్సన్. భారతదేశం నుంచి బ్రిటన్‌కు వలస వచ్చిన తరువాత.. తన అనుభవాలను ఆయన టేప్‌లలో రికార్డ్ చేసి, ఇండియాలోని మా వాళ్ళకు పంపేవారు. అవి నాకు వినిపించేవారు. వాటిని ఆధారంగా తీసుకొని.. 2005లో నా మొదటి డాక్యుమెంటరీని రూపొందించాను. దాని పేరు 'ఐ ఫర్ ఇండియా'. 2006లో అది విడుదలై.. 'సన్‌డ్యాన్స్ ఫిలిమ్ ఫెస్టివల్'లో 'గ్రాండ్ జ్యూరీ ప్రైజ్'కు నామినేట్ అయింది. ఆ తరువాత వ్యక్తిగత కారణాల వల్ల పదేళ్ళకి పైగా సుదీర్ఘమైన విరామం వచ్చింది. ఆ సమయంలో 'ఆక్స్‌ఫామ్' అనే ఛారిటీ సంస్థకు అనుబంధంగా ఒక ఫిల్మ్ యూనిట్ నిర్వహించాను. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, హయితి తదితర దేశాల్లో ప్రకృతి విపత్తులను, అభివృద్ధి కార్యక్రమాలను చిత్రీకరించాను. ఇండియాలో కూడా ఒక ఏడాది ఉన్నాను. ఎన్నో స్క్రిప్టులు తయారు చేసుకున్నాను. బ్రిటిష్ ఇండియాలో భారతీయులు, బ్రిటిష్ వారి జీవనం, వారి మధ్య సామాజిక సంబంధాలు ఎలా ఉండేవి? అనేది ప్రధానాంశంగా.. 'ఎరౌండ్ ఇండియా విత్ ఎ మూవీ కెమేరా' అనే డాక్యుమెంటరీ తీశాను. దానికోసం బ్రిటిష్ ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ ఆర్కైవ్స్‌లోని ఫుటేజిని ఉపయోగించాను. వాటికి ఇండియాలో నేను తీసిన దృశ్యాలను జోడించి.. 2018లో విడుదల చేశాను. అదే ఏడాది రూపొందించిన నా మొదటి షార్ట్ ఫిల్మ్ 'ది ఫీల్డ్'కూడా విడుదలయింది. టొరొంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'బెస్ట్ ఇంటర్నేషనల్ షార్ట్ ఫిలిమ్', 'మెల్బోర్న్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్'లో 'బెస్ట్ ఫిక్షన్ షార్ట్ ఫిల్మ్' అవార్డులను గెలుచుకోవడంతో పాటు పలు చలనచిత్రోత్సవాలకు నామినేట్ అయింది. హరియాణాలోని చిన్న వ్యవసాయ పట్టణమైన షెహ్‌జాదాపూర్‌లోని మొక్కజొన్న తోటల్లో పని చేసే లైలా అనే మహిళ చుట్టూ తిరిగే కథ అది. ఈ లఘు చిత్రం నాకు గొప్ప గుర్తింపు తెచ్చిపెట్టింది. పూర్తి నిడివితో ఒక ఫీచర్ ఫిల్మ్ తియ్యడానికి కావలసిన ఉత్సాహాన్ని నాలో కలిగించింది. ఆ చిత్రమే 'సంతోష్'. సంచలనం రేకెత్తించిన 2012 నాటి నిర్భయ సంఘటన దీనికి ప్రేరణ.



జపాన్ నాలో సృజనాత్మకతకు రెక్కలు తొడిగింది. ఖాళీ దొరికినప్పుడల్లా కెమేరాతో ఏదో ఒక ప్రాంతానికి వెళ్ళడం, ఫొటోలు, వీడియోలు తియ్యడం.... ఇదే పని. అప్పుడే ఫిల్మ్ మేకర్ కావాలనే కోరిక కలిగింది.

వారి వేదన నన్ను కదిలించింది...

నా దృష్టిలో సినిమా అనేది భావోద్వేగపరమైన మాధ్యమం. మన జీవితాలను, సమాజాలను పరిశీలిస్తే... తెరకెక్కించదగిన కథలు ఎన్నో తయారవుతాయి. నిర్భయ సంఘటన తరువాత భారతదేశ వ్యాప్తంగా జరిగిన ఆందోళనలను నేను చాలా దగ్గరగా పరిశీలించాను. ఆందోళన చేస్తున్న మహిళలను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్న మహిళా పోలీసుల్లో కనిపించిన వేదన నన్ను కదిలించింది. వాళ్ళు కూడా ఆ మహిళల్లాంటివారే. వారిలోనూ ఆ సంఘటన పట్ల ఆగ్రహం ఉంటుంది. కానీ దాన్ని ప్రదర్శించడానికి బదులు... ప్రదర్శకులను నియంత్రించే బాధ్యత వారిది. కొన్నాళ్ళపాటు ఆ దృశ్యాలు నాకు పదే పదే గుర్తొస్తూ ఉండేవి. వాటి ఆధారంగా 2016లో ఒక కథ తయారు చేసుకున్నాను. కానీ నిర్మాతలను వెతకడం కష్టమయింది. చివరకు ఇంగ్లండ్, జర్మనీ, ఫ్రాన్స్, ఇండియాలకు చెందిన ఫిల్మ్ ఫండింగ్ సంస్థల భాగస్వామ్యంతో.. ఆ చిత్రం పట్టాలెక్కింది. ఇది సంతోష్ సైనీ అనే మహిళా కానిస్టేబుల్ కథ. ఇది భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ లాంటి ఒక రాష్ట్రంలో జరుగుతుంది. సంతోష్ భర్త విధి నిర్వహణలో మరణిస్తాడు. కారుణ్య నియామకం కింద ఆమెకు కానిస్టేబుల్ ఉద్యోగం వస్తుంది. అయితే.. ఒక బాలిక హత్య కేసు పరిశోధన ఆమె జీవితంలో అనేక సమస్యలకు కారణం అవుతుంది. వర్గం, కులం, ధనం, అసహనం లాంటి వాటి ప్రభావం సమాజంలోని మనుషుల జీవితాల మీద తీవ్రంగా ఉంటుంది. వాటిని ఈ చిత్రంద్వారా చూపించడానికి ప్రయత్నించాను. లఖనవూ, ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో 44 రోజుల పాటు చిత్రీకరణ జరిగింది. యూపీని ఎంచుకోవడానికి కారణం... మాది ఆ ప్రాంతం కావడమే. స్థానికులు చాలామందిని వివిధ పాత్రలకు తీసుకున్నాం. 'సంతోష్' పాత్రలో ప్రముఖ నటి షహనా గోస్వామి అద్భుతంగా నటించింది. ఈ చిత్రం నా అత్యుత్తమ జీవితానుభవాల్లో ఒకటి. ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఈ చిత్రం నామినేట్ అయింది. తొలి ప్రదర్శన కూడా అక్కడే జరిగింది. బ్రిటన్‌లో, ఇండియాలో ఈ సినిమాను స్క్రీనింగ్ చేసినప్పుడు, మరికొన్ని చిత్రోత్సవాల్లో ప్రదర్శించినప్పుడు మంచి స్పందన వచ్చింది. ఇప్పుడు 'బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్' (బిఎఎఫ్‌టిఎ) వచ్చే 'ఆస్కార్'లో 'ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ అవార్డ్' కోసం బ్రిటన్ తరఫు ఎంట్రీగా నా చిత్రాన్ని ఎంపిక చేసింది. ఈ సంగతి తెలియగానే నాలో కలిగిన సంతోషాన్ని మాటల్లో చెప్పలేను. నేను భారతీయ సంతతికి చెందినదాన్ని. భారతదేశంలోనే నా చిత్రాలన్నీ తీశాను. అది గర్వంగా భావిస్తున్నాను. నా తొలి ఫీచర్ ఫిల్మ్‌కే ఇలాంటి గుర్తింపు పొందడాన్ని ఇంకా నమ్మలేకపోతున్నాను. నా రాబోయే ప్రాజెక్టులకు ఇది కచ్చితంగా గొప్ప పునాదిగా నిలుస్తుంది."

హాట్ హిట్స్



ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
2. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
3. ఆయీ నై (స్త్రీ-2)
4. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
5. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. మిలియనీర్ (గ్లోరీ)
8. తైనూ ఖబర్ నహీ (ముంజ్యా)
9. అపనా బనాలే (భేడియా)
10. అంబర్‌సారియా (ఫుకరే)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

ప్రకాశ్‌రాజ్‌తో 'జై శ్రీరామ్' అనిపిస్తా



మంచు విష్ణు

'ప్రకాశ్‌రాజ్ దేవుణ్ణి నమ్ముతారో లేదో నాకు తెలియదు. తిరుమల లడ్డూ కల్తీ వివాదంలో ఆయన చేత 'శివయ్యా' అనిపించా. త్వరలో 'జై శ్రీరామ్' అని కూడా అనిపిస్తా' అని నటుడు, మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు అన్నారు. లడ్డూ కల్తీ వివాదంలో 'మీ హద్దుల్లో ఉండండి' అంటూ ప్రకాశ్‌రాజ్‌ను హెచ్చరిస్తూ తాను చేసిన ట్వీట్‌పై తాజాగా విష్ణు మీడియా ముందు స్పందించారు. 'పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను ప్రకాశ్‌రాజ్ వక్రీకరించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు సబబుగా లేవు. ప్రకాశ్‌రాజ్ అంటే నాకు గౌరవం ఉంది. మా మధ్యన ఎలాంటి గొడవలు లేవు' అని విష్ణు చెప్పారు. అత్యాచారం కేసులో జానీ మాస్టర్‌పై ఆరోపణలు నిజమని తేలితే ఆయనకు కఠిన శిక్ష పడాలని విష్ణు అన్నారు. 'హేమ డ్రగ్స్ కేసుపై స్పందించేందుకు ఆయన నిరాకరించారు.

అశ్లీల చిత్రాలు చూడమన్నారు

- మినుు మునీర్



తనను లైంగికంగా వేధించారంటూ హీరో జయసూర్య సహా పలువురు మలయాళ సినీ ప్రముఖులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన నటి మిను మునీర్ మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. దర్శకుడు బాలచంద్ర మీనన్ సైతం తనను లైంగికంగా వేధించారని ఆమె సోషల్ మీడియా ద్వారా ఆరోపించారు. "2007లో నన్ను తన గదికి పిలిపించుకున్న బాలచంద్ర అశ్లీల చిత్రాలు చూడాలని బలవంతం చేశారు. 'నువ్వు నాకు తోడుగా ఉండాల'ని అడిగారు, నేను వెంటనే అక్కడ నుంచి బయటకు వచ్చాను" అని ఆమె తెలిపారు. మాలీవుడ్‌లో వేధింపులు తట్టుకోలేక తమిళ సినిమాలు చేసుకుంటూ చెన్నైలో ఉంటున్నానని మిను మునీర్ తెలిపారు.

రవితేజ స్థాయికి ఎదగాలి



హీరో రవితేజ తమ్ముడు రఘు కుమారుడు మాధవ్ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ ఇడియట్'. సిమ్రన్ శర్మ హీరోయిన్. 'పెళ్లిసందడి' చిత్రంతో హిట్ అందుకొన్న దర్శకురాలు గౌరి రోణంకి దర్శకత్వంలో జె.జె.ఆర్.రవిచంద్ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ను దర్శకుడు ప్రశాంత్ వర్మ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 'రవితేజ పరిశ్రమలో ఎందరినో ఎంకరేజ్ చేశారు. అందుకే మాధవ్‌ను సపోర్ట్ చేయడం నా బాధ్యతగా భావించి ఇక్కడికి వచ్చా. రవితేజ స్థాయికి మాధవ్ ఎదగాలని కోరుకుంటున్నా' అన్నారు. 'సంగీత దర్శకుడు అనూప్‌కి మొదటే చెప్పా.. మీ సంగీతంతో సినిమా హిట్ కావాలని. ఈ సినిమా చేసే అవకాశం ఇచ్చిన నిర్మాతకు కృతజ్ఞతలు. ఆడియన్స్‌కు రీచ్ అయ్యే అంశాలతో సినిమా రూపొందించాను' అని చెప్పారు దర్శకురాలు గౌరి. సినిమాను త్వరలో విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు.

రామ్‌చరణ్, రైమీ మైనపు విగ్రహం



ప్రతిష్ఠాత్మక మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని త్వరలో ఆవిష్కరించనున్నారు. సింగపూర్‌లోని మ్యూజియంలో చరణ్‌తో పాటు ఆయన పెంపుడు కుక్క రైమీ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఐఫా వేడుకల్లో టుస్సాడ్స్ ప్రతినిధులు తెలిపారు. దీనికి సంబంధించిన ఫొటో షూట్ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. మేడమ్ టుస్సాడ్స్ కుటుంబంలో భాగమవ్వడం తనకు లభించిన గౌరవంగా భావిస్తున్నట్లు రామ్‌చరణ్ తెలిపారు.

బాలీవుడ్‌కు ఐఫా అవార్డులు





ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల వేడుక మూడో రోజు కూడా కొనసాగింది. మొదట దక్షిణాది చిత్ర ప్రముఖులకు అవార్డులు ఇవ్వగా, చివరి రోజు బాలీవుడ్ ప్రముఖుల్ని అవార్డులతో సత్కరించారు. 'జవాన్' చిత్రంలో అద్భుతమైన నటనను ప్రదర్శించిన షారుఖ్‌ఖాన్ ఉత్తమ నటుడి అవార్డును దర్శకుడు మణిరత్నం, సంగీత దర్శకుడు ఏ.ఆర్ రెహమాన్ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే ఉత్తమ నటి అవార్డ్‌ను రాణీ ముఖర్జీ, ఉత్తమ దర్శకుడి అవార్డ్‌ను సందీప్ వంగా, 'ట్వెల్త్ ఫెయిల్' దర్శకుడు విధు వినోద్ చోప్రా స్వీకరించారు. అలాగే 'యానిమల్' సినిమాలో నటించిన బాబీ డియోల్ ఉత్తమ విలన్‌గా అవార్డ్ అందుకున్నారు. సీనియర్ నటి రేఖ, ప్రభుదేవా, షాహిద్ కపూర్, జాన్వీ కపూర్, నోరా ఫతేహి, కృతీ సనన్, అనన్య పాండే ప్రదర్శించిన నృత్యాలు ఆహుతుల్ని అలరించాయి.









డిజిటల్ భారత్ నిధి

నేటి ఆధునిక సాంకేతిక యుగంలో సమాచారమే ఇంధనం. అన్ని రంగాల్లో తారతమ్యాలు ఉన్నట్లే, సమాచార ప్రసారంలో కూడా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఉన్నంత సమాచార వ్యాప్తి మారుమూల, గ్రామీణ ప్రాంతాల్లో ఉండటం లేదు. కారణంగా సమాచార సమ్మిళితత్వం కొరవడి విద్య, ఆర్థిక, సాంకేతికపరమైన అంతరాలు ఇంకా విస్తరిస్తున్నాయి. 'వన్ నేషన్ - వన్ మార్కెట్', 'ఈ-నామ్' వంటి ప్రభుత్వ సమ్మిళితాభివృద్ధి చర్యలు మారుమూల ప్రాంత రైతులు, చేతివృత్తుల వారు, వ్యాపారుల వరకూ చేరలేకపోతున్నాయి.

దీనికి కారణం ప్రైవేటు టెలికం ఆపరేటర్లకు పట్టణాల్లో ఉత్పన్నమయ్యే ఆదాయం గ్రామీణ ప్రాంతాల నుంచి లభించకపోవడం. జనసాంద్రత తక్కువగా ఉండే గ్రామీణ ప్రాంతాల్లో పట్టణాలతో పోలిస్తే నిర్వహణ వ్యయాలు అధికంగా ఉండటం. అయితే, ప్రైవేటురంగం వెనకడుగు వేసిన సమయాల్లో ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం ముందడుగు వేయాల్సి ఉంటుంది. ఈ నిమిత్తం బీఎస్ఎన్ఎల్ ఒక ప్రత్యామ్నాయంగా కొనసాగినప్పటికీ నిధులు, నిర్వహణాపరమైన సమస్యలతో కూనరిల్లుతోంది. ఈ నేపథ్యంలో సంస్థాగత మార్పుల ఆవశ్యకత ఏర్పడింది. దీంతో ప్రభుత్వం 'డిజిటల్ ఇండియా' ప్రణాళికలో భాగంగా 1885 నాటి 'ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టాన్ని' రద్దుచేసి, 2023లో 'టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్'ను తీసుకువచ్చింది. టెలికాం రంగంలో పెట్టుబడులను విస్తరించడానికి, మారుమూల ప్రాంతాలకు కూడా టెలికం సేవలు విస్తరించి సవిస్తృత సమాచార వ్యవస్థను రూపొందించడానికి టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్-2023లో 'డిజిటల్ భారత్ నిధి' ఏర్పాటును అంతర్భాగం చేశారు.



అయితే టెలికం రంగంలో ఇప్పటికే మారుమూల ప్రాంతాలకు సేవలను విస్తరించేందుకు నిధుల సమీకరణ నిమిత్తం 2003లో ఏర్పాటు చేసిన 'యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్(యూఎస్ఓఎఫ్)' స్థానంలో ఈ డిజిటల్ భారత్ నిధిని తీసుకువచ్చారు.

యూఎస్ఓఎఫ్ రద్దుకు కారణాలు

ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్‌కు సవరణలు చేసి 2003లో ఈ 'యూఎస్ఓఎఫ్' నిధిని మారుమూల ప్రాంతాలకు టెలికాం సేవలు విస్తరించేందుకు పెట్టుబడులు జమ చేసే ప్రత్యేక నిధిగా రూపొందించారు.



టెలికాం ఆపరేటర్ల అడ్జెస్టెడ్ గ్రాస్ రెవెన్యూ(ఏజీఆర్- సవరించిన స్థూల ఆదాయం)పై 5 శాతం లెవీ విధించడం ద్వారా ఈ నిధికి వనరులు సమకూరేవి. అయితే ఈ నిధిని స్థాపించిన నాటినుంచి వనరుల అసమర్థ వినియోగం గురించిన విమర్శలను ఎదుర్కొంటూనే ఉంది.

2017-22 మధ్యకాలం చూసుకుంటే ఈ నిధికి రూ.41,740 కోట్లు జమ అవగా, ఖర్చు చేసిన మొత్తం మాత్రం రూ. 30,213 కోట్లు (72 శాతం)గా ఉంది. ఈ నిధుల్లో అత్యధిక భాగం గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలికాం అనుసంధానత విస్తరించడానికి 'భారత్ నెట్ ప్రాజెక్టు' ద్వారా వినియోగం చేయడానికి కేటాయించినా అవి పూర్తిస్థాయిలో వ్యయం చేయలేదు.

ఈ లోపాలను అధిగమించి, టెలికాం రంగంలో మరింత విస్తారమైన సేవలు, వినూత్న కార్యాచరణలు ప్రతిపాదిస్తూ 'డిజిటల్ భారత్ నిధి'కి రూపకల్పన చేశారు. ఈ నిధిని టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్ 2023, సెక్షన్ 24(1) ప్రకారం ఏర్పాటు చేశారు.

డిజిటల్ భారత్ నిధి(డీబీఎన్)

యూఎస్ఓఎఫ్‌కు ప్రత్యామ్నాయంగా తీసుకువచ్చిన ఈ డిజిటల్ భారత్ నిధి కార్యాచరణ పరిధిని మరింత విస్తరించారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు టెలీ కమ్యూనికేషన్స్ సేవలు విస్తరించడంతోపాటు, టెలీ కమ్యూనికేషన్‌కు సంబంధించిన సాంకేతికతలు, ఉత్పత్తుల అభివృద్ధికి, వివిధ రంగాల్లో పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ), పైలెట్ ప్రాజెక్టులకు, బలహీన వర్గాలు, వికలాంగులు, స్త్రీలు, స్వయం సహాయక సంఘాలు వంటి వారికి సహాయం చేసే పథకాలు/ప్రాజెక్టులకు ఈ నిధి నుంచి ఆర్థిక తోడ్పాటు లభిస్తుంది. అదేవిధంగా టెలికాం ఆపరేటర్ల నుంచి వసూలు చేసిన నిధులు(డీబీఎన్ నిధులు) టెలీ కమ్యూనికేషన్స్ యాక్ట్(2023) సెక్షన్ 25 ప్రకారం తొలుత సంఘటిత నిధికి జమ అవుతాయి. తదుపరి కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను పార్లమెంటు ఆమోదంతో డీబీఎన్‌కి బదలాయిస్తుంది.

ఈ నిధికి సంబంధించి ప్రాధికార సంస్థ అయిన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్' ఇటీవల డిజిటల్ భారత్ నిధి నిర్వహణ నియమావళిని విడుదల చేసింది. ఈ నిధిని నిర్వహించే అడ్మినిస్ట్రేటర్ నియామకం, విధులు, నిధి లక్ష్యాలను అమలుచేసే ఇంప్లిమెంటర్(అమలుదారు) ఎంపిక వంటి అంశాల గురించి విశదీకరించడం జరిగింది. ఈ నియమావళి ప్రకారం, కేంద్రప్రభుత్వం డిజిటల్ భారత్ నిధికి ఒక అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తుంది. బిడ్డింగ్ లేదా నామినేషన్ ద్వారా అమలుదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడం, వారిని సమయానుసారం పర్యవేక్షించడం, వివాదాల పరిష్కారం,



నిధుల పంపిణీ, నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి సమర్పించడం, మూల్యాంకనం తదితర విధులను అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటాడు.

అమలుదారుల ఎంపిక ప్రాథమికంగా రెండు విధాలుగా ఉంటుందని నియమావళి సూచిస్తోంది. టెలీ కమ్యూనికేషన్స్ సర్వీస్ ప్రమోషన్ కోసం అమలుదారులను బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేస్తారు. అదే పరిశోధన, అభివృద్ధి కోసం అయితే అప్లికేషన్ ఆధారిత ఎంపిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో ఆపరేటర్స్‌ను నామినేట్ చేసే విచక్షణాధికారాన్ని అడ్మినిస్ట్రేటర్ కలిగి ఉంటారు. టెలీ కమ్యూనికేషన్స్ సేవలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో సేవలను మెరుగుపర్చడం, నెక్ట్స్ జనరేషన్ సాంకేతికతల అభివృద్ధి, టెలీ కమ్యూనికేషన్స్ రంగంలో నవకల్పనలు, స్టార్టప్‌లు, పరిశోధనలకు మద్దతు ఇవ్వడం వంటి కార్యక్రమాలకు గాను అమలుదారుకు నిధులను కేటాయిస్తారు.

ఈ నిధులను అందరికీ ఒకే తరహాలో కాక, అమలుదారుల కార్యకలాపాలను ఆధారం చేసుకుని అడ్మినిస్ట్రేటర్ వారికి పూర్తిగా లేదా పాక్షికంగా కానీ, వయబిలిటీ గ్యాప్ ఫండింగ్, కో ఫండింగ్ తరహాలో నష్టభయాలను తగ్గించుకునేవిధంగా నిధుల కేటాయింపును నిర్ణయిస్తాడు.

డీబీఎన్ ద్వారా ఆశిస్తున్న ప్రయోజనాలు

1. సమాచార యుగంలో డిజిటల్ అంతరాలను రూపుమాపి, ప్రతీ ఒక్కరికీ సమాచార విప్లవ ఫలితాలు అందేలా డిజిటల్ సమ్మిళితత్వాన్ని తీసుకురావడం. తద్వారా ఆర్థిక, సామాజిక అంతరాలను తగ్గించడం.
2. టెలికాం రంగంలో రాబోయే సరికొత్త తరం టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి వ్యవస్థాగత సంసిద్ధత, అవస్థాపన సౌకర్యాల అభివృద్ధి. ఉదాహరణకు ప్రస్తుతం పూర్తిస్థాయిలో 5జీ టెక్నాలజీని అందిపుచ్చుకునే సంసిద్ధత సాధించే లోపే 6జీ ప్రవేశానికి రంగం సిద్ధమవుతోంది. 5జీ కన్నా వెయ్యిరెట్లు వేగవంతమైన 6జీని భారత్‌లో ప్రవేశపెట్టాలంటే మరింత మెరుగైన ఫైబర్ ఆప్టిక్ కేబుల్ వ్యవస్థ, అనుసంధానతలపరమైన నెక్ట్స్ జనరేషన్ సాంకేతికతలను అభివృద్ధి పర్చుకోవాల్సి ఉంటుంది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి డీబీఎన్ నిధి సహకరిస్తుంది.
3. ప్రపంచస్థాయి ప్రమాణాల సాధన ద్వారా భారత టెలికాం రంగాన్ని అభివృద్ధి చేయడం, తద్వారా డిజిటల్ మార్కెట్‌ల విస్తృతి మరింత పెంచి ఆర్థికాభివృద్ధికి తోడ్పడటం. వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు నేడు ఆటోమేటిక్ రూట్ ద్వారా అవకాశం ఉన్న సందర్భంలో మరిన్ని విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.
4. టెలికాం రంగ అభివృద్ధి ద్వారా ఈ-గవర్నెన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ వంటి పారదర్శక విధానాలను ప్రభుత్వ పాలనలో తీసుకురావడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించడం.
5. టెలికాం రంగంలో నవకల్పనలను, స్టార్టప్‌లను, పరిశోధన, అభివృద్ధిని ప్రోత్సహించడం ద్వారా భారతదేశాన్ని టెలికాం రంగ హబ్‌గా మార్చడం. రాబోయే కాలంలో మెటావర్స్ డ్రైవర్‌లెస్ కార్ల వంటి టెలికాం రంగ అనుసంధానత గల విప్లవాత్మక రంగాల్లో ఎర్లీ బర్డ్ అడ్వాంటేజ్‌ను సొంతం చేసుకోవడం.

అయితే ఇలాంటి ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే అనేక సవాళ్లను అధిగమించాల్సి ఉంది. సిగ్నలింగ్ వ్యవస్థలో లోపాలను, సైబర్ సెక్యూరిటీ సమస్యలను, ఈ-వేస్ట్ నిర్వహణ లోపాలను అధిగమించాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా టెలీడెన్సిటీ పరంగా 133.76%గా ఉన్న పట్టణస్థాయికి 58.56%గా ఉన్న గ్రామీణ స్థాయికి మధ్య ఉన్న భారీ అంతరాన్ని తగ్గించడానికి డీబీఎన్ నిధులను సమర్థవంతంగా వినియోగించాల్సి ఉంది. అప్పుడే భారత్ డిజిటల్ ఇండియా కల సంపూర్ణంగా సాకారమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

వాతావరణ భాగాలు



సముద్ర మట్టం నుంచి వాతావరణంలో ఎత్తుకు వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రతలో కలిగే మార్పులను అనుసరించి వాతావరణ నిర్మాణాన్ని అయిదు పొరలుగా విభజించారు.

1) ట్రోపోవరణం: భూమి చుట్టూ వాతావరణం సుమారు 500 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంది.

- భూమి ఉపరితలం నుంచి సుమారు 15 కి.మీ. వరకు వ్యాపించి ఉన్న వాతావరణ పొరను ట్రోపోస్పియర్ అంటారు. దీనినే పరివర్తన ఆవరణం అని కూడా అంటారు.
- వాతావరణంలో ఉన్న మొదటి పొర- ట్రోపోవరణం
- ఇది భూమధ్యరేఖ ప్రాంతంలో 18 కి.మీ. ధ్రువాల వద్ద మాత్రం కేవలం 8 కి.మీ.ల ఎత్తు వరకు ఉంటుంది. కారణం భూమధ్యరేఖ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటం వల్ల వ్యాకోచించి ధ్రువ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండటం వల్ల సంకోచించి ఉంటుంది.
- వాతావరణ మార్పులు చోటుచేసుకునే పొర ఇది. ఇక్కడ మేఘాలు ఏర్పడటం, వాయు, తరంగ, ఉష్ణతరంగ, ఉష్ణ సంవాహన తరంగాలు అధికంగా ఉంటాయి.
- వాతావరణం మొత్తం ద్రవ్యరాశిలో 90 శాతం ద్రవ్యరాశి ట్రోపోస్పియర్‌లోనే ఉంటుంది.
- ట్రోపో ఆవరణం పై సరిహద్దులో పశ్చిమం నుంచి తూర్పునకు అత్యంత వేగంతో వంకరలు తిరుగుతూ కదిలే పవనాలనే జెట్ స్ట్రీమ్స్ అని పిలుస్తారు.
- ఈ ఆవరణంలో ప్రతి వెయ్యి మీటర్ల పైకి వెళ్లేకొద్దీ 6.4 డిగ్రీల సెల్సియస్ చొప్పున లేదా ప్రతి 165 మీ. ఎత్తుకు వెళ్లేకొద్దీ 1 డిగ్రీ సెల్సియస్ చొప్పున ఉష్ణోగ్రతలు తగ్గుతూ ఉంటాయి. దీనినే సాధారణ క్షీణతా క్రమం అంటారు.
- ఈ ఆవరణ పైభాగం కన్నా కింది భాగంలో ఉష్ణోగ్రత అధికంగా ఉండి సంవహన క్రియకు దోహదపడుతుంది.
- ఉష్ణ మండలాల్లో ఈ ట్రోపోవరణం పై పొరల్లో దాదాపు 80 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత ఉంటుంది.
- ధ్రువ ప్రాంతంలోని ఈ ఆవరణం అధిక సాంద్రతను కలిగి భూమధ్యరేఖ ప్రాంతాల్లో సాపేక్షంగా తక్కువ సాంద్రతను కలిగి ఉంటుంది.
- ట్రోపో ఆవరణానికి దానిపై ఉన్న స్ట్రాటో ఆవరణానికి మధ్య గల సరిహద్దునే ట్రోపోపాస్ అని అంటారు.

2) స్ట్రాటో ఆవరణం: భూమి ఉపరితలానికి 15 కి.మీ. ఎత్తు నుంచి 50 కి.మీ.ల ఎత్తు వరకు వ్యాపించి ఉన్న వాతావరణ పొరను 'స్ట్రాటోస్పియర్' అంటారు. దీనినే సమతాప ఆవరణం అని కూడా అంటారు.

- స్ట్రాటోస్పియర్‌లో మాత్రం ఎత్తుకు వెళ్లేకొద్దీ ఉష్ణోగ్రత పెరుగుతుంది. దీనికి కారణం స్ట్రాటోస్పియర్ మధ్య భాగంలో ఆవరించి ఉన్న ఓజోన్ పొర సూర్యకిరణాల నుంచి అతి నీలలోహిత కిరణాలను అడ్డుకుని శోషించుకోవడం వల్లనే ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- ఓజోన్ పొర ఆ ఆవరణంలో 20 కి.మీ.ల ఎత్తు నుంచి 30 కి.మీ.ల ఎత్తు వరకు ఉంటుంది.
- ఓజోన్ పొర పైభాగంలో సూర్యకిరణాల్లో అతి నీలలోహిత కిరణాల ప్రభావం వల్ల ఉష్ణోగ్రత ఎక్కువగా ఉంటుంది.
- ఓజోన్ వాయువునకు సూర్యుని నుంచి వెలువడే కాంతి నీలలోహిత కిరణాలను గ్రహించే శక్తి అధికంగా ఉంటుంది. ఈ పొర లేకపోతే సూర్యుని అతి నీలలోహిత కిరణాలు భూమిపై ఉన్న జీవరాశిపై అత్యంత చెడు ప్రభావం చూపుతాయి.
- ఓజోన్ పొర భూమిపై ఒక మందమైన కవచంలా పనిచేసి అతి నీలలోహిత కిరణాల నుంచి జీవరాశిని రక్షిస్తుంది.
- ట్రోపో ఆవరణంతో పోలిస్తే ఈ ఆవరణంలో మేఘాలు, దుమ్ము, ధూళి కణాలు, నీటి ఆవిరి చాలా తక్కువగా ఉండి ఉన్నత మేఘాలైన సిర్రస్ మేఘాలు విస్తరించి ఉంటాయి.
- స్ట్రాటోస్పియర్‌లోని మండలంలో వాయువులు చాలా తక్కువగా ఉంటాయి. ఎలాంటి ప్రవాహకాలు ఉండక నిశ్చలంగా ఉంటుంది. దీనిలో ఉన్న వాయువులు నైట్రోజన్, ఆక్సిజన్, ఓజోన్ అవి చాలా ఎక్కువగా ఉంటాయి. కానీ అతి నీలలోహిత కిరణాల ప్రభావం వల్ల చురుకుగా ఉంటాయి.
- ఈ ఆవరణాన్ని ఓజోన్ ఆవరణం అని కూడా అంటారు. అయితే ఈ ఆవరణం ప్రారంభంలో సుమారు -60 డిగ్రీల సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రత ఉండి, ఆపై కొంతదూరం వరకు స్థిరంగా ఉండి ఆపై ఓజోన్ వాయువు అతి నీలలోహిత కిరణాలను హరించడం వల్ల ఉష్ణోగ్రతలు 0 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరుగుతుంది.
- ఈ ఆవరణం పైభాగంలో ఉన్న సన్నని పొరను స్ట్రాటోపాస్ అని కూడా అంటారు.
- 2014 ఆగస్టు 15న మిగ్-29 విమానంలో ప్రయాణించి స్ట్రాటో ఆవరణాన్ని చేరిన తొలి భారతీయుడు టి.ఎస్.సురేష్‌కుమార్

3) మీసో ఆవరణం: స్ట్రాటోపాస్ తరవాత భూమి నుంచి 50 కి.మీ.ల నుంచి 80 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. దీనినే మధ్య ఆవరణం/మీసో ఆవరణం అని కూడా అంటారు.

- దీనిలో పీడనం చాలా తక్కువగా ఉంటుంది. ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూపోతుంది.
- ఈ ప్రాంతంలో ఓజోన్ పొర చాలా పలుచగా వ్యాపించి ఉంటుంది. కాబట్టి ఉష్ణోగ్రత విలువలు ఎప్పుడూ తక్కువగా ఉంటాయి. కాబట్టి అతి నీలలోహిత కిరణాలను తక్కువగా శోషించుకోవడం వల్ల ఉష్ణోగ్రత విలువలు తగ్గిపోతున్నాయి.
- ఈ ఆవరణంలో కూడా ఉష్ణోగ్రత క్షీణతా క్రమ పరిస్థితులున్నందున దీనిని బాహ్య ట్రోపో ఆవరణం అని అంటారు.
- ఈ ఆవరణానికి దాని పైనున్న థర్మో ఆవరణానికి మధ్య గల సరిహద్దును మీసోపాస్ అని పిలుస్తారు.
- ఈ ఆవరణం పై సరిహద్దులో ఉష్ణోగ్రతలు -120 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు తగ్గిపోయి ఉంటాయి. అందువల్ల దీనిని వాతావరణంలోని అతి శీతలమైన భాగంగా పిలుస్తారు.

4) థర్మో ఆవరణం: భూమి ఉపరితలం నుంచి సుమారు 80 కి.మీ.ల ఎత్తు నుంచి 500 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉన్న వాతావరణాన్ని థర్మోస్పియర్ అంటారు.

- మీసో ఆవరణం చివరిస్థానం నుంచి క్రమంగా ఉష్ణోగ్రత పెరిగి 1200 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు చేరుకుంటుంది. కాబట్టి దీనిని ఉష్ణమండలం లేక థర్మోస్పియర్ అంటారు.
- ఈ ప్రాంతంలో వాయు మూలకాలు అత్యల్పంగా ఉండి అయానిక రూపంలో ఉంటాయి కాబట్టి ఈ ప్రాంతాన్ని అయనో ఆవరణం(అయనోస్పియర్) అని అంటారు.
- రేడియో తరంగాలను ఈ ఐనోస్పియర్లోకి పంపినప్పుడు ఇవి తిరిగి పరావర్తనం చెంది భూమి పైకి ప్రసరిస్తాయి. కాబట్టి రేడియోల ద్వారా సమాచారాన్ని ప్రపంచంలోని ఏ ప్రాంతం నుంచి అయినా వినగలుతున్నాం.

5) బాహ్య ఆవరణం: ఇది వాతావరణంలో చాలా ఎత్తుగా ఉండే చివరి పొర.

- భూమి ఉపరితలం నుంచి సుమారు 500 కి.మీ.ల ఎత్తు నుంచి 1,600 కి.మీ. ఎత్తు వరకు వ్యాపించి ఉంటుంది. హైడ్రోజన్, హీలియం పరమాణువులు మాత్రమే చాలా తక్కువ సంఖ్యలో ఉంటాయి. హైడ్రోజన్ వాయు రూపంలో ఉంటుంది.



వి. వెంకట్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

నంబర్ రిపీట్ టెస్ట్

పార్ట్-1

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో అనేక సంఖ్యల క్రమం(లాంగ్ నంబర్ సిరీస్) లేదా వర్ణమాల అక్షరాల క్రమం (ఆల్ఫాబెటికల్ లెటర్ సిరీస్) ఇస్తారు. ఈ రకమైన ప్రశ్నలకు అభ్యర్థి ముందుగా ప్రశ్నలో ఇచ్చిన నియమాన్ని జాగ్రత్తగా అవగాహన చేసుకొని కచ్చితంగా అదే నియమాన్ని అనుసరిస్తున్న సంఖ్యల సమూహాలు లేదా వర్ణమాల అక్షరాల సమూహాలు ఇచ్చిన సిరీస్‌లో ఎన్నిసార్లు వచ్చిందో సరిచూసుకొని నాలుగు ఆల్టర్నేటివ్ చాయిస్‌ల నుంచి సమాధానాన్ని గుర్తించాలి.

గమనిక: ఈ టెస్ట్‌కి సంబంధించిన ప్రశ్నలలో సాధారణంగా మూడు సంఖ్యలు లేదా మూడు వర్ణమాల అక్షరాలను ఒక సమూహంగా భావించాలి. (ముందు అనగా ఎడమవైపు, తరవాత అనగా కుడివైపు అని అర్థం)

1. కింది సంఖ్యాక్రమంలో ముందు 2 ఉండి, తరవాత 4 గల 3లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

ఎ) మూడు బి) నాలుగు సి) రెండు డి) ఏమీలేవు

సమాధానం: (ఎ)

వివరణ: 6 8 4 2 3 4 9 2 4 3 2 3 4 5 8 4 3 4 2 3 4 5 6

పై ప్రశ్నలో '3'లు గురించి అడిగారు. కాబట్టి '3' 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 2 ఉండటం అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3'కి ఎడమవైపు 2 ఉండాలని అర్థం. తరవాత 4 అనగా 'బేసిక్' సంఖ్య అయిన '3' కి కుడివైపు 4 ఉండాలి. అనగా 234 అనే సమూహాలు మూడు ఉన్నాయి.

2. కింది సంఖ్యాక్రమంలో ముందు 4 లేకుండా, తరవాత 6గల '5'లు ఎన్ని ఉన్నాయి?

6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

ఎ) రెండు బి) మూడు సి) నాలుగు డి) అయిదు

సమాధానం: (సి)

వివరణ: 6 8 4 5 6 3 8 6 5 6 9 2 5 5 6 8 5 4 3 5 6 5 6 4

పై ప్రశ్నలో '5'లు గురించి అడిగారు. కాబట్టి '5' 'బేసిక్'గా తీసుకోవాలి. తరవాత 6 గల అనగా 5కి కుడివైపు 6 ఉండటం అని అర్థం. అనగా 56. ముందు 4 లేకుండా అనగా 5కి ఎడమవైపు 4 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 56కి ముందు(ఎడమవైపు) 4 లేని సమూహాలు నాలుగు ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 35656 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

3. కింది సంఖ్యాక్రమంలో ముందు 7 ఉండి, తరవాత 9 లేని '8'లు ఎన్ని ఉన్నాయి?

8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

ఎ) మూడు బి) అయిదు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (బి)

వివరణ: 8 5 7 8 4 3 7 8 7 8 6 2 4 7 8 9 3 2 7 8 5 7 8 2 5

పై ప్రశ్నలో 8 లు గురించి అడిగారు. కాబట్టి '8'ని 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు 7 ఉండి అనగా 8కి ఎడమవైపు 7 ఉండటం అని అర్థం అనగా 78. తరవాత 9 లేకుండా అనగా 8కి కుడివైపు 9 ఉండకూడదు. అనగా ఈ ప్రశ్న అర్థం 78కి తరవాత (కుడివైపు) 9 లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనించండి: పై ప్రశ్నలో 78786 అనే అయిదు సంఖ్యలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

4. కింద ఇచ్చిన వర్ణమాల క్రమంలో ముందు 'L' ఉండి, తరవాత 'N' లేని 'M' లు ఎన్ని ఉన్నాయి?

J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K


ఎ) 3 బి) 4 సి) 5 డి) ఏమీలేవు

సమాధానం: (ఎ) అవుతుంది.

వివరణ: J H K L M N Q P R N L M T R T P L M J K H J L M S Q K ఇచ్చిన ప్రశ్నలో ముందు 'L' ఉండి తరవాత 'N' లేని 'M' లు అనగా LM ఉండి 'N' ఉండకూడదు.

Mలు ఎన్ని ఉన్నాయని అడిగారు. కాబట్టి 'M'ని బేసిక్‌గా తీసుకోవాలి. ముందు 'L' ఉండి అనగా 'M'కి ముందు అనగా ఎడమవైపు 'L' ఉండాలి అనగా 'LM'. తరవాత 'N' లేని అనగా 'N' కి కుడివైపు 'N' ఉండకూడదు.

ఈ ప్రశ్నలో Mకు ముందు 'L' ఉండి తరవాత 'N' లేని అక్షర సమూహాలు మూడు ఉన్నాయి. సమాధానం (ఎ) అవుతుంది.



5. కింది వర్ణమాల క్రమంలో ముందు A లేకుండా, తరవాత C లేకుండా గల 'B' లు ఎన్ని ఉన్నాయి?

C D B A G C B B D F C B A B C E B A B G

ఎ) అయిదు బి) మూడు సి) నాలుగు డి) ఆరు

సమాధానం: (ఎ)

వివరణ: C D B A G C B B D F C B A B C E B A B G

పై ప్రశ్నలో 'B'లు గురించి అడిగారు. కాబట్టి Bను 'బేసిక్'గా తీసుకోవాలి. ముందు A లేకుండా అనగా 'B'కి ఎడమవైపు A ఉండకూడదు. తరవాత 'C' లేని అనగా 'B' కి కుడివైపు 'C' ఉండకూడదు. ప్రశ్నలో ఇచ్చిన ప్రతి 'B'ని పరిశీలిస్తే Bకి ఎడమవైపు Aలేని, Bకి కుడివైపు 'C' లేని సమూహాలు 5 ఉన్నాయి.

గమనిక: పై సిరీస్‌లో CBBD అనే 4 అక్షరాలలోనే రెండు సమూహాలు ప్రశ్నలో గల నియమాన్ని అనుసరించి ఏర్పడ్డాయి.

6. కింది సంఖ్యలను ఆరోహణ క్రమంలో రాసిన తరవాత మధ్య సంఖ్య, మధ్య అంకెను తెలపండి?

684, 932, 456, 369, 274, 725, 593

ఎ) 5 బి) 8 సి) 9 డి) 2

సమాధానం: (సి)

వివరణ: ఆరోహణ క్రమం అనగా చిన్నసంఖ్య నుంచి పెద్దసంఖ్యకు వరుస క్రమంలో రాయడం.

పై ప్రశ్నలో తెలిపిన సంఖ్యల ఆరోహణ క్రమం ఈవిధంగా ఉంటుంది.

274, 369, 456, 593, 684, 725, 932

ఈ సంఖ్యల మధ్య సంఖ్య 593. అందులో మధ్య అంకె 9.

7. ఒక సంఖ్య 4 కంటే పెద్దది, 8 కంటే చిన్నది అదే సంఖ్య 6 కంటే పెద్దది, 9 కంటే చిన్నది అయితే ఆ సంఖ్యను తెలపండి?

ఎ) 6 బి) 7 సి) 5 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: 4 కంటే పెద్ద, 8 కంటే చిన్న అనగా 4, 8 మధ్య అంకెలు రాసుకోవాలి 5, 6, 7. 6 కంటే పెద్ద, 9 కంటే చిన్న అనగా 6, 9ల మధ్య అంకెలు రాసుకోవాలి 7, 8.

పై రెండింటిలో కామన్‌గా ఉన్న '7' సమాధానం అవుతుంది.

8. సంఖ్య '9854236107'లో ప్రతి రెండు అంకెలను తిప్పిరాసిన ఎడమ నుంచి అయిదో స్థానానికి గల కుడివైపు మూడోస్థానంలో ఉండే అంకె ఏమిటి?

ఎ) 1 బి) 6 సి) 3 డి) 7

సమాధానం: (బి)

వివరణ: ఇచ్చిన సంఖ్యలో ప్రతి రెండు అంకెలను తిప్పిరాయగా ఏర్పడే నూతన సంఖ్య 8 9 4 5 3 2 1 6 7 0. ఈ సంఖ్యలో ఎడమ నుంచి అయిదో స్థానంలో గల అంకె 3. దానికి కుడివైపు మూడో స్థానంలో గల అంకె '6' కాబట్టి సమాధానం '6' అవుతుంది.

9. 1 నుంచి 50 వరకు గల సంఖ్యలలో 3తో భాగించబడే సంఖ్యలను ఆరోహణ క్రమంలో రాయగా మొదటి నుంచి 12వ స్థానంలో వచ్చే సంఖ్య ఏమిటి?

ఎ) 30 బి) 42 సి) 36 డి) 48

వివరణ: 3తో భాగించబడే సంఖ్యలు 3rd tableకి సంబంధించినవి. ఆరోహణ క్రమం అనగా చిన్న సంఖ్య నుంచి పెద్ద సంఖ్యకు రాయాలి. 1 నుంచి 50 వరకు సంఖ్యలలో 3తో భాగించబడే సంఖ్యలు 3, 6, 9, 12, 15, 18, 21, 24, 27, 30, 33, 36, 39, 42, 45, 48. వీటిలో మొదటి అనగా '3' నుంచి సరిచూసుకుంటే 12వ స్థానంలో వచ్చే సంఖ్య '36'.

లేదా

3rd table కాబట్టి 12వ స్థానంలో ఉండే సంఖ్య 12 x 3 = 36 అవుతుంది.

10. కింది సిరీస్‌లో ముందు సరిసంఖ్య ఉండి, తరవాత బేసిసంఖ్య గల 4లు ఎన్ని ఉన్నాయి?

845249623449434849 6.

ఎ) నాలుగు బి) మూడు సి) అయిదు డి) ఆరు

సమాధానం: (ఎ)

వివరణ: 8 4 5 2 4 9 6 2 3 4 4 9 4 3 4 8 4 9 6.

ఈ ప్రశ్నలో 4లు గురించి అడిగారు. కావున '4'ని బేసిక్‌గా తీసుకోవాలి. దానికి ముందు అనగా 4కి ఎడమవైపు సరిసంఖ్య, 4కి తరవాత అనగా 4కి కుడివైపు బేసిసంఖ్య గల సమూహాలు నాలుగు ఉన్నాయి.

11. కింది సంఖ్యాక్రమంలో మధ్యలో 6 ఉండి ఇరువైపుల 5, 7లు గాని లేదా 7, 5లు గాని గల సమూహాలు ఎన్ని ఉన్నాయి?

38567245876548345678824765352876542

ఎ) నాలుగు బి) అయిదు సి) అయిదు కన్నా ఎక్కువ డి) ఏమీలేవు

సమాధానం: (బి)

వివరణ: 38567245876548345673824765352876542.

మధ్యలో '6' ఉండి ఇరువైపుల 5, 7 లేదా 7, 5 లు గల సమూహాలు అనగా 6కి కుడి, ఎడమలలో ఎక్కడైనా 5, 7లు ఉండాలి. దీని అర్థం 567, 765 రెండు సరైనవే. ఇలాంటి సమూహాలు ఇచ్చిన ప్రశ్నలో 5 ఉన్నాయి.

12. 5 నుంచి 45 సంఖ్యల మధ్య 3చే భాగింపబడుతూ '5'చే భాగింపబడని అంకెలు ఎన్ని?

ఎ) 15 బి) 10 సి) 11 డి) 12

సమాధానం: (సి)

వివరణ: 5 నుంచి 45 సంఖ్యల మధ్య 3తో భాగింపబడుతూ '5'తో భాగింపబడని అంకెలు 11 ఉన్నాయి. ఆ అంకెలు వరుసగా 6, 9, 12, 18, 21, 24, 27, 33, 36, 39, 42.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

హైడ్రా బుల్డోజర్లు మా పైనుంచే వెళ్లాలి

» పేదల ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా: సంజయ్



బర్కత్‌పుర, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదలకు చుక్కలు చూపిస్తోందని.. నిరుపేదల ఇళ్లను కూల్చడమే ఇందిరమ్మ రాజ్యామా..? అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. హైడ్రా బుల్డోజర్లు ముందు బీజేపీ నేతలు, కార్యకర్తలపై నుంచే పేదల ఇళ్ల వద్దకు వెళ్లాలని అన్నారు. హైడ్రాపై ప్రభుత్వం పునః సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నగరానికి వచ్చిన తర్వాత ప్రణాళికలు రూపొందిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చేదాకా పోరాటం చేస్తామని చెప్పారు. ప్రధాని మోదీ 74వ జన్మదినం సందర్భంగా ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా పక్వాడ ఫొటో ఎగ్జిబిషన్‌ను సంజయ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హైడ్రా వల్ల రియల్ ఎస్టేట్, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నదని ఆరోపించారు. కలెక్టరేట్లు, ఫైర్ స్టేషన్ల నిర్మాణం పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల స్థలాలను గుంజుకుందని.. ఇప్పుడు మూసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చివేస్తోందని సంజయ్ మండిపడ్డారు. ఈ నెల 17న ప్రధాని మోదీ జన్మదినం నుంచి అక్టోబరు 2 గాంధీ జయంతి వరకు పలు సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు.

పేదల జోలికి హైడ్రా వస్తే సహించం: కూనంనేని

ఇల్లెందు, సెప్టెంబరు 29: హైడా పేరుతో నిరుపేదలు, మధ్యతరగతి ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న తొందర పాటు చర్యలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఫాం హౌస్‌లు, సంపన్నుల భవనాలు తొలగిస్తే తమకేమీ అభ్యంతరం లేదని, కానీ పేదల జోలికి వస్తే మాత్రం ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు. ఆదివారం రాత్రి ఖమ్మం జిల్లా ఇల్లెందులో జరిగిన సీపీఐ జనరల్ బాడీ విస్తృత స్థాయి సమావేశంలో కూనంనేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ కోసం శాసనసభ ఎన్నికల్లో సీపీఐ త్యాగాలు చేసిందని గుర్తుచేశారు. ఇష్టారాజ్యంగా బీఆర్ఎస్ తరహాలో వ్యవహరిస్తే కాంగ్రెస్ నష్టపోతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు దశ దిశ అర్థం కావడం లేదని, కాంగ్రెస్‌కు ఆవేశం ఉంది కానీ ఆలోచన, నిర్దిష్ట ప్రాతిపదిక లేదని విమర్శించారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉంటే అన్నింటినీ సమర్థించడం తమ పార్టీ సిద్ధాంతం కాదని కూనంనేని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్, కోఆప్షన్ సభ్యుడు బాసా శ్రీనివాసరావుతో పాటు ఇల్లెందు, కోయగూడెం, ప్రాంతాలకు చెందిన కార్యకర్తలు సీపీఐలో చేరారు. వారికి ఎమ్మెల్యే కూనంనేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

భూమి కబ్జా చేసి వెంచర్

» మల్లారెడ్డి అనుచరుల నిర్వాకం ... బాధితుల ఆందోళన

కీసర, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అనుచరులు తమ భూమిని కబ్జా చేసి వెంచర్ చేశారని బాధితులు ఆదివారం ఆందోళనకు దిగారు. అంకిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలో తమకు వారసత్వంగా సంక్రమించిన 18 ఎకరాల పైచిలుకు భూమిని మల్లారెడ్డి అనుచరులైన కొంతమంది రియల్టర్లు తమ సంతకాలు లేకుండానే కేజీఎఫ్ వెంచర్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, వెంచర్‌లో విల్లాలు నిర్మించి విక్రయిస్తున్నారని ఆరోపించారు. న్యాయం చేస్తానని వాళ్లలో కొంతమంది గతంలో తమతో సంప్రదింపులు జరిపి చివరకు విస్మరించారని వాపోయారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని, లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని వెంచర్ గేటు ముందు బైఠాయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని చట్టప్రకారం పోరాటం చేయాలని వారికి నచ్చజెప్పి పంపించారు.

హైడ్రాను ఆపొద్దు... ఆక్రమణలను కూల్చాల్సిందే

» తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ కేశవులు డిమాండ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చెరువులు, కుంటలు, వాగులు, ప్రభుత్వ భూములను కబ్జా చేసి నిర్మించుకున్న కట్టడాలను కూల్చివేయాల్సిందేనని తెలంగాణ మేధావుల సంఘం చైర్మన్ డాక్టర్ కేశవులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. రాష్ట్రంలో చెరువులు, నాలాలు, కుంటలను కబ్జాల చెర నుంచి కాపాడుతున్న హైడ్రాను ఆపొద్దని, హైడ్రాను తెలంగాణవ్యాప్తంగా కొనసాగించాలన్నారు. ధనవంతులు, బడాబాబులు ఆక్రమణలకు పాల్పడితే వారి కట్టడాలను కచ్చితంగా కూల్చాల్సిందేనని సూచించారు. అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో భాగంగా ముందుగా పెద్దల ఇళ్లు ఇళ్లు, ఫామ్‌హౌసులు కూల్చాలన్నారు. నిరుపేదల ఇళ్లను కూల్చే ముందు వారికి నివాస సదుపాయాలు కల్పించాలని కోరారు. పెద్దల ఇళ్లు కూల్చేందుకు సమయమిస్తున్న అధికారులు.. పేదల ఇళ్లను కూల్చేందుకు సమయమివ్వడంలేదన్న అపవాదును తొలగించుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

అమీన్‌పూర్ తహసీల్దార్ కక్ష కట్టి...
మా భవనాలను కూలగొట్టించారు

సీఎం న్యాయం చేయాలి..కిష్టారెడ్డిపేట బాధితుల ఆవేదన

పంజాగుట్ట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ కక్ష కట్టి హైడ్రా పరిధిలో లేకున్నా వారి సహాయంతో కిష్టారెడ్డిపేటలోని తమ మూడు భవనాలను కూలగొట్టించారని బాధితులు ఆరోపించారు. అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే భవనాలు నిర్మించామని, కానీ.. తహశీల్దార్ నోటీసులు ఇచ్చి వేధిస్తుండడంతో హైకోర్టును ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. న్యాయస్థానం ఆదేశాలను బేఖాతర్ చేస్తూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే గత ఆదివారం తమ మూడు భవనాలు కూల్చివేశారన్నారు. అది ప్రభుత్వ భూమి అయితే సర్వే చేయించి పరిధులు తేల్చాలని కోరినా తహశీల్దార్ పట్టించుకోకుండా తమను రోడ్డున పడేశారన్నారు. తమకు సుమారు రూ.16కోట్లు నష్టం వచ్చిందని బాధితులు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయం కోర్టు పరిధిలో ఉండడంతో తాము బయటికి రాకూడదనుకున్నామని, హైడ్రా కమిషనర్ తప్పుడు ప్రకటన చేయడంతో మీడియా ముందుకొచ్చామన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కిష్టారెడ్డిపేట సర్వే నెంబర్ 165, 166 శ్రీకృష్ణా నగర్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్లు 74, 90, 92ల యజమానులు వరుసగా మధుసూదన్ కుమార్, కళ్యాణ్, మహమ్మద్ రఫీ కన్నీటి పర్యంతమవుతూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. అన్ని వివరాలు, పత్రాలు చూసుకునే తాము ప్లాట్లు కొన్నామని తెలిపారు. కానీ.. తహశీల్దార్ రాధ తమ ప్లాట్లు సర్వే నెంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో ఉన్నాయని వేధిస్తుండడంతో హైకోర్టును ఆశ్రయించామన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని, అయినా ఆమె పట్టించుకోకుండా కొద్ది రోజుల క్రితం మొదటి అంతస్తు శ్లాబ్‌కు రంధ్రం చేయించడంతో మరోసారి హైకోర్టుకు వెళ్లామన్నారు. పలుమార్లు ఆమెపై కోర్టు ధిక్కార కేసులు వేయడంతో తమపై కక్ష కట్టి హైడ్రాకు తప్పుడు సమాచారం ఇచ్చి కష్టపడి కట్టుకున్న తమ భవనాలను కూల్చివేయించారని వారు ఆరోపించారు. తాము చేసిన తప్పు ఏమిటో అధికారులు చెప్పాలని, సామాన్యుడి ఇంటిని కూలగొట్టాలని ఏ చట్టం చెబుతోందని ప్రశ్నించారు. హైకోర్టులో తమకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందన్నారు.

జన్యుమార్పిడి పంటలతో ప్రమాదం: అన్వేశ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): జన్యు మార్పిడి పంటలతో ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ప్రమాదం కలుగుతుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేశ్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విత్తనాల వల్ల రైతులు విత్తన స్వాతంత్రం కోల్పోవడంతోపాటు విత్తన వ్యవస్థంతా కార్పొరేట్ రంగాల చేతుల్లోకి వెళ్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఆదివారం దక్షిణాది రాష్ట్రాల రైతు సంఘం నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్వేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతులు, వినియోగదారులను కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి జన్యుమార్పిడి పంటల ఆలోచన విధానానికి స్వస్తి పలికేలా చేయాలని పేర్కొన్నారు.

పేదలను నిలబెట్టడమే మా ఉద్దేశం

» మూసీ రివర్ బెడ్‌లో అక్రమ నిర్మాణాలనే తొలగిస్తున్నాం.. వారికి న్యాయం చేస్తాం

» 2013 భూసేకరణ చట్టప్రకారం పరిహారం

» భూ నిర్వాసితులపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు : మంత్రి దుద్దిళ్ల



హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదలను నిలబెట్టాలన్నదే తమ ప్రభుత్వం ఉద్దేశమని, పడగొట్టాలని కాదని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మూసీ రివర్‌బెడ్‌లోని అక్రమ నిర్మాణాలను మాత్రమే తొలగిస్తున్నామని.. నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యత తమదని, వారికి 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించనున్నామని ఆయన వెల్లడించారు. భూనిర్వాసితులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదన్నారు. మల్లన్నసాగర్ భూ నిర్వాసితులకు బీఆర్ఎస్ ప్రభుత్వం.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వకుండా కొత్త జీవోను తేవడంతో.. అప్పట్లో మల్లారెడ్డి అనే రైతు చితి పెట్టుకుని ఆహుతయ్యాడని గుర్తుచేశారు. సీఎల్పీ మీడియా హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతోనే చెరువుల్లో, మూసీ నదిలో ఉన్న ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. మూసీ నదిలో గోదావరి నీళ్లను ప్రవహింపజేసి నదికి ఇరువైపులా రోడ్లు వేస్తామన్నారు. మూసీపైన ఫ్లై ఓవర్లు, పీపీపీ పద్ధతిలో నిర్మాణాలూ ఉంటాయని చెప్పారు. 'వాక్ టు వర్క్' పద్ధతిలో ఉపాధినీ కల్పిస్తామన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయం చూపిస్తున్నామని, దీనికి సంబంధించి 12 ఎన్జీవోల ప్రతినిధులతో సంప్రదింపులూ చేస్తున్నామని చెప్పారు. సొంత ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నామన్నారు. అంగన్ వాడీ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తామని, వారి పిల్లలను ఆరేళ్ల పాటు చదివిస్తామని చెప్పారు. స్వయం సహాయక మహిళా గ్రూపుల ద్వారా వడ్డీ లేని రుణాలు ఇప్పిస్తామన్నారు. హైడ్రాతో పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూస్తామని.. బిల్డర్ల చేతిలో మోసపోయిన పేద, మధ్యతరగతి వారి నివాసాల విషయంలో ప్రభుత్వం తొందరపడబోదని, ఎవరూ ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు. మూసీ, హైడ్రాల విషయంలో అనుమానాల నివృత్తి కోసం అన్ని కలెక్టరేట్లలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. మూసీ, హైడ్రాపై చట్టబద్ధంగా, ప్రణాళికాయుతంగా ముందుకు వెళుతున్నామని, నిర్మాణాలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు ఉంటాయని చెప్పారు. అపార్ట్‌మెంట్ నిర్వాసితులకు ఎలా న్యాయం చేయాలనే అంశంపై సీఎం రేవంత్ ఆలోచిస్తున్నారని.. బిల్డర్ల చేతిలో మోసపోయిన వారి విషయంలో ప్రభుత్వం మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తుందని వెల్లడించారు.

బ్లూ ప్రింట్ సిద్ధం..

మూసీ ప్రాజెక్టుకు సంబంధించి బ్లూ ప్రింట్ తయారైందని, పనులు పారదర్శకంగా జరుగుతాయని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా చెప్పిందని, కానీ చేయలేదని గుర్తుచేశారు. ఇప్పుడు ఆ పని తమ ప్రభుత్వం చేస్తుంటే ఆ పార్టీ అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. హైదరాబాద్ వాసులు మురికి కంపులోనే ఉండాలా అంటూ బీఆర్ఎస్ పార్టీని నిలదీశారు. "బుల్డోజర్ పాలసీని అమలు చేసిందే బీఆర్ఎస్ ప్రభుత్వం. మా ప్రభుత్వంలో అక్రమ నిర్మాణాలపైకే బుల్డోజర్ పోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు, మల్లన్నసాగర్ నిర్వాసితులపైకి బుల్డోజర్లు పోయాయి. మేము ప్రజాస్వామ్యస్ఫూర్తితో వెళుతుంటే..బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు" అని ధ్వజమెత్తారు.

హైడ్రా.. ఆచితూచి!

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటైన హైడ్రా తొలి నుంచి దూకుడుగానే ఉంది. చెరువులు, పార్కుల్లోని నివాసేతర నిర్మాణాల కూల్చివేత చేపట్టగా మొదట్లో ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చింది. అయితే పేదలు నివాసం ఉంటున్న షెడ్లు, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసిన నిర్మాణ దశలో ఉన్న ఇళ్లను కూల్చివేయడం మొదలు కావటంతో ప్రతికూల వాతావరణం నెలకొంది. నిజాంపేటలోని మల్లంపేట కత్వ చెరువు, అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ స్థలంలో విల్లాల కూల్చివేతపై విమర్శలు వ్యక్తమయ్యాయి. కత్వ చెరువులో నిబంధనలకు విరుద్ధంగా స్థానిక సంస్థ అనుమతులివ్వగా.. కొన్ని విల్లాల విక్రయం అనంతరం పర్మిషన్లు రద్దు చేశారు. తెలిసీ తెలియక విల్లాలు కొన్న వారిలో ఎక్కువ మంది మధ్య తరగతి, ఎగువ మధ్య తరగతికి చెందిన వారే. అమీన్‌పూర్‌లోని ప్రభుత్వ స్థలంలో నిర్మించిన 25 విల్లాలను హైడ్రా నేలమట్టం చేసింది. ఇక్కడ కూడా సర్కారు భూమిలో మునిసిపాలిటీ అనుమతులు ఇవ్వగా.. రెవెన్యూ విభాగం సూచనతో అనంతరం రద్దు చేశారు. అందుకే నిర్మాణాలను కూల్చివేసినట్టు అధికారులు చెబుతున్నారు. అయితే, నిర్మాణాలు చేపట్టి విక్రయించిన వాళ్లు, అనుమతులు ఇచ్చిన అధికారులు ఆర్థిక ప్రయోజనం పొందగా.. కొనుగోలు చేసిన వారు బాధితులుగా మిగిలిపోయారు. సున్నం చెరువు వద్ద ఆక్రమణల తొలగింపు క్రమంలోనూ హైడ్రా తీరు చర్చనీయాంశంగా మారింది. మంచినీటి వ్యాపారం చేసే ఓ వ్యక్తి కూలీల కోసం నిర్మించిన షెడ్లు తొలగించామని హైడ్రా చెబుతున్నా.. కూల్చివేతల అనంతరం, పిల్లాపాపలున్న ఆ కుటుంబాలు ఎక్కడ తలదాచుకుంటాయన్న విషయాన్ని అధికారులు పట్టించుకోలేదు. కూకట్‌పల్లిలోని చెరువు వద్ద నిర్మించిన షెడ్లను వాటిలో ప్రింటింగ్, క్యాటరింగ్ యంత్రాలుండగానే కూల్చడంపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. బాధిత కుటుంబాలు రోదిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మరోవైపు, మూసీ తీర ప్రాంతంలో ఇళ్లకు మార్కింగ్ చేసిన రెవెన్యూ, ఇతర విభాగాల అధికారులు.. హైడ్రా కూల్చివేతలు చేపట్టనుందని, త్వరగా ఖాళీ చేయాలని ఇళ్లలో నివాసం ఉంటున్న వారికి సూచించారు. దీంతో, హైడ్రా బుల్డోజర్లు ఎప్పుడు వస్తాయో అన్న ఆందోళన బాధిత కుటుంబాల్లో కనిపిస్తోంది. కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నామని పలువురు వాపోతున్నారు.

ఉన్నత స్థాయి ఆదేశాల నేపథ్యంలో..

తాజా పరిణామాల నేపథ్యంలో స్పీడ్ తగ్గించాలని హైడ్రాకు ఉన్నతస్థాయి నుంచి ఆదేశాలు అందినట్టు తెలిసింది. ఫలితంగా.. రెండు, మూడు వారాలపాటు హైడ్రా కూల్చివేతలు ఉండకపోవచ్చని సమాచారం. ఆ తర్వాత కూడా నివాసేతర ఆక్రమణల తొలగింపునకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు భావిస్తున్నారు. వీలైనంత వరకూ నివాస భవనాల జోలికి వెళ్లకుండా ఉండాలనుకున్నట్టు తెలిసింది. తప్పదనుకుంటే న్యాయ సలహాలు తీసుకున్న తరువాతే ముందుకు సాగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం.



హైడ్రాపై తప్పుడు ప్రచారం చేస్తే చర్యలు : రంగనాథ్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): హైడ్రాపై సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేస్తూ అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సంస్థ కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సంబంధం లేని విషయాలను సంస్థకు ఆపాదిస్తూ కొంతమంది ఉద్దేశపూర్వకంగా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. సంగారెడ్డిలోని మల్కాపూర్ చెరువులో కూల్చివేతలు హైడ్రా చేపట్టలేదని స్పష్టం చేశారు. అక్కడ జరిగిన ప్రమాదంలో హోంగార్డుకు గాయమై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడని, దానికి హైడ్రా బలి తీసుకుందని ప్రచారం చేస్తుండడం దురదృష్టకరమన్నారు. కూకట్‌పల్లిలో ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని, బుచ్చమ్మ ఆత్మహత్యను హైడ్రాకు ముడిపెట్టవద్దన్నారు. రాష్ట్రంలో ఎక్కడ కూల్చివేతలు జరిగినా హైడ్రాకు ఆపాదిస్తున్నారని, ఆదిలాబాద్ జిల్లాలో కూల్చివేతలు చేసినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు వరకు మాత్రమే హైడ్రా పరిధిలోకి వస్తుందని గుర్తుచేశారు.

పేదల ఇళ్ల జోలికి వెళ్లడం తొందరపాటే

» హైడ్రాపై బీజేపీ, బీఆర్ఎస్‌ది దుష్ప్రచారం: దానం నాగేందర్

బంజారాహిల్స్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల జోలికి వెళ్లడం తొందరపాటు నిర్ణయమే అవుతుందని, బాధితుల్లో భరోసా కల్పించేందుకు నిజనిర్ధారణ కమిటీ వేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరనున్నట్టు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చెప్పారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చెరువులు, కుంటలను కాపాడేందుకు హైడ్రాను ఏర్పాటు చేశారని, కానీ అధికారులు పేదలను లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. జలవిహార్, పార్క్ హోటల్.. శిఖం భూమిలో ఉన్నాయని వాటిని ఎందుకు కూల్చరని ప్రశ్నించారు. వీటి పక్కనే బఫర్ జోన్‌లో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్ పది అంతస్తులు.. శోభా బిల్డర్స్‌కు 15 అంతస్తుల నిర్మాణాలు ఉన్నాయని.. అప్పట్లో కేటీఆర్ వీటికి ఎలా అనుమతులు ఇచారని నిలదీశారు. హైడ్రా పేరిట బీఆర్ఎస్, బీజేపీ ప్రజలను భయపెడుతున్నాయని, అందరి ఇళ్లు కూల్చేస్తారంటూ దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. గత సీఎం కేసీఆర్ కూడా భవిష్యత్తులో మూసీ నది పొంగితే తీవ్ర అనర్థం వాటిల్లే ప్రమాదం ఉందని ఓ సర్వే ద్వారా గుర్తించారని చెప్పారు. అప్పట్లో 12వేల మంది నిర్వాసితులను వేరే చోటుకు తరలించాలని భావించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. గతంలో బఫర్ జోన్‌లో అక్రమ కట్టడాలను కూల్చివేయాలని చెప్పిన హరీశ్ ఇప్పుడు మాట మార్చి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికే తమపై ఉన్న కేసును చూపించి బీఆర్ఎస్ అధిష్ఠానం వారిని ఆపుతోందని, ఆలస్యమైనా వారు కాంగ్రెస్‌లో చేరడం ఖాయమని చెప్పారు.

పేదోళ్లను అడ్డుపెట్టి బిల్డర్ల వ్యాపారం

నదీ గర్భంలోనూ ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారు

వీటిని ఆపకుంటే భవిష్యత్తు తరాలకు ప్రమాదం

తెలుగు రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టండి

అమెరికాలో తెలుగు కమ్యూనిటీ మీట్ అండ్ గ్రీట్‌లో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క




హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): "హైదరాబాద్‌లో చెరువులు, నదీ గర్భాల్లో కూడా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీటిని ఇప్పటికైనా ఆపకపోతే భవిష్యత్తు తరాలకు పెద్ద ప్రమాదం వాటిల్లుతుంది. ఇది హైదరాబాద్‌కు ప్రాణాంతకంగా మారుతుంది. పేదోళ్లను అడ్డం పెట్టి బిల్డర్లు వ్యాపారం చేస్తున్నారు" అని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. అమెరికా పర్యటనలో ఉన్న భట్టివిక్రమార్క.. సదరన్ కాలిఫోర్నియా తెలుగు కమ్యూనిటీ, స్థానిక కాన్సుల్ జనరల్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన మీట్ అండ్ గ్రిట్ కార్యక్రమంలో మాట్లాడారు. "హైదరాబాద్ అంటేనే గుట్టలు, చెరువులు, పార్కులు..! ఇళ్ల నిర్మాణం పేరిట గుట్టలు కనుమరుగైపోయాయి. చెరువులను కబ్జా చేసి ఇళ్లు కట్టారు. పార్కులనూ లేకుండా చేస్తున్నారు. చెరువులే లేకుంటే.. ఇటీవల వరదలకు విజయవాడ నగరం చిక్కుకుపోయిన పరిస్థితే హైదరాబాద్‌కూ ఏర్పడుతుంది" అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ధన, మాన, ప్రాణ, ఆస్తులను కాపాడడం ప్రభుత్వం బాధ్యతని, అందులో భాగంగానే చెరువులను రక్షించి భవిష్యత్తు తరాలకు అదించే కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని వెల్లడించారు. మూసీ నదిలో మంచి నీరు పారించడం, నగరంలో పార్కులు తయారు చేయడం వంటివి చేయాలన్నది తమ ఆలోచనన్నారు. మూసీ నది పునరుజ్జీవంలో భాగంగా నిర్వాసితులకు పూర్తి అవగాహన కల్పించి.. పునరావాస చర్యలు చేపడుతున్నామ న్నారు. నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, వారి పిల్లలు చదువుకునేందుకు అవకాశం కల్పించడం, వారి ఆరోగ్యానికి సంబంధించిన జాగ్రత్తలు చేపట్టడం.. వారంతా మంచి వాతావరణంలో బతికేలా చూడడమే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. కలుషితమైన మూసీ నది పక్కన జీవించడం ఎవరికి కూడా మంచిది కాదన్నారు. కాగా.. తెలంగాణలోని వనరులను గుర్తించి పద్ధతి ప్రకారం వినియోగిస్తామని, విద్య, వైద్యం, సేవా రంగాలను తీర్చిదిద్దుతామని, రాష్ట్ర సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. గతంలో ఫ్యూడల్ మనస్తత్వంతో బందీ చేయబడిన రాష్ట్రాన్ని పూర్తి స్వేచ్ఛాయుత రాష్ట్రంగా మార్చామని, భవిష్యత్తులో ఈ విధానం కొనసాగుతుందన్నారు. ఎవరు ఏ భావజాలాన్నయినా వ్యక్తపరిచే వాతావరణాన్ని ఏర్పరిచామని వివరించారు. అమెరికాలో స్థిరపడిన తెలుగు వారి మేధస్సు తెలుగు రాష్ట్రాల అభివృద్ధికి ఉపయోగపడాలని, పెట్టుబడులు పెట్టి అభివృద్ధిని పరుగులు పెట్టించాలని ప్రవాసీలను కోరారు.

మీకు అండగా మేముంటాం

» ఒక్క కాల్ చేయండి.. అరగంటలో వచ్చేస్తాం

» 'మూసీ' నిర్వాసితులకు మాజీ మంత్రి హరీశ్ భరోసా

» కొడంగల్‌లో రేవంత్ ఇల్లు రెడ్డికుంటలో ఉంది.. దాన్ని కూలుస్తారా? అని నిలదీత



బండ్లగూడ జాగీర్ వద్ద నిర్వాసితులతో మాట్లాడుతున్న హరీశ్

హైదరాబాద్/నార్సింగ్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ధైర్యంగా ఉండాలని, ఆత్మవిశ్వాసం కోల్పోవద్దని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్ తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటాయని, ప్రజలు ఎప్పుడైనా వచ్చి సమస్యలు చెప్పుకోవచ్చన్నారు. ఇకపై ప్రజల ఇళ్లను రేవంత్ సేన ముట్టుకోకుండా తాము అండగా ఉంటామని, ఫోన్ చేస్తే అరగంటలో వస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల ఇళ్లు కూలగొట్టాలంటే బుల్డోజర్లు ముందుగా తమను దాటి రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గండిపేట మండలంలోని హైదర్షాకోట్, లంగర్‌హౌజ్‌లోని హసీంనగర్, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని సన్‌సిటీలో ఆదివారం ఆయన పర్యటించారు. మూసీ సుందరీకరణ నేపథ్యంలో నిర్వాసితులవుతున్న వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రజల బాధలు చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ.. హస్తం గుర్తును తీసేసి.. బుల్డోజర్ గుర్తును పెట్టుకోవాలని సూచించారు. "కొండగల్‌లోని సర్వే నంబర్ 30లో ఉన్న రెడ్డికుంటలో నువ్వు ఇల్లు కట్టుకున్నవ్.. ముందుగా దాన్ని కూలగొట్టు. ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నీ తమ్ముడి ఇంటికి మాత్రం నోటీసులు ఇచ్చి వదిలేస్తావా? పేదల ఇళ్లు కూలగొడతావా? నీ తమ్ముడికో రూల్.. పేదలకో రూలా?" అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కూల్చడమే తప్ప.. ఏ ఒక్క భవనమూ కట్టింది లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మూసీ సుందరీకరణ మానుకోవాలని డిమాండ్ చేశారు.

మూసీకి నీళ్లెలా తెస్తారు?

కాళేశ్వరం కూలిపోయిందని విమర్శించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు అదే ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మూసీలోకి తెస్తామనడం వింతగా ఉందని హరీశ్ పేర్కొన్నారు. గోదావరి నీళ్లను మూసీలోకి తెస్తే.. కాళేశ్వరంపై సీఎం చేసిన వ్యాఖ్యలు అబద్ధమే కదా? అని అన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో ప్రజలను భయభ్రాంతులను చేయడం మానేసి, మూసీలోకి మురికి నీరు రాకుండా చెయ్యాలని సూచించారు. బీఆర్ఎస్ పాలనలో 32 ఎస్టీపీలు ఏర్పాటు చేశామని, మురుగు నీరు మూసీలోకి రాకుండా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. కానీ, సుందరీకరణ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని దుయ్యబట్టారు.

మూసీలో పరామర్శల వరద

పరివాహక ప్రాంతాల్లో పోటాపోటీగా నేతల పర్యటనలు.. బుల్డోజర్లు నన్ను దాటుకుని రావాలి: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

» సీఎంతో మాట్లాడతా.. ధైర్యంగా ఉండండి: మధు యాష్కీ

» బీజేపీ ఆధ్వర్యంలో వంటావార్పు



న్యూ మారుతినగర్‌లో నిర్వాసితులతో కలిసి రోడ్డుపై వంటవార్పు చేస్తున్న కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా, సామ రంగారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఏ క్షణం ఏం జరుగుతుందోనని మూసీ పరివాహకంలోని నిర్వాసితులు బిక్కుబిక్కుమంటుంటే.. ఇదే అవకాశంగా రాజకీయ పార్టీల నాయకులు పరామర్శలు చేస్తున్నారు. స్థానికులకు మద్దతుగా ఆయా ప్రాంతాల్లో పర్యటిస్తూ ఆకర్షించే ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే, సర్వే మార్కింగ్ పనులను నిలిపివేసినప్పటికీ ప్రజల్లో ఆందోళన తగ్గలేదు. ప్రక్రియ మొదలైనప్పుడు గోడు వినని నేతలు.. ఇప్పుడు అండగా ఉంటామంటూ రావడం విడ్డూరమని స్థానికులు నిట్టూరుస్తున్నారు. నదీ గర్భం(రివర్ బెడ్)లో ఉన్నాయంటూ న్యూ మారుతీనగర్ కాలనీలో మార్కింగ్ చేసిన నివాసాలకు చెందిన మహిళలు ఆదివారం ధర్నా చేపట్టారు. కూల్చివేతలు వద్దంటూ బ్యానర్‌లు ఏర్పాటు చేశారు. కాగా, కోర్టును ఆశ్రయించిన చైతన్యపురి డివిజన్ వెంకట సాయినగర్‌లోని నిర్వాసితులు.. 'హైకోర్టులో పిటిషన్ వేశాం. మా ఇల్లు కోర్టు రక్షణలో ఉందంటూ' ప్రహరీపై రాయడమే కాక ఫ్లెక్సీలు కూడా పెట్టారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిర్వాసితులతో కలిసి చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు ఆందోళనలు చేస్తున్నారు. ఆదివారం న్యూ మారుతీనగర్‌లో రోడ్డుపై వంటావార్పు నిర్వహించారు. నర్సింహగుప్తా, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి స్వయంగా వంట చేశారు. కాగా, శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్‌లు రోడ్డుపై బైఠాయించి మార్కింగ్‌ను అడ్డుకోవగడంతో అధికారులు వెనుదిగారు.

ఎన్ని మార్కింగ్‌లు వేసినా నష్టం జరగనివ్వం

ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చైతన్యపురి డివిజన్ ఫణిగిరి కాలనీ, వెంకట సాయినగర్ కాలనీల్లో పర్యటించారు. 'బుల్డోజర్లు మీ ఇళ్ల జోలికొచ్చే ముందు నన్ను దాటుకుని పోవాల్సి ఉంటుందంటూ' నిర్వాసితుల్లో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశారు. మార్కింగ్‌లు వేసినా నష్టం జరగనివ్వనన్నారు. ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని, అన్ని పార్టీలను కలుపుకొని ఆందోళన చేస్తామని తెలిపారు.

విదేశాల నుంచి యాష్కీ ఫోన్

కొన్ని రోజులుగా విదేశీ పర్యటనలో ఉన్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, ఎల్బీనగర్ నుంచి గత ఏడాది పోటీ చేసిన మధుయాష్కీ. గౌడ్ ఆదివారం చైతన్యపురి డివిజన్ నిర్వాసిత మహిళలతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మహిళలు దిగులు చెందుతున్నారంటూ సీనియర్ నాయకుడు కె.శశిధర్‌రెడ్డి ప్రస్తావించగా.. అన్యాయంగా ఏ ఒక్క ఇంటినీ కూల్చడం జరగదని, ప్రభుత్వం ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తుందని మధుయాష్కీ భరోసా ఇచ్చారు.

స్పోర్ట్స్

నేనింకా యువకుడినే!


రోహిత్ శర్మ

న్యూఢిల్లీ: క్రికెట్ మైండ్‌సెట్ పరంగా తాను ఇంకా యువకుడినేనని రోహిత్ శర్మ అన్నాడు. టీ20 వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత 37 ఏళ్ల రోహిత్ పొట్టిఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే, వయసు మీరిన కారణంగానే టీ20లకు వీడ్కోలు పలికినట్టు అభిమానులు భావిస్తున్నారంటూ ఓ ఇంటర్వ్యూలో శర్మను యాంకర్ ప్రశ్నించాడు. కానీ, కెరీర్‌లో ఉచ్ఛదశలో అదీ వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన సమయంలో రిటైర్మెంట్ ప్రకటించడం తగిన సమయమని తాను భావించినట్టు హిట్‌మ్యాన్ చెప్పాడు. '17 ఏళ్ల పాటు పొట్టి ఫార్మాట్‌ను ఆస్వాదించా. ఇక చాలనిపించింది. వరల్డ్‌కప్ గెలిచిన తర్వాత వీడ్కోలు నిర్ణయం ప్రకటించడానికి అంతకంటే గొప్ప సమయం దొరకదని భావించా. ఆటలో ఎదురయ్యే సవాళ్లను డీల్ చేయడంలో నేనింకా యువకుడినని చెప్పాడు.

ఐపీఎల్ పాలకమండలిలో మరోసారి చాముండి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఐపీఎల్ పాలకమండలి సభ్యుడిగా వి.చాముండేశ్వర్‌నాథ్ రెండోసారి నియమితులయ్యాడు. ఆదివారం బెంగళూరులో జరిగిన బీసీసీఐ ఏజీఎంలో వచ్చే ఏడాదికి కొత్త ఐపీఎల్ పాలకమండలిని ఏర్పాటు చేశారు. ఇందులో చాముండేశ్వర్‌నాథ్‌తో పాటు అరుణ్ సింగ్ ధూమల్, అభిషేక్ దాల్మియాకు చోటు లభించింది. అరుణ్, అవిషేక్ బీసీసీఐ నుంచి ఎంపికవగా, చాముండేశ్వర్‌నాథ్‌కు ఇండియన్ క్రికెటర్స్ అసోసియేషన్ నుంచి స్థానం దక్కింది.

వర్షం లేకపోయినా

మూడో రోజూ రద్దు

చిత్తడిగా మైదానం | భారత్-బంగ్లాదేశ్ రెండో టెస్టు



కాన్పూర్: భారత్-బంగ్లాదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రెండో టెస్టులో వరుసగా రెండో రోజు కూడా ఒక్క బంతీ పడలేదు. శుక్రవారం ఆరంభమైన ఈ మ్యాచ్‌లో ఇప్పటి వరకు కేవలం 35 ఓవర్ల ఆట మాత్రమే సాధ్యం కావడం గమనార్హం. శనివారం వర్షం కారణంగా ఆట వీలుపడకపోగా.. ఆదివారం మాత్రం వరుణుడి నుంచి ఎలాంటి ఇబ్బందీ ఎదురుకాలేదు. అయినా అంపైర్లు ఆట ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. దీనికి కారణం.. శనివారం రాత్రి కురిసిన వర్షానికి గ్రీన్ పార్క్ మైదానం పూర్తి చిత్తడిగా మారడమే. వాస్తవానికి ఆదివారం ఉదయం నుంచీ వర్షం లేకపోవడంతో కాస్త ఆలస్యంగానైనా ఆట ప్రారంభమవుతుందని అభిమానులు ఆశించారు. కానీ అవుట్ ఫీల్డ్ అంతా నీటితో బురదమయంగా మారింది. ఉదయం 10, 12తో పాటు మధ్యాహ్నం 2 గంటలకు కూడా అంపైర్లు మైదానాన్ని పరిశీలించారు. అప్పటికి కవర్లు కూడా తీసేశారు. చివర్లో కాస్త ఎండ కూడా వచ్చింది. అయినా ఆట కొనసాగితే ఆటగాళ్లు జారిపడే అవకాశం ఉందని అంపైర్లు భావించారు. పెవిలియన్ దగ్గర ప్యాచ్‌లు ఉండడంతో మ్యాచ్ రెఫరీ జెఫ్ క్రో అసంతృప్తి వ్యక్తం చేశాడు. దీంతో 2 గంటలకు ఆటను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. శుక్రవారం తొలి రోజు మ్యాచ్ కూడా ఆలస్యంగా ఆరంభమై రెండో సెషన్ ప్రారంభంలోనే ముగిసింది. అప్పటికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 35 ఓవర్లలో 3 వికెట్లకు 107 పరుగులు చేసింది. మరోవైపు మ్యాచ్ చివరి రెండు రోజులు వాతావరణం అనుకూలించే అవకాశం కనిపిస్తోంది.

బీసీసీఐపై అభిమానుల అసంతృప్తి

దాదాపు ఎనిమిది సెషన్ల ఆట తుడిచిపెట్టుకుపోయిన ఈ రెండో టెస్టు డ్రా కావడం తథ్యమే. అయితే గ్రీన్‌పార్క్ మైదానం నిర్వహణ తీరుపై సోషల్ మీడియాలో అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై బీసీసీఐని నిలదీశారు. వర్షం లేకపోయినా ఆట రద్దు కావడం దారుణమని, స్టేడియంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదంటూ.. ప్రపంచంలోనే సంపన్న క్రికెట్ బోర్డు డబ్బంతా ఏమైపోతున్నదని ప్రశ్నించారు. ఈ మ్యాచ్ తీరు బోర్డుకు గుణపాఠం లాంటిదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే అంపైర్లు మూడుసార్లు పిచ్‌ను పరిశీలించినా.. ఎక్కడ సమస్య ఉందో తమతో చర్చించలేదని క్యూరేటర్ శివ్ కుమార్ తెలిపాడు.

ముఖేష్ త్రయానికి స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన షూటర్ నేలవల్లి ముఖేష్ త్రయం స్వర్ణం సొంతం చేసుకుంది. పెరూలోని లిమాలో జరుగుతున్న ఈ పోటీల్లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో ముఖేష్, ప్రమోద్, ఉమేష్‌తో కూడిన భారత బృందం అగ్రస్థానంలో నిలిచి, పసిడి పతకం సాధించింది. వచ్చే నెల 5వ తేదీ వరకు జరగనున్న ఈ పోటీల్లో ముఖేష్ ఇంకా ఐదు విభాగాల్లో తలపడనున్నాడు. కాగా 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఫైనల్స్ రేంజ్‌కు షూటర్ ఉమేష్ చౌధురి ఆలస్యంగా వెళ్లడంతో అతడి స్కోరులో రెండు పాయింట్లను పెనాల్టీ కింద తగ్గించారు. దీంతో అతడికి స్వర్ణం దక్కే అవకాశాలు దెబ్బతిని ఆరో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

15 ఏళ్ల తర్వాత..

కివీస్‌పై శ్రీలంక సిరీస్ విజయం


నిషాన్ పెరీస్ (6/170)

గాలె: పదిహేనేళ్ల తర్వాత న్యూజిలాండ్‌పై శ్రీలంక టెస్టు సిరీస్ విజయం రుచి చూసింది. ఆదివారం ముగిసిన రెండో టెస్ట్‌లో ఇన్నింగ్స్ 154 పరుగుల తేడాతో పర్యాటక జట్టును చిత్తు చేసింది. ఓవర్‌నైట్ 199/5 స్కోరుతో, ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్ 360 పరుగులకు ఆలౌటైంది. కిందటి రోజు బ్యాటర్లు గ్లెన్ ఫిలిప్స్ (78), టామ్ బ్లండెల్ (60)తోపాటు శాంట్నర్ (67) అర్థ శతకాలతో రాణించారు. అరంగేట్ర స్పిన్నర్ నిషాన్ పెరీస్ (6/170) ఆరు వికెట్లతో తిప్పేయగా, మరో స్పిన్నర్ ప్రభాత జయసూర్య (3/139) మూడు వికెట్లు సాధించాడు. శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌ను 602/5 స్కోరుతో డిక్లేర్ చేయగా, న్యూజిలాండ్ 88 పరుగులకే కుప్పకూలింది. మొదటి టెస్ట్‌లో శ్రీలంక 63 పరుగులతో నెగ్గిన సంగతి తెలిసిందే. రెండు టెస్టుల్లో కలిపి 18 వికెట్లు సాధించిన ప్రభాత్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. ఇక..వరుసగా మూడో టెస్ట్‌లోనూ గెలుపొందిన లంకేయులు..ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ రేసుకు అవకాశాలను మెరుగుపరుచుకున్నారు.

'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'

బెంగళూరులో ప్రారంభించిన బీసీసీఐ



బెంగళూరు: కొత్త జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)ని బీసీసీఐ ఆదివారం ఇక్కడ ప్రారంభించింది. ఈ అకాడమీకి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'గా పేరు పెట్టింది. 2000 సంవత్సరంలో ఏర్పాటైన జాతీయ క్రికెట్ అకాడమీ ఇప్పటి వరకు బెంగళూరు నగరంలోని చిన్నస్వామి స్టేడియంలో కొనసాగింది. ఈ అకాడమీ చీఫ్‌గా వీవీఎస్ లక్ష్మణ్ వ్యవహరిస్తున్నాడు. కొత్త అకాడమీని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో మొత్తం 40 ఎకరాలలో అత్యంత అధునాతనంగా నిర్మించారు. దీనిలో మూడు ప్రపంచ స్థాయి మైదానాల్ని నిర్మించి, వీటికి పచ్చిక బయళ్లలో సీటింగ్ ఏర్పాటు చేశారు. రెండు అంతస్థులతో కూడిన సౌత్ పెవిలియన్‌లో మూడు వేల చదరపు అడుగులతో భారీ డ్రెస్సింగ్ రూమ్, 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో జిమ్, స్పోర్ట్స్‌సైన్స్ మెడిసిన్ సెంటర్, అలాగే 86 ఇండోర్, అవుట్ డోర్ పిచ్‌లు ఇక్కడ ఉన్నాయి.

హైదరాబాద్‌లో ఆసియా పికిల్‌బాల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఆసియా పికిల్‌బాల్ చాంపియన్‌షిప్ హైదరాబాద్‌లో జరుగనుంది. వచ్చే జనవరిలో జరిగే ఈ పోటీల్లో సుమారు 600 మంది క్రీడాకారులు పాల్గొంటారని ఆ సంఘం జాతీయ సీనియర్ ఉపాధ్యక్షుడు రావుల శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

ఆస్ట్రేలియాదే వన్డే సిరీస్

బ్రిస్టల్ : ఇంగ్లండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా 3-2తో సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 49 పరుగులతో (డ/లూ) గెలుపొందింది. తొలుత ఇంగ్లండ్ 49.2 ఓవర్లలో 309 పరుగులకు ఆలౌటైంది. డకెట్ (107) శతకం బాదాడు. ఛేదనలో ఆసీస్ 20.4 ఓవర్లలో 165/2 స్కోరుతో ఉన్న దశలో భారీ వర్షం కురిసింది. దాంతో డ/లూ నిబంధన ప్రకారం ఆస్ట్రేలియాను విజేతగా ప్రకటించారు. ఆసీస్ జట్టులో షార్ట్ (58) రాణించాడు.

ఎవరెవరిని అట్టిపెట్టుకోవచ్చంటే?



న్యూఢిల్లీ: ఐపీఎల్ వేలానికి ముందు రిటెన్షన్ పాలసీని బీసీసీఐ ప్రకటించడంతో.. ఎవరిని అట్టిపెట్టుకోవాలి? ఎవరిని వదిలించుకోవాలన్న దానిపై ఫ్రాంచైజీలు కసరత్తులు ఆరంభించాయి. అన్ని జట్లూ అక్టోబర్ 31లోగా తమ జాబితాలను విడుదల చేయాల్సివుంది. బోర్డు నిబంధనల ప్రకారం నేరుగా ఐదుగురిని, రైట్ టు మ్యాచ్ కార్డ్ ద్వారా మరొకరిని.. ఇలా మొత్తం ఆరుగురిని రిటైన్ చేసుకోవచ్చు. జట్టులో సమతుల్యత నెలకొనేలా ఆరుగురిని అట్టిపెట్టుకోవడం పది ఫ్రాంచైజీలకు పెద్ద సవాల్‌గానే చెప్పుకోవాలి. ఈ క్రమంలో **ఏ జట్టు ఎవరిని రిటైన్ చేసుకునే అవకాశం ఉందంటే..**



చెన్నై సూపర్ కింగ్స్: రుతురాజ్ గైక్వాడ్, రచిన్ రవీంద్ర, శివమ్ దూబే, రవీంద్ర జడేజా, పతిరన, ధోనీ.



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: కోహ్లీ, సిరాజ్, విల్ జాక్స్, మ్యాక్స్‌వెల్, కామెరూన్ గ్రీన్, యశ్ దయాళ్.

ముంబై ఇండియన్స్: హార్దిక్ పాండ్యా, రోహిత్ శర్మ, బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్, అన్షుల్ కాంబోజ్.





రాజస్థాన్ రాయల్స్: సంజూ శాంసన్, జోష్ బట్లర్, యశస్వీ జైస్వాల్, ట్రెంట్ బౌల్ట్, యజ్వేంద్ర చాహల్, సందీప్ శర్మ.

సన్‌రైజర్స్ హైదరాబాద్: ప్యాట్ కమిన్స్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, క్లాసెన్, నటరాజన్, నితీష్ కుమార్ రెడ్డి.

కోల్‌కతా నైట్‌రైడర్స్: శ్రేయాస్ అయ్యర్, రింకూ సింగ్, ఫిల్ సాల్ట్, సునీల్ నరైన్, స్టార్క్, హర్షిత్ రాణా.



గుజరాత్ టైటాన్స్: శుభ్‌మన్ గిల్, రషీద్ ఖాన్, డేవిడ్ మిల్లర్, సాయి సుదర్శన్, షమి, రాహుల్ తెవాటియా.

లఖ్‌నవూ సూపర్ జెయింట్స్: కేఎల్ రాహుల్, క్వింటన్ డికాక్, నికోలస్ పూరన్, రవి బిష్ణోయ్, స్టొయినిస్, మయాంక్ యాదవ్.



పంజాబ్ కింగ్స్: షార్ట్, సామ్ కర్రాన్, అర్ష్‌దీప్ సింగ్, రబాడ, లివింగ్‌స్టోన్, అశుతోష్ శర్మ.

ఢిల్లీ క్యాపిటల్స్: రిషభ్ పంత్, మిచెల్ మార్ష్, బ్రూక్, జాక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, అక్షర్ పటేల్, అభిషేక్ పోరెల్.

బిజినెస్

ఎఫ్‌పీఐ పెట్టుబడులు 9 నెలల గరిష్ఠం

న్యూఢిల్లీ: విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) సెప్టెంబరు నెలలో మొత్తం రూ.57,359 కోట్లు దేశీయ ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేశారు. ఇది 9 నెలల గరిష్ఠ స్థాయి. 2023 డిసెంబరు (రూ.66,135 కోట్లు) తర్వాత ఎఫ్‌పీఐ పెట్టుబడుల గరిష్ఠం ఇదే. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించడంతో ఎఫ్‌పీఐలు భారత మార్కెట్ వైపు ఆకర్షితులయ్యారు. ఎఫ్‌పీఐల తాజా నిధులతో ఈ ఏడాది ఇప్పటి వరకు వారి ఈక్విటీ పెట్టుబడులు రూ.లక్ష కోట్లు దాటాయి. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించే ఆస్కారం ఉండడంతో రాబోయే కాలంలో కూడా ఎఫ్‌పీఐలు అధిక మొత్తంలోనే దేశీయ మార్కెట్లో పెట్టుబడులు పెట్టే వీలుందని విశ్లేషకులంటున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



30వ తేదీ			
హైదరాబాద్	510	విజయవాడ	535
వరంగల్	512	గోదావరి	535
చిత్తూరు	523	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	116
వరంగల్	115	గుంటూరు	121
కరీంనగర్	115	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	126
కర్నూలు	115	నెల్లూరు	126
విశాఖపట్నం	102	అనంతపురం	126
గోదావరి	116		

'ఎఫ్ అండ్ ఓ' ట్రేడింగ్ నష్టాల్లో

తెలుగు రాష్ట్రాలే టాప్

తెలంగాణ ఇన్వెస్టర్ సగటు నష్టం రూ.1.97 లక్షలు

ఏపీ మదుపరి నష్టం రూ.1.45 లక్షలు

సెబీ నివేదిక వెల్లడి



న్యూఢిల్లీ: అసలే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ) ట్రేడింగ్‌లో లాభాలు తక్కువ. నష్టాలు ఎక్కువ. గత మూడేళ్ల ఈక్విటీ ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ సరళిని చూసినా అర్థమయ్యేది ఇదే. ఈ ట్రేడింగ్ చేసే వ్యక్తిగత ట్రేడర్లలో నూటికి 93 శాతం మందికి నష్టాలే. కేంద్ర ఆర్థిక మంత్రి, సెబీ చీఫ్ ఇలా ఎంత మంది హెచ్చరించినా.. వ్యక్తిగత ట్రేడర్లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పోతే పోతాయి. కాలం కలిసొస్తే కుబేరులమైపోవచ్చనే అత్యాశతో ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లోకి దిగి చేతులు కాల్చుకుంటున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ జూదం దేశంలో మరెక్కడా లేనంత భారీగా పెరిగిపోయిందని సెబీ తెలిపింది.

ఇంత నష్టం ఏ ట్రేడర్‌కు లేదు..

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని వ్యక్తిగత ట్రేడర్లు ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో భారీగా నష్టపోతున్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) తెలంగాణాలో ఒక్కో వ్యక్తిగత ట్రేడర్ ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో సగటున రూ.1.97 లక్షలు నష్టపోతే, ఆంధ్రప్రదేశ్ ట్రేడర్లు సగటున రూ.1.45 లక్షల చొప్పున నష్టపోయారు. దేశంలో మరే రాష్ట్రాల ట్రేడర్లు ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌లో ఇంత భారీ స్థాయిలో నష్టపోలేదని సెబీ తెలిపింది. కాగా దక్షిణాదిలో మిగతా రాష్ట్రాలైన తమిళనాడు (రూ.1.37 లక్షలు), కర్ణాటక (రూ.1.35 లక్షలు) తెలంగాణ, ఏపీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

మరోవైపు తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో మొత్తం 2.1 లక్షల మంది ట్రేడర్లు ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌ను నిర్వహిస్తున్నారు. ఎఫ్ అండ్ ఓ ట్రేడర్లపరంగా చూస్తే తెలుగు రాష్ట్రాలు 12,13వ స్థానాల్లో ఉన్నాయి.

నష్టాలకు ప్రధాన కారణాలు

- మార్కెట్ కంటే తాము తెలివైన వాళ్లమనే అతి విశ్వాసం
- కొవిడ్ తర్వాత మార్కెట్‌పై పెద్దగా అవగాహన లేకుండానే పెద్దఎత్తున ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌కు దిగడం
- ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌పై ఉత్తర, పశ్చిమ భారత ట్రేడర్లకు ఉన్నంత అనుభవం, జాగ్రత్త లేకపోవడం
- ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ నష్ట భయాలు తగ్గించుకునే హెడ్జింగ్ సాధనమే తప్ప.. పెట్టుబడి సాధనం కాదనే విషయం అర్థం చేసుకోకపోవడం
- నష్ట భయాల్ని, మార్కెట్ ఆటుపోట్లను ఎదుర్కొనే సమతౌల్యం లోపించడం
- వేలం వెర్రిగా పుట్టుకొచ్చిన డిస్కౌంట్ బ్రోకరేజీ సంస్థలు

డిపాజిట్ల కోసం సరికొత్త పథకాలు

ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి

న్యూఢిల్లీ: డిపాజిట్ల సేకరణ కోసం భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) కూడా నానా తంటాలు పడుతోంది. ఈ సమస్యను అధిగమించేందుకు త్వరలో వినూత్న పథకాలు ప్రారంభిస్తామని బ్యాంక్ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. త్వరలో ఫిక్స్‌డ్/రికరింగ్ డిపాజిట్, సిప్ కాంబినేషన్‌తో కూడిన ప్రత్యేక డిపాజిట్ పథకం తీసుకురానున్నట్టు వెల్లడించారు. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా మారకపోతే పోటీలో వెనకబడిపోతామని శెట్టి చెప్పారు. పరపతి డిమాండ్‌కు అనుగుణంగా ఇటీవల బ్యాంకుల డిపాజిట్లు పెరగడం లేదు. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ చీఫ్ ఈ విషయం చెప్పడం విశేషం. అక్టోబరు నుంచి పరపతి డిమాండ్ మరింత పెరుగుతుందని ఆయన చెప్పారు.

త్వరలో పీఎల్ఐ పెట్టుబడులు

రూ.2 లక్షల కోట్లకు..

- కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్

న్యూఢిల్లీ: దేశంలోని 14 రంగాలకు మద్దతుగా ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల పథకం (పీఎల్ఐ) కింద ఆగస్టు వరకు మొత్తం రూ.1.46 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రూ.11 లక్షల కోట్ల విలువ గల అదనపు ఉత్పత్తి అందుబాటులోకి వస్తుందని అంచనా. పీఎల్ఐ పథకం ద్వారా లబ్ధి పొందిన పారిశ్రామిక సంస్థల అభిప్రాయాలు తెలుసుకునేందుకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయెల్ ఆదివారం 140 కంపెనీల ప్రతినిధులతో చర్చించిన అనంతరం సమావేశం వివరాలు ప్రకటిస్తూ త్వరలోనే ఈ పథకం కింద పెట్టుబడులు రూ.2 లక్షల కోట్లు దాటనున్నాయన్నారు. పీఎల్ఐ పథకం కింద ఉత్పత్తి, విక్రయాలు రూ.12.50 లక్షల కోట్లు దాటాయని, 9.5 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభించిందని చెప్పారు. త్వరలో ఈ సంఖ్య 12 లక్షలు దాటనుందని గోయెల్ తెలిపారు.

హైదరాబాద్‌లో ఇళ్లు చాలా కాస్ట్‌లీ

అమ్మకాలు తగ్గినా 32 శాతం అప్ : అనరాక్

న్యూఢిల్లీ: అమ్మకాలు తగ్గినా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు ఏమాత్రం తగ్గడం లేదు. గత ఏడాది సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఈ ఏడాది ఇదే త్రైమాసికంలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు 2 నుంచి 25 శాతం పడిపోయినట్టు రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ ఒక నివేదికలో తెలిపింది. ఇదే సమయంలో ఈ నగరాల్లో ఇళ్ల కనీస ధరలు సగటున 23 శాతం చొప్పున పెరిగాయి. ఈ ఏడాది సెప్టెంబరు త్రైమాసికంలో హైదరాబాద్‌లో 12,735 యూనిట్ల నివాస గృహాలు అమ్ముడుపోయాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 22 శాతం తక్కువ.

ఇదే సమయంలో అమ్మకాలు తగ్గినా, భాగ్యనగరంలో ఇళ్ల ధరలు ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో నివాస గృహాల్లో ఎస్ఎఫ్‌టీ సగటున రూ.7,150 పలుకుతోంది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 32 శాతం ఎక్కువని అనరాక్ తెలిపింది.

అంతర్జాతీయ పరిణామాలే కీలకం!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలున్నాయి. సూచీలు ఇప్పటికే గరిష్ఠాలకు చేరటంతో లాభాల స్వీకరణకు ఆస్కారం కనిపిస్తోంది. చైనా ఉద్దీపన పథకం, అమెరికా, యూరప్, జపాన్ ఎకానమీ డేటా సూచీలకు దిశా నిర్దేశం చేసే వీలుంది. బెంచ్ మార్క్ సూచీలు పెరుగుతున్నా మిడ్,స్మాల్ క్యాప్ షేర్లలో దిద్దుబాటు కనిపిస్తోంది. బలమైన ఫండమెంటల్స్ ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తే కొనుగోలు చేయటం మంచిది. గత వారం మెటల్, ఆటో, పీఎస్ఈ, ఆయిల్ అండ్ గ్యాస్, కమోడిటీ, ఎనర్జీ రంగాల షేర్లు మంచి పనితీరును కనబరిచాయి.

స్టాక్ రికమండేషన్స్

టాటా మోటార్స్: ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు ఒక్కసారిగా పతనబాట పట్టింది. లాభాల స్వీకరణ, నెగటివ్ వార్తలు రావటమే ఇందుకు కారణాలు. ప్రస్తుతం ఈ షేరుకు రూ.935 వద్ద కీలకమైన మద్దతు దొరికింది. గత శుక్రవారం రూ.993 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.990/970 వద్ద పొజిషన్ తీసుకుని రూ.1,150/1,200 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.950 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టాటా స్టీల్: జీవితకాల గరిష్ఠాన్ని చేరుకున్న తర్వాత ఈ షేరు దిద్దుబాటు జరిగింది. షేరు దాదాపు 22 శాతం మేర పతనమైంది. రూ.150 స్థాయిలో మంచి కన్సాలిడేషన్ కనిపించింది. మెరుగైన ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్‌తో షేరు పుంజుకుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.166 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.165/160 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.195/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.155 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎన్ఎండీసీ: ఈ షేరుకు రూ.286 వద్ద నిరోధం ఎదురైన తర్వాత దాదాపు 30 శాతం మేర పతనమైంది. సెప్టెంబరు రెండో వారం నుంచి టర్న్ అరౌండ్ కనిపిస్తోంది. క్రమంగా వాల్యూమ్, స్ట్రెంత్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.235 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.230 వద్ద పొజిషన్ తీసుకుని రూ.255/280 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.225 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాసిమ్ ఇండస్ట్రీస్: ఈ కౌంటర్ మంచి ఆకర్షణీయంగా కనిపిస్తోంది. జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని చేరిన తర్వాత 13 శాతం మేర దిద్దుబాటు కనిపించింది. అయితే మంచి స్ట్రెంత్‌తో కన్సాలిడేషన్ జరుగుతోంది. చివరి మూడు సెషన్లలో 8 శాతం మేర పెరిగింది. గత శుక్రవారం రూ.2,783 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.2,750 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,850/2,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,720 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్: దాదాపు రెండున్నరేళ్ల తర్వాత ఈ షేరు జీవితకాల గరిష్ఠాల్లో కదలాడుతోంది. కీలక మద్దతు స్థాయిల వద్ద నిలదొక్కుకుంటూ పైకి వెళుతోంది. ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల నుంచి ఏ మాత్రం మద్దతు లభించినా రికార్డు స్థాయికి చేరుకోవటం ఖాయంగా కనిపిస్తోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.730 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.730/720 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.775/825 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.700 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

26,000 స్థాయి కీలకం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం మరింత ర్యాలీలో పురోగమిస్తూ 26,250 వరకు వెళ్లింది. శుక్రవారంనాడు మైనర్ కరెక్షన్ సాధించినా చివరికి ముందు వారంతో పోల్చితే 390 పాయింట్ల లాభంతో 26,180 వద్ద ముగిసింది. మొత్తం మీద గత మూడు వారాల్లో నిఫ్టీ ఎలాంటి కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ లేకుండానే 1,500 పాయింట్ల మేరకు లాభపడింది. గత నాలుగు నెలలుగా మార్కెట్లో ఏర్పడిన రికార్డు ర్యాలీలో నిఫ్టీ 4,900 పాయింట్లు లాభపడింది. అమెరికన్ మార్కెట్లో గత వారం రికార్డు గరిష్ఠ స్థాయిల్లో రియాక్షన్ ఏర్పడిన కారణంగా నిఫ్టీ ఈ వారంలో అప్రమత్త ట్రెండ్‌లో ట్రేడ్ కావచ్చు. అలాగే ప్రధాన మానసిక అవధి 26,000 స్థాయిని బ్రేక్ చేసినందు వల్ల టెక్నికల్ పుల్‌బ్యాక్ అవకాశాలు కూడా ఉన్నాయి. ఇప్పుడు ఈ 26,000 కీలకంగా మారింది.

మిడ్‌క్యాప్-100 ఇండెక్స్ చివరి మూడు సెషన్లలో కరెక్షన్‌లో పడి 170 పాయింట్ల స్వల్ప లాభానికే సరిపెట్టుకుంది. అయితే స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ మాత్రం 90 పాయింట్ల స్వల్ప నష్టంతో ముగిసింది. గత ఐదు వారాలుగా స్మాల్‌క్యాప్ ఇండెక్స్ కన్సాలిడేషన్ ధోరణిలో కదలాడుతోంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే ఎగువన నిరోధ స్థాయి 26,300. ఇది గత శుక్రవారం ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయి. ఆ పైన నిలదొక్కుకుంటే సరికొత్త గరిష్ఠ స్థాయిల దిశగా పురోగమిస్తుంది. ప్రధాన నిరోధ స్థాయిలు 26,600, 27,000.

బేరిష్ స్థాయిలు: మానసిక అవధి 26,000ని మార్కెట్ బ్రేక్ చేసినందు వల్ల అది మద్దతు స్థాయిగా మారింది. భద్రత కోసం నిఫ్టీ ఇక్కడ నిలదొక్కుకుని, కన్సాలిడేట్ కావాలి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ముప్పు ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం 40 పాయింట్ల నామమాత్రపు లాభంతో 53,830 వద్ద ముగిసింది. గత వారంలో 54,500 వరకు వెళ్లినా రియాక్షన్‌లో పడి 550 పాయింట్ల మేరకు నష్టపోవడం ఇందుకు కారణం. మరింత సానుకూలత కోసం మైనర్ నిరోధ స్థాయి 54,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనపడితే 53,500 వద్ద పరీక్ష ఎదుర్కొంటుంది. ఇక్కడ విఫలమైతే మైనర్ బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 53,000.

పాటర్న్: గతంలో ఏర్పడిన బాటమ్ 26,000 వద్ద బ్రేక్‌డౌన్ సాధిస్తే మరింత దిగజారవచ్చు. ఆర్ఎస్ఐ సూచీల ప్రకారం మార్కెట్ ఇప్పటికీ ఓవర్‌బాట్ స్థితిలో ఉంది. గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ తప్పనిసరి. ప్రస్తుతానికి మార్కెట్ స్వల్పకాలిక సూచీల కన్నా చాలా పైనే ఉంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	26,200, 26,270
మద్దతు	26,060, 26,000

అంతర్జాతీయ ప్రమాణాలతో గోల్కొండ గోల్ఫ్ కోర్సు

- హైదరాబాద్‌లో వచ్చే ఏడాది ఇంటర్నేషనల్ గోల్ఫ్ టోర్నమెంట్
- మంత్రి జూపల్లి కృష్ణారావు



హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గోల్కొండలోని గోల్ఫ్ కోర్సును అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో అంతర్జాతీయ గోల్ఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. ఆదివారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో జరిగిన 'తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్‌షిప్' ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి జూపల్లి.. విజేతగా నిలిచిన శంకర్ దాస్‌కు ట్రోఫీ, రూ.లక్ష నగదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ గోల్కొండ మాస్టర్స్ గోల్ఫ్ చాంపియన్ షిప్‌ను ఇంటర్నేషనల్ ప్రొఫెషనల్ టోర్నమెంట్‌గా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను ఆసియా ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ సర్క్యూట్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతి గోల్ఫ్ సీఈవో మనవి జైనీ, హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ అధ్యక్షుడు బీవీకే రాజు, డీఎస్ఆర్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ చైర్మన్ అజయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు హామీల సాధన దీక్ష: ఈటల

హైదరాబాద్, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): రైతులందరికీ సమగ్రంగా రుణమాఫీ అమలు చేయాలన్న డిమాండ్‌తో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో దీక్ష చేపడుతున్నామని ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. ఇందిరా పార్కు సమీపంలోని ధర్నాచౌక్‌లో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మంగళవారం ఉదయం 11 గంటల వరకు రైతు హామీల సాధన దీక్ష ఉంటుందని చెప్పారు. రైతులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని వివరించారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈటల మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే ప్రభుత్వం రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసే అవకాశం లేదన్నారు. రుణమాఫీ, రైతుబంధు, రైతు బీమా, సన్న వడ్లకు రూ.500 బోనస్, కౌలు రైతులకు రైతుబంధు, రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు.. ఏ ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అరాచక పాలన చేస్తోందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. లక్షలాది మంది రైతులను ప్రభుత్వం మోసం చేసిందని.. దానికి నిరసనగా దీక్ష చేపడుతున్నామని తెలిపారు. రైతులందరికీ రుణమాఫీ సమగ్రంగా అమలు చేసేవరకూ పోరాటం చేస్తామని ప్రకటించారు.

విద్యుత్ స్తంభాలు మీద పడి ఇద్దరి దుర్మరణం

- విద్యుదాఘాతంతో మరో ఇద్దరు రైతుల మృతి

జడ్చర్ల, ఎడపల్లి, మాడ్గులపల్లి, సెప్టెంబరు 29 : ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడి ఇద్దరు రైతులు, విద్యుదాఘాతంతో మరో ఇద్దరు రైతులు మృతి చెందిన ఘటనలు మహబూబ్‌నగర్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఆదివారం చోటు చేసుకున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల మండలం చిన్న ఆదిరాలకు చెందిన పబ్బాల జంగయ్య(60), ఏదుల జంగయ్య(45) పొలానికి అవసరమైన విద్యుత్ స్తంభాలను ట్రాక్టర్ ట్రాలీలో వేసుకొని గ్రామానికి వెళుతుండగా 167వ జాతీయ రహదారిపై జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే మార్గంలో ట్రాక్టర్ అదుపు తప్పి ట్రాలీ బోల్తా పడింది. దీంతో విద్యుత్ స్తంభాల కింద నలిగిపోయి పబ్బాల జంగయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఏదుల జంగయ్యను ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, విద్యుత్ షాక్ తగిలి కౌలు రైతు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లాలో చోటు చేసుకుంది. రామన్నగారి సాయి కుమార్ పొలాన్ని కుంటి పోశెట్టి(38) అనే కౌలు రైతు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. పందుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి పొలం చుట్టూ విద్యుత్ తీగలు అమర్చాడు. ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన పోశెట్టి విద్యుత్ తీగలను గమనించక వాటికి తగలడంతో కరెంటు షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని చింతలగూడెంలో విద్యుదాఘాతంతో మరో రైతు మృతి చెందాడు. గ్రామానికి చెందిన లొడంగి గోవింద్(45) ఆదివారం కుమారుడితో కలిసి తన పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లాడు. మోటారు నుంచి నీరు రాకపోవడంతో స్టార్టర్‌లో వైర్లను సరిచేస్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

లడ్డూ వివాదంపై రంగంలోకి సిట్

అమరావతి/తిరుపతి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ వివాదంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణను ముమ్మరం చేసింది. నెయ్యి మూలాల నుంచి శూలశోధన చేస్తోంది. కల్తీ అంశం విచారణలో పకడ్బందీగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే తిరుపతికి చేరుకున్న సిట్ సభ్యులు ఆదివారం ఎక్కడికీ వెళ్లలేదు. తిరుపతిలోనే సమావేశమయ్యారు. కల్తీ నెయ్యిపై విజిలెన్స్, ల్యాబ్ నివేదికల్లోని అంశాలు, అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేశారు. టీటీడీ ప్రొక్యూర్మెంట్ జనరల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలనూ పరిశీలించారు. సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, అదనపు ఎస్పీ వెంకట్రావు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఏళ్లుగా ఎక్కడి వాళ్లు అక్కడే!

- తెలంగాణ ఏర్పాటు నుంచి సచివాలయ ఉద్యోగులకు జరగని బదిలీలు
- గత ప్రభుత్వంలో అమలు కానీ సర్వీసు నిబంధనలు
- కాంగ్రెస్ అధికారం చేపట్టినా మారని పరిస్థితి
- తీవ్ర అసంతృప్తిలో ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు బదిలీలు జరగలేదు. చాలామంది ఉద్యోగులు ఏళ్లుగా ఒకే స్థానానికి పరిమితమైపోయారు. గత పదేళ్లలో తమ మొర ఆలకించిన వారే లేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ నిబంధనలు, సర్వీస్ రూల్స్ అమలు చేస్తారని ఆశించినా నిరాశే మిగిలిందని ఉద్యోగులు వాపోతున్నారు. అంతేకాక, తమ సమస్యలను విన్నవించుకుందామంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమయం ఇవ్వడం లేదని సహాయ కార్యదర్శి స్థాయి అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో అమల్లో ఉన్న సచివాలయ నిబంధనల ప్రకారం ఓ ఉద్యోగి ఒక సెక్షన్‌లో మూడేళ్లకు మించి పని చేయకూడదు. అలాగే ఓ శాఖ పరిధిలో ఆరేళ్లకు మించి ఉంచకుండా బదిలీ చెయ్యాలి. అయితే, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి సచివాలయ ఉద్యోగుల బదిలీలు జరగలేదు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత ఒకట్రెండు సార్లు ఉద్యోగుల వివరాలు సేకరించినా బదిలీలు చేపట్టలేదు. ఇలా నిబంధనలు అమలు చేయకపోవడంతో 25 ఏళ్లుగా ఒకే శాఖలో కొనసాగుతున్న ఉద్యోగులు కూడా ఉన్నారు. ప్రాధాన్యం కలిగిన రెవెన్యూ, నీటిపారుదల, పురపాలక, వైద్యం, విద్య వంటి శాఖల్లో పని చేసే ఉద్యోగులు ఆయా శాఖల్లో పాతుకుపోయారు. మరికొందరు అప్రాధాన్య శాఖల్లోనే ఉండిపోయారు. ఫోకల్, నాన్‌ఫోకల్ పోస్టుల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి దీర్ఘకాలంగా నాన్ ఫోకల్‌లో ఉన్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. సమర్థులైన అధికారులు సచివాలయంలోనే ఉన్నా కొందరు ఉన్నతాధికారులు బయటి నుంచి అధికారులను తెచ్చి కీలక బాధ్యతలు అప్పగిస్తుండడంపైనా ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పదవీ విరమణ చేసిన ఓ ఉద్యోగిని కాలుష్య నియంత్రణ మండలిలో సభ్యుడిగా నియమించి అతన్ని డిప్యుటేషన్‌పై సెక్రటేరియట్‌కు తెచ్చి జీఏడీలో కీలక బాధ్యతలు అప్పగించడంపై ఉద్యోగుల్లో ప్రస్తుతం తీవ్ర చర్చ జరుగుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని సచివాలయ ఉద్యోగులు కోరుతున్నారు.

మహా మెట్రో



(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఫోర్త్‌సిటీకి కూడా మెట్రోను తీసుకెళ్లనున్నారు. దీనిని ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్ సిటీవరకు 40 కిలోమీటర్ల కారిడార్‌గా రూ.8 వేల కోట్ల వ్యయంతో నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే నాగోల్-ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్‌కు సంబంధించి డీపీఆర్‌లో స్వల్పమార్పులు చేశారు. మొదట ప్రతిపాదించిన నాగోలు, ఎల్బీనగర్ వయా చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు- మైలార్‌దేవ్‌పల్లి-పీ7 రోడ్డు-శంషాబాద్ ఎయిర్‌పోర్టు (29 కిలోమీటర్లు)కు బదులుగా.. నాగోలు నుంచి చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి వరకు తీసుకొచ్చి.. అక్కడి నుంచి ఆరాంఘర్, న్యూహైకోర్టు, శంషాబాద్ జంక్షన్ ద్వారా ఎయిర్‌పోర్టుకు కారిడార్‌ను నిర్మించేందుకు డీపీఆర్‌ను రూపొందించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇటీవల పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీపీఆర్ అంశాలను తెలియజేసిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి.. ఆదివారం ఆ వివరాలను మీడియాకు విడుదల చేశారు. మెట్రో రెండో దశ కారిడార్ల అలైన్‌మెంట్, ముఖ్యమైన ఫీచర్లు, స్టేషన్లు, ట్రాఫిక్ అంచనాల విషయాన్ని సీఎం సమీక్షలో తెలియజేశామని, డీపీఆర్ తుదిదశ మెరుగులు దిద్దుతున్నామని చెప్పారు. హెచ్ఎండీఏ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియాకు సిద్ధం చేస్తున్న కాంప్రహెన్సివ్ మొబిలిటీ ప్లాన్ (సీఎంపీ) ట్రాఫిక్ అధ్యయన నివేదిక కోసం తాము ఎదురుచూస్తున్నామన్నారు. మెట్రో మార్గాల్లో ట్రాఫిక్ అంచనాలను సీఎంపీతో క్రాస్ చెక్ చేయాల్సి ఉంటుందని, రెండో దశ మెట్రో కారిడార్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం డీపీఆర్‌లు సమర్పించే సమయంలో ఇది తప్పనిసరి అని ఆయన పేర్కొన్నారు.

కారిడార్-4 (36.6 కిలోమీటర్లు)
నాగోలు- శంషాబాద్ ఎయిర్‌పోర్టు

నాగోలు నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు మొత్తం 36.6 కిలోమీటర్ల మెట్రో మార్గాన్ని నిర్మిస్తున్నారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్ వరకు మిగిలిన 5 కిలోమీటర్లను ఇందులోనే పూర్తిచేయనున్నారు. ఎల్బీనగర్ దాటిన తర్వాత కర్మన్‌ఘాట్, ఒవైసీ ఆస్పత్రి, డీఆర్‌డీవో, చాంద్రా యణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, ఆరాంఘర్, న్యూహైకోర్టు, శంషాబాద్ జంక్షన్ గుండా నేషనల్ హైవే (ఎన్‌హెచ్) మీదుగా ఈ మార్గం ఉంటుంది. కాగా, ఈ లైన్‌ను నాగోల్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట వద్ద ఉన్న అన్ని మెట్రోలైన్లకు అనుసంధానం చేస్తారు. మొత్తం 36.6 కిలోమీటర్ల పొడవు కలిగిన మార్గంలో 35 కిలోమీటర్ల వరకు ఎలివేటెడ్ కారిడార్ (ఆకాశమార్గం) ఉంటుంది. మిగిలిన 1.6 కిలోమీటర్ల మార్గం భూగర్భంలో రానుంది. శంషాబాద్ దాటిన తర్వాత భూగర్భస్టేషన్‌గా ఎయిర్‌పోర్టు స్టేషన్ వస్తుంది. మొత్తం ఈ మార్గంలో 24 మెట్రోస్టేషన్లు ఉంటాయి.

కారిడార్-5 (11.6 కిలోమీటర్లు)
రాయదుర్గ్-కోకాపేట నియోపోలిస్

మొదటి దశలోని కారిడార్-3 (నాగోలు-రాయదుర్గ్)కి అనుసంధానంగా దీనిని నిర్మిస్తున్నారు. రాయదుర్గ్ స్టేషన్ తర్వాత బయో డైవర్సిటీ జంక్షన్, ఖాజాగూడ రోడ్డు, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రో సర్కిల్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మీదుగా కోకాపేట నియోపోలీస్ వరకు నిర్మించనున్నారు. ఇది పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్‌లో ఉంటుంది. ఇందులో దాదాపు 8 స్టేషన్లు ఉంటాయి.

కారిడార్-6 (7.5 కిలోమీటర్లు)
ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట

జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు ఇప్పటికే ఉన్న కారిడార్-2కు పొడిగింపుగా దీనిని నిర్మించనున్నారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మొత్తం 7.5 కిలోమీటర్ల లైన్ ఉంటుంది. ఇది పాతబస్తీలోని మండిరోడ్ మీదుగా దారుల్‌షిఫా జంక్షన్, శాలిబండ జంక్షన్, ఫలక్‌నుమా మీదుగా చాంద్రాయణగుట్ట వరకు వెళ్తుంది. ఈ కారిడార్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ మెట్రో మార్గానికి కేవలం 500 మీటర్ల దూరంలో ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల చారిత్రక ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని వాటి పేర్లపైనే స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం దారుల్‌షిఫా జంక్షన్ నుంచి శాలిబండ జంక్షన్ మధ్య ఉన్న 60 అడుగుల రోడ్డును, శాలిబండ జంక్షన్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న 80 అడుగుల రోడ్డును ఏకరీతిగా 100 అడుగులకు విస్తరించనున్నారు. స్టేషన్ ఉండే ప్రాంతాల్లో మాత్రం రోడ్డును 120 అడుగులకు విస్తరించనున్నారు. కాగా, రోడ్డు విస్తరణ, మెట్రో అలైన్‌మెంట్‌కు సంబంధించి దాదాపు 1100 ఆస్తులను సేకరించనున్నారు. ఇందులో 400 ఆస్తులకు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశారు. మిగిలిన ఆస్తులు పురోగతిలో ఉన్నాయని, ఈ మార్గంలో దాదాపు 103 మతపరమైన, వారసత్వ, ఇతర సున్నితమైన నిర్మాణాలున్నాయని అధికారులు తెలిపారు. వాటికి తగిన ఇంజినీరింగ్ పరిష్కారాలు, మెట్రో పిల్లర్ స్థానాల సర్దుబాటు ద్వారా ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మార్గంలో దాదాపు 6 స్టేషన్లు వస్తాయని, పూర్తిగా ఎలివేటెడ్‌గా నిర్మిస్తామని చెప్పారు.

కారిడార్-7: (13.4 కిలోమీటర్లు)
మియాపూర్-పటాన్‌చెరు

ముంబయి జాతీయ రహదారిపై కారిడార్-1 (ఎల్బీనగర్-మియాపూర్)కు అనుసంధానంగా మియాపూర్-పటాన్‌చెరు మార్గాన్ని నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న మియాపూర్ మెట్రోస్టేషన్ నుంచి పనులను ప్రారంభించి పటాన్‌చెరు వరకు 13.4 కిలోమీటర్ల మార్గాన్ని చేపట్టనున్నారు. ఈ లైన్ ఆల్విన్ క్రాస్‌రోడ్డు, మదీనాగూడ, చందానగర్, బీహెచ్ఈఎల్, ఇక్రిశాట్ మీదుగా వెళుతుంది. దీనిని పూర్తిగా ఎలివేటెడ్ గా నిర్మించనున్నారు. ఇందులో దాదాపు 10 స్టేషన్లు రానున్నాయి.

కారిడార్-8: (7.1 కిలోమీటర్లు)
ఎల్‌బీనగర్-హయత్‌నగర్

విజయవాడ హైవేపై కారిడార్-1 మియాపూర్-ఎల్బీనగర్ లైన్‌కు అనుసంధానంగా దీనిని నిర్మించనున్నారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు మొత్తం 7.1 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. ఇది చింతలకుంట, వనస్థలిపురం, ఆటోనగర్, ఆర్టీసీ కాలనీ మీదుగా వెళుతుంది. దీనిని పూర్తి ఎలివేటెడ్ కారిడార్‌గా చేపట్టనున్నారు. దాదాపు 6 స్టేషన్లు రానున్నాయి.

కారిడార్-9 : 40 కిలోమీటర్లు
ఎయిర్‌పోర్టు-ఫోర్త్‌సిటీ (స్కిల్ యూనివర్సిటీ)

సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన ఫోర్త్‌సిటీ మెట్రో కనెక్టివిటీని కూడా రెండో దశలోనే చేపట్టనున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి ఫోర్త్‌సిటీ వరకు 40 కిలోమీటర్ల కారిడార్‌ను ప్రతిపాదించారు. ఎయిర్‌పోర్టు నుంచి శ్రీశైలం హైవే మీదుగా తుక్కుగూడ ఓఆర్ఆర్, ఆదిభట్ల, కొంగరకలాన్ వద్ద డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ చేపట్టి.. ఫోర్త్‌సిటీకి మెట్రోను తీసుకెళ్లనున్నారు. ఎయిర్‌పోర్టు-ఫోర్త్‌సిటీ మార్గానికి సంబంధించి పెద్దగా భూసేకరణ సమస్యలు ఉండవని భావిస్తున్నారు. ఇక్కడ ఇప్పటికే ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు ఉండడమే ఇందుకు కారణం. ఈ మార్గంలో 6 నుంచి 8 స్టేషన్లు వచ్చే అవకాశం ఉంది. కాగా, ఈ డీపీఆర్‌ను ఆకర్షణీయమైన ఫీచర్లతో వినూత్న రీతిలో తయారు చేస్తున్నారు.

భూసేకరణ ఇబ్బందుల్లేకుండా ఉండేందుకే..!

నాగోల్-ఎయిర్‌పోర్టు అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని నిర్ణయించడానికి కారణం భూసేకరణ అంశమేనని తెలుస్తోంది. మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా తొలుత నాగోలు-ఎల్బీనగర్-చాంద్రాయణగుట్ట క్రాస్‌రోడ్డు- మైలార్‌దేవ్‌పల్లి-పీ7 రోడ్డు- శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు (31 కిలోమీటర్లు) ప్రతిపాదించారు. దీంతోపాటు మైలార్‌దేవ్‌పల్లి-ఆరాంఘర్- న్యూ హైకోర్టు (రాజేంద్రనగర్) వరకు ప్రతిపాదించిన 4 కిలోమీటర్ల కారిడార్‌కు అదనంగా హైకోర్టు నుంచి మరో 17 కిలోమీటర్లను పొడిగించి ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను తీసుకెళ్లాలని భావించారు. దీంతో.. ఇటు నాగోలు నుంచి, అటు రాజేంద్రనగర్‌లోని న్యూహైకోర్టు నుంచి రెండు మార్గాల ద్వారా ఎయిర్‌పోర్టుకు వెళ్లే వారికి సౌకర్యంగా ఉంటుందని, రోడ్లపై వేలాది వాహనాల ఒత్తిడి తగ్గడంతోపాటు ఎయిర్‌పోర్టులో కార్ల పార్కింగ్ సమస్య నుంచి ఉపశమనం పొందుతారని అనుకున్నారు. అయితే మొదటగా ప్రతిపాదించిన కారిడార్‌కు సంబంధించి పీ7రోడ్డు నుంచి ఎయిర్‌పోర్టుకు భూసేకరణకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని, ఇక్కడ ప్రైవేట్ భూములు అధికంగా ఉండడంతో పరిహారం చెల్లింపు పెద్ద మొత్తంలో ఉంటుందని వచ్చిన సూచనల నేపథ్యంలో ఈ మార్గంలో మార్పులు చేసినట్లు సమాచారం. కొత్తగా ఖరారుచేసిన రూట్‌లో హైకోర్టు నుంచి శంషాబాద్ వరకు సగానికి పైగా ప్రభుత్వ భూములున్నాయని, ఇక్కడి నుంచి ఎయిర్‌పోర్టు కారిడార్‌ను చేపట్టడం సులువుగా జరుగుతుందని అధికారులు ప్రభుత్వానికి తెలియజేసిన నేపథ్యంలో డీపీఆర్‌లో సవరణలు చేసినట్లు తెలుస్తోంది.

కేంద్రం అనుమతి కోసం డీపీఆర్..

రెండో దశలో తొలుత ప్రతిపాదించిన 5 కారిడార్లతోపాటు ఫోర్త్‌సిటీ కారిడార్‌ను కూడా ఇందులోనే పూర్తి చేయనున్నారు. అయితే ఇప్పటికే పూర్తిచేసిన 5 కారిడార్ల డీపీఆర్‌ను త్వరలో కేంద్రానికి సమర్పించనున్నారు. అనుమతి వచ్చిన వెంటనే ఆయా పనులను ప్రారంభించనున్నారు.

అయితే ఫోర్త్‌సిటీ డీపీఆర్ తయారు చేయడంలో కాస్త ఆలస్యం జరుగుతుందని, ఈ పనులకు సంబంధించిన బడ్జెట్‌ను మాత్రం రెండో దశలోనే పొందుపరుస్తున్నామని అధికారులు తెలిపారు. ఫోర్త్‌సిటీ మెట్రో కనెక్టివిటీ కోసం ఉద్దేశించిన సుమారు రూ.8 వేల కోట్లతో కలిపి మొత్తం రెండో దశ ప్రాజెక్టుకు వ్యయం రూ.32,237 కోట్లు (రూ.24,237 కోట్లు+రూ.8,000 కోట్లు)గా అంచనా వేశామన్నారు. దేశంలోని వివిధ నగరాల్లో ఉన్న ఇతర మెట్రో రైలు ప్రాజెక్టుల మాదిరిగానే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రతిపాదించినట్లు చెప్పారు.

ప్రభుత్వ డేటా ఆధారంగా 'కుటుంబం' గుర్తింపు

- డిజిటల్ హెల్త్ కార్డుల పైలట్ ప్రాజెక్టుకు గ్రామాలు, వార్డుల ఖరారు!
- ఐదు రోజుల్లో లబ్ధిదారుల వివరాలు పంపాలన్న ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డు ఇచ్చే అంశంలో ప్రభుత్వం వేగం పెంచింది. ఈ పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసేందుకు గ్రామాలు, వార్డుల ఎంపిక పూర్తి చేసింది. ఆయా ప్రాంతాల్లో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను ఐదో రోజుల్లోనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. మరోపక్క, ప్రభుత్వం వద్ద ఇప్పటికే ఉన్న సమాచారం(డేటా బేస్) ఆధారంగా కుటుంబాన్ని ఓ యూనిట్‌గా గుర్తించాలని నిర్ణయించింది. అలాగే, డిజిటల్ హెల్త్ కార్డులను ఆధార్ కార్డుతో అనుసంధానం చేయనున్నారు. నిజానికి, రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని అమలు చేసే ముందు 119 నియోజకవర్గాల్లోని ఒక గ్రామం, ఒక పట్టణ వార్డులో ప్రయోగాత్మకంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నియోజకవర్గం పట్టణ ప్రాంతమైతే రెండు వార్డులను ఎంపిక చేసుకోవాలని అధికారులకు సూచించింది. ఒకవేళ గ్రామీణ నియోజకవర్గమైతే రెండు గ్రామాలను ఎంపిక చేసుకోవాలని చెప్పింది. వార్డు లేదా గ్రామంలో కనీసం 150నుంచి 250 గృహాలుండాలని నిర్దేశించింది. పైలట్ ప్రాజెక్టుకు ఎంపిక చేసిన గ్రామాలు, వార్డుల జాబితాను ఆదివారం రాత్రిలోగా పంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు అధికారులు వివరాలు కూడా అందించారు. అధికారుల నుంచి వచ్చిన జాబితాపై త్వరలో సమీక్ష కూడా జరగనుంది.

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలి

అంగుళం భూమి కూడా ఆక్రమణకు గురి కావొద్దు.. ఆ దిశగా రెవెన్యూ యంత్రాంగం పనితీరు మెరుగుపడాలి

- సామాన్యులకు మేలు చేసేలా కొత్త చట్టం
- రెవెన్యూ ఉద్యోగులకు శిక్షణ కేంద్రం
- కలెక్టర్ అనుమతి తీసుకున్న తహసీల్దార్లపై కేసులు!: పొంగులేటి
- తహసీల్దార్లతో సమావేశం

హైదరాబాద్/మేడ్చల్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నట్లు ఆ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిదిద్ది, రెవెన్యూ శాఖను బలోపేతం చేస్తామని తెలిపారు. సామాన్యులకు, రైతులకు మేలు జరిగేలా కొత్త చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో ఆదివారం 33 జిల్లాల తహసీల్దార్లతో మంత్రి శ్రీనివాసరెడ్డి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, అధికారులు జోడెద్ల వంటి వారని చెప్పారు. ప్రభుత్వ ఆస్తులు, స్థలాలను కాపాడడంతోపాటు పేదలకు సహాయం అందించడంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు మెరుగుపడాలని సూచించారు. ఒక్క అంగుళం ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణలకు గురి కాకుండా చూడాలన్నారు. ఇందుకోసం పటిష్ఠ కార్యాచరణను రూపొందించాలని ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సిబ్బంది పూర్తిగా సహకరించాలి, వారి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. రెవెన్యూ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, వారికి పథకాలను అందించడంలోనూ రెవెన్యూ యంత్రాంగం కీలక పాత్ర పోషించాలన్నారు. అందులో తహసీల్దార్ల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య రెవెన్యూ శాఖ వారధిగా ఉండాలని, ఈ విభాగం సమర్థంగా పనిచేసినప్పుడే ప్రభుత్వ లక్ష్యాలు, ఆకాంక్షలు నెరవేరతాయని తెలిపారు. ప్రజలు కోరుకుంటున్నట్లుగా రెవెన్యూ వ్యవస్థ పనిచేస్తుందా, లేదా? అని ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే రైతులు, పేదలు, సామాన్యులకు వీలైనంత మేరకు సాయం చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రెవెన్యూ శాఖలో ఎంత నిజాయితీగా పనిచేసినా నిందలు తప్పవని, మన అంతరాత్మ సాక్షిగా పనులు చేయాలని సూచించారు. కలెక్టర్ అనుమతి తీసుకున్న తర్వాతే తహసీల్దార్ల మీద కేసులు నమోదు చేసేలా డీజీపీతో చర్చించి త్వరలో ఉత్తర్వులు జారీ చేస్తామని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. అలాగే రెవెన్యూ సిబ్బంది కోసం హైదరాబాద్‌లో శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వం హడావుడిగా మండలాల సంఖ్యను పెంచింది కానీ, దానికి తగినట్టుగా కార్యాలయాలను, మౌలిక వసతులను ఏర్పాటు చేయలేదని పేర్కొన్నారు. అవసరమైన మేరకు సిబ్బందిని కూడా నియమించలేదన్నారు. తహసీల్దారు కార్యాలయాల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు రెగ్యులర్ స్టాఫ్ నియామకం, పదోన్నతులు, కోర్టు ఖర్చులు, అద్దె భవనాలు, అద్దె వాహన బకాయిలతో పాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో జరిగిన తహసీల్దార్ల బదిలీలపై ఉద్యోగ సంఘాలతో చర్చించి త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు.



తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న పొంగులేటి

28 ఏళ్ల సర్వీసులో ఇలాంటి కార్యక్రమం చూడలేదు: నవీన్ మిట్టల్

తన 28 ఏళ్ల సర్వీసులో రెవెన్యూ మంత్రి తహసీల్దార్లతో ముఖాముఖిగా మాట్లాడడం ఇదే తొలిసారి అని ముఖ్య కార్యదర్శి నవీన్‌మిట్టల్ అన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఏ శాఖలు చేయలేని పనులను రెవెన్యూ శాఖ చేస్తుందని చెప్పారు. రెవెన్యూ అధికారుల సమస్యలను వినడానికి, వాటికి తగురీతిలో పరిష్కరించడానికి మంత్రి రావడం హర్షణీయమని తెలిపారు.

మహిళా సమాఖ్యలతో బస్సులు కొనిపిస్తాం

- వాటిని ఆర్టీసీకి అద్దెకు తీసుకుంటాం
- త్వరలో ఆర్టీసీలో ఉద్యోగ ఖాళీల భర్తీ
- దశలవారీగా 2400 ఎలక్ట్రిక్ బస్సులు
- మంత్రి పొన్నం ప్రభాకర్



కరీంనగర్, లింగాలఘణపురం, సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలోని మహిళా సమాఖ్యలచే బస్సులను కొనుగోలు చేయించి అద్దె ప్రాతిపదికన ఆర్టీసీకి నడిపించనున్నామని, ఆ మేరకు మెప్మాతో సంప్రదింపులు జరుపుతున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆదివారం కరీంనగర్, జనగామ జిల్లా లింగాలఘణపురంలో జరిగిన కార్యక్రమాల్లోనూ, సిద్దిపేటలో మీడియాతోనూ ఆయన మాట్లాడారు. కరీంనగర్-జేబీఎస్ మార్గంలో తిరిగే 35 ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను కరీంనగర్‌లో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి, మేడిపల్లి సత్యం, సంజయ్‌కుమార్‌లతో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్‌లో త్వరలోనే ఇదే తరహాలో మరో 39 బస్సులను సంస్థ వాడకంలోకి తెస్తుందన్నారు. అలాగే, నిజామాబాద్‌కు 67, వరంగల్‌కు 86, సూర్యాపేటకు 52, నల్లగొండకు 65, హైదరాబాద్‌కు 74 ఈ తరహా బస్సులు అందుబాటులోకి వస్తాయన్నారు. కాలుష్యరహిత సమాజం కోసం హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల ఎలక్ట్రిక్ బస్సులు నడపాలన్న సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు దశలవారీగా 2400 బస్సులను కొనుగోలు చేసేందుకు సంస్థ కసరత్తు చేస్తున్నదని తెలిపారు. అలాగే, మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తున్నదని చెప్పారు. కొత్త బస్సులకు సరిపడా ఉద్యోగ ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని, ఇప్పటికే 3035 పోస్టుల నియామక ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. 2013 బకాయిలకు సంబంధించిన బాండ్ల డబ్బును కండక్టర్లు, డ్రైవర్లకు సంస్థ చెల్లించిందని, దసరాలోపు మిగతా ఉద్యోగుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో అక్రమంగా నిర్మించిన ఇళ్లను మాత్రమే తొలగిస్తున్నామని, నివాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎవరినీ ఇబ్బంది పెట్టడం లేదని, ఎక్కడా బలవంతంగా ఇళ్లను కూల్చడం లేదని స్పష్టం చేశారు. కానీ, ప్రతిపక్షాలు కావాలనే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నాయని విమర్శించారు. వీలైనంత త్వరలో రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని, ఇందులో పార్టీ సీనియర్లకు న్యాయం చేస్తామని అన్నారు. రాష్ట్రంలో కోర్టు తీర్పుకనుగుణంగా రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టేందుకు వేగవంతంగా కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పొన్నం చెప్పారు. కులగణన తర్వాత జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. గీత కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా లాంటి బకాయిలను దసరాలోపు చెల్లించేందుకు ఆర్థిక శాఖను ఆదేశిస్తామని చెప్పారు.

రేవంత్ రాజీనామా చేయక తప్పదు

- లీగల్ నోటీసులిస్తే.. ఇల్లీగల్ దందాలపై మాట్లాడకుండా ఉంటానా?: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): "దేశంలో న్యాయవ్యవస్థ బలంగా, నిజాయితీగా ఉంది. ఆదర్శ్ కుంభకోణంలో అశోక్‌చ వాన్‌లాగా, నువ్ అవినీతికి పాల్పడి అడ్డంగా దొరికావు. సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయక తప్పదు" అని బీఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఎక్స్ వేదికగా హెచ్చరించారు. "మీ బావమరిదితో లీగల్ నోటీసు పంపితే నీ ఇల్లీగల్ దందాల గురించి మాట్లాడకుండా ఉంటాననుకుంటున్నావా? బావమరిదికి అమృతాన్ని పంచి, పేదలకు విషం ఇస్తుంటే చూస్తూ ఊరుకోబోం" అని పేర్కొన్నారు. సీఎంపరిధిలోని శాఖలోనే తన బావమరిదికి కంపెనీకి రూ.1,137 కోట్ల టెండర్ కట్టబెట్టింది నిజమని తెలిపారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్7, 11, 13ను ముఖ్యమంత్రి ఉల్లంఘించారని. గత రెండేళ్లుగా రూ.2కోట్లు లాభం ఆర్జించిన ఒక చిన్న కంపెనీ అంతపెద్ద టెండరు కట్టబెట్టారని, ఈ అవినీతి నుంచి ఢిల్లీలో ఉన్న రేవంత్ బీజేపీ దోస్తులు కూడా ఆయనను కాపాడడం కష్టమేనన్నారు. నగరంలో నీ రూ.1.50 లక్షల కోట్ల మూసీ ధనదాహానికి బలవుతున్న జీవితాలు లక్షల్లో ఉన్నాయి మిస్టర్ చీఫ్ మినిస్టర్ అంటూ విమర్శించారు. "మహానగర ప్రజలారా అధైర్యపడొద్దు.. మీకు మద్దతుగా బీఆర్ఎస్ ఉంటుంది" అని కేటీఆర్ భరోసా ఇచ్చారు.



'మూడు గుడిసెల పల్లె' కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, తదితరులు

కవులు, రచయితలు ప్రతిపక్ష పాత్ర పోషించాలి

- సాహితీ సంఘాలు పార్టీలకు అనుబంధంగా ఉండొద్దు
- 'మరసం' వార్షికోత్సవంలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 29 : కవులు, రచయితలు సమాజానికి మార్గదర్శనం చేయాల్సిన సమయం వచ్చిందని, సాహితీవేత్తలు ప్రతిపక్ష పాత్ర పోషించాలని ప్రముఖ సాహితీవేత్త, 'ఆంధ్రజ్యోతి' సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో ఆదివారం జరిగిన 'మరసం' (మంజీర రచయితల సంఘం) 38వ వార్షికోత్సవ సభలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్య సంఘాలు రాజకీయ పార్టీలకు అనుబంధంగా కొనసాగకూడదని అన్నారు. కవులు, రచయితలు ప్రశ్నించేలా ఉండాలని, ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు. సాహిత్యం కొత్త కర్తవ్యాలను ఎంచుకోవాలని.. మేల్కొంటూ మేల్కోలపాలని అభిప్రాయపడ్డారు. 2014 తర్వాత తెలంగాణ ఉద్యమ సమాజం కకావికలం అయిందని సాహిత్యకారుల్లో అనిశ్చితి నెలకొందని అన్నారు. కవులు, రచయితలు సమాజానికి మార్గదర్శకం చేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా 'మూడు గుడిసెల పల్లె' అనే కవితా సంకలనాన్ని కె.శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, నందిని సిధారెడ్డి, ఉద్యోగ సంఘాల నేత దేవీప్రసాద్, రసమయి బాలకిషన్, జర్నలిస్టు విరాహత్ అలీ, మరసం జిల్లా అధ్యక్షుడు రంగాచారి పాల్గొన్నారు.

దక్షిణాదిలో పెరుగుతున్న జీర్ణాశయ వ్యాధులు

- 'బ్రిడ్జ్ ది గ్యాప్స్ 2.0' సదస్సులో వైద్యులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 29(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలో జీర్ణాశయ, కాలేయ రుగ్మతలు గణనీయంగా పెరుగుతున్నాయని గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి ఒక అంటువ్యాధిలా వ్యాప్తి చెందుతున్నాయని, ప్రతి ఐదుగురు పెద్దల్లో ఒకరు వీటి బారినపడుతున్నారని పేర్కొన్నారు. 'బ్రిడ్జ్ ది గ్యాప్స్ 2.0' పేరిట గ్యాస్ట్రోఇంటెస్టినల్ (జీఐ) వ్యాధుల నివారణ, చికిత్సపై హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో ఆదివారం సదస్సు నిర్వహించారు. 500 మందికి పైగా గ్యాస్ట్రోఎంటరాలజీ వైద్య నిపుణులు హాజరై వివిధ అంశాలపై చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాలపై జీఐ వ్యాధులు తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. భారతదేశంలో జీర్ణాశయ, కాలేయ వ్యాధులతో మరణాలు సంవత్సరానికి 2,68,580కు చేరుకున్నాయని, ఇది మొత్తం మరణాల్లో 3.17 శాతమని పేర్కొన్నారు. యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి, వైద్యులు నవీన్ పోలవరపు, సంతోష్ ఎనగంటి, కేఎస్ సోమశేఖర్‌రావు, గోపి శ్రీకాంత్, శరత్‌చంద్ర గోరంట్ల తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'కి బోయి విజయభారతి పార్థివదేహం

- మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ గోరటి తదితరుల నివాళి

అడ్డగుట్ట, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత రచయిత్రి, సాహితీ విమర్శకురాలు డాక్టర్ బోయి విజయభారతి పార్థివ దేహాన్ని కుటుంబసభ్యులు గాంధీ వైద్య కళాశాలకు ఆదివారం మధ్యాహ్నం అప్పగించారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, కాంగ్రెస్ నేత కొప్పుల రాజు, నాగర్ కర్నూలు కలెక్టర్ బోయి విజయేంద్ర, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, ప్రజాగాయని విమలక్క, పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, సామాజిక కార్యకర్తలు, మహిళా సంఘాల నేతలు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. డాక్టర్ బోయి విజయభారతి శనివారం తుది శ్వాస విడిచిన సంగతి తెలిసిందే.

జెత్వానీ వ్యవహారంలో మరో ఫేక్ కేసు!

ఆమె సన్నిహితుడిపై బెజవాడ పటమట స్టేషన్‌లో ఎఫ్ఐఆర్

విజయవాడ, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ కేసులో మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. ఆమెకు సన్నిహితుడైన అమిత్‌సింగ్‌ను అరెస్టు చేయడానికి.. ఆమెపైన పెట్టినట్లే ఆయనపైనా తప్పుడు కేసు నమోదు చేసినట్లు వెల్లడైంది. ఆమెపై వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుతో ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆమెను దోషిగా నిలబెట్టడం కోసం ఫోర్జరీ డాక్యుమెంట్లను సృష్టించారు. ఇప్పుడీ కేసు దర్యాప్తు జరుగుతుండగా.. నాడు పోలీసులు నమోదు చేసిన మరో తప్పుడు కేసు వివరాలు తెలిశాయి. ఈ కేసు నమోదుకు పోలీసు అధికారులు విజయవాడ పటమట పోలీసు స్టేషన్‌ను ఎంచుకున్నారు. జెత్వానీని ఫిబ్రవరి 3న ముంబై నుంచి తీసుకొచ్చిన తర్వాత నాలుగో తేదీన విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో ఆమె, ఆమె తండ్రి నరేంద్రకుమార్, తల్లి ఆశ జిల్లా జైలుకు వెళ్లారు. పోలీసులు వారిని పదో తేదీన కస్టడీలోకి తీసుకున్నారు. ఐదు రోజుల పాటు కాదంబరిని విచారించారు. అరెస్టు సమయంలో ఆమెకు సంబంధించిన ఐదు యాపిల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఉన్న ఆధారాలను తుడిచేయడానికి పాస్‌వర్డ్లు చెప్పాలని ఆమెపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెచ్చారు. అయితే ఆమె ఆ వివరాలు వెల్లడించలేదు. దీంతో పోలీసులకు విద్యాసాగర్ మరో టాస్క్ ఇచ్చాడు. ఢిల్లీ చెందిన అమిత్‌సింగ్‌తో జెత్వానీకి మంచి పరిచయాలున్నాయని.. ఆయన్ను తీసుకొస్తే ఆటోమేటిగ్గా వివరాలూ చెబుతుందని సలహా ఇచ్చాడు. అమిత్‌సింగ్‌ను ఎలాంటి ఆధారం లేకుండా తీసుకొస్తే వివాదం రేగుతుందని భావించి..పోలీసులు మరో స్కెచ్ వేశారు. 11న బెజవాడ నారా చంద్రబాబునాయుడు కాలనీలోని ఒక స్పా కేంద్రంలో సోదాలు చేశారు. అక్కడ వ్యభిచారం జరుగుతోందంటూ స్పా సెంటర్ నిర్వాహకురాలు తమాంగ్(మణిపూర్)ను ఏ-1గా చేర్చారు. ఏ-2గా అమిత్‌సింగ్‌ను ఇరికించారు. వాస్తవానికి ఆయన ఆ సమయానికి ఢిల్లీలో ఉన్నారు. మీడియాకు విడుదల చేశారు. కానీ, 11న ఎఫ్ఐఆర్ నమోదైతే అంతకుముందు రోజే ఢిల్లీకి విమాన టికెట్లు బుక్ చేసుకోవడం గమనార్హం. ఈ కేసు విషయంలో ఈసారి ఏ పోలీసు అధికారి మెడపై కత్తి వేలాడుతోందన్న చర్చ పోలీసు శాఖలో మొదలైంది.



మణికొండలో మాంగళ్య షాపింగ్ మాల్

సందడి చేసిన సినీ నటి శ్రీలీల

హైదరాబాద్, సెప్టెంబరు 29: హైదరాబాద్‌లోని మణికొండలో మాంగళ్య షాపింగ్ మాల్ 22వ షో రూంను సినీ నటి శ్రీలీల ఆదివారం ప్రారంభించారు. మాల్‌లోని పట్టు, ఫ్యాన్సీ సెక్షన్లు.. లేడీస్, జెంట్స్, కిడ్స్ వేర్.. సంప్రదాయ దుస్తుల విభాగాల్లో కలియదిరిగి సందడి చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడారు. ఈ షోరూంలో పట్టు, ఫ్యాన్సీ కంచి, ధర్మవరం, ఉప్పాడ పట్టు చీరలతో పాటు అధునాతన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంత వాసులు దసరా షాపింగ్‌ను మాంగళ్య షో రూంలో చేయాలని కోరారు. 12 ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటి వరకు 22 షో రూంలను ప్రారంభించామని షాపింగ్ మాల్ డైరెక్టర్ పి.ఎస్.మూర్తి, కాసం నమః శివాయ, కాసం మల్లికార్జున్, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్, పుల్లూరు అరుణ్ కుమార్ తెలిపారు. త్వరలోనే కర్ణాటకలోనూ తమ షోరూంలను విస్తరించబోతున్నామని వెల్లడించారు. కాసం ఫణి, కాసం సాయి కృష్ణ, కాసం ధీరజ్, డాక్టర్ కాసం ప్రీతం, తొడుపునూరి అరుణ్, కార్తీక్, విశాల్, వరుణ్ పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే ధ్యేయం



పింక్ పవర్ రన్ విజేతకు బహుమతి అందచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

వారు బాగుంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది

- 'పింక్ పవర్ రన్'లో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/ గచ్చిబౌలి, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా ఆరోగ్యంగా ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్), సుధారెడ్డి ఫౌండేషన్ సంయుక్తంగా గచ్చిబౌలి స్టేడియం వద్ద నిర్వహించిన 'పింక్ పవర్ రన్'లో రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ పరుగులో విజేతలను సీఎం రేవంత్ సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు సంఘీభావంగా నగరవాసులు పింక్ పవర్ రన్‌లో పెద్ద సంఖ్యలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళల కోసం మరిన్ని ఆస్పత్రులను నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళా సంక్షేమం, ఆరోగ్యానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలమన్నారు. ఈ సందర్భంగా మేఘా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోగ్యమే సంపద అన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు ఈ రన్ నిర్వహించామని, భవిష్యత్‌లో ఈ తరహా కార్యక్రమాలు మరిన్ని చేపడతామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియం నుంచి 3, 5, 10 కిలోమీటర్ల విభాగాల్లో ఈ రన్ నిర్వహించారు. విద్యార్థులు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఔత్సాహికులు.. దాదాపు 12 వేల మంది ఈ పరుగులో పాల్గొన్నారు. రన్‌లో భాగంగా గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించేందుకు పక్షి ఆకారంలో అతి పెద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీ ఛైర్మన్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, శాట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడే పుట్టిపెరిగి.. చదివినా..

వైద్యవిద్యలో 'నాన్ లోకల్'

- 200 మంది విద్యార్థులకు అన్యాయం
- వైద్య ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం
- సుప్రీంకోర్టుకు మరో 18 మంది
- నేడు సీటు అలాట్‌మెంట్ జాబితా



ఈ ఫొటోలోని విద్యార్థిని పేరు గార్లపాటి వర్షిత. హైదరాబాద్‌లోని మణికొండలో ఒకటి నుంచి పదోతరగతి వరకు చదువుకుంది. తండ్రి ఖమ్మం జిల్లా కల్లూరుకు చెందిన వారు. హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగిగా జీవనం కొనసాగించే ఆయన.. కొవిడ్ సమయంలో ఉద్యోగం పోవడంతో.. కూతురిని తన భార్య స్వస్థలం(కృష్ణాజిల్లా నూజివీడు)లో ఇంటర్ చదివించారు. వర్షితకు నీట్‌లో మంచి ర్యాంకు వచ్చింది. కానీ, ఇంటర్ ఆంధ్రప్రదేశ్‌లో చదవడం వల్ల.. ఆమె తెలంగాణలో నాన్-లోకల్‌గా మారింది.



● మరో విద్యార్థి 1 నుంచి 12 వరకు తెలంగాణలో కాదు కదా.. అస్సలు మన దేశంలోనే చదువుకోలేదు. కానీ.. తెలంగాణలో ఎంబీబీఎస్‌లో సీటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. తాను స్థానికుడిని కాదంటే ఎలా? అంటూ కోర్టుకు వెళ్లారు. ఇటువంటి 134 కేసులన్నింటినీ కలిపి.. కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం కల్పించాలని న్యాయస్థానం ఇటీవల ఆదేశించింది. మరికొంత మంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇలా.. మొత్తం 170 మంది వరకు కోర్టుల ఆదేశాలతో కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకున్నారు. ఇందులో సగం మంది అస్సలు తెలంగాణలోనే చదవలేదు. ఇంకా చెప్పాలంటే.. వారి తల్లిదండ్రులు కూడా తెలంగాణకు చెందినవారు కాదు. ప్రభుత్వం హైకోర్టు చెప్పినట్టుగా స్థానికతపై మార్గదర్శకాలను విడుదల చేయకుండా.. సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లింది. అక్కడా ఊరట లభించకపోవడంతో.. కోర్టుకెళ్లిన విద్యార్థులకు(లోకల్ కాకపోయినా) కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశమిస్తామని ఒప్పుకొంది. దీంతో.. అసలైన తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోంది.

200 మందికి తీరని అన్యాయం..!

రాష్ట్రంలో ఈ సారి నీట్ యూజీ పరీక్షకు 77,848 మంది హాజరవ్వగా.. 47,356 మంది అర్హత సాధించారు. జీవో 33 ప్రకారం వరుసగా నాలుగేళ్ల 9, 10, ఇంటర్ ఇక్కడే చదివి ఉంటే.. లోకల్‌గా పరిగణిస్తారు. దీంతో పది తరువాత ఇంటర్+నీట్ కోచింగ్ కోసం పక్క రాష్ట్రాలకు వెళ్లిన తెలంగాణ విద్యార్థులు నాన్-లోకల్ అయిపోయారు. వీరు కూడా కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు దరఖాస్తు చేసుకున్నారు. నాన్‌లోకల్స్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. వైద్య విశ్వవిద్యాలయం అధికారులు జీవో-33 ప్రకారం 924 మందిని నాన్-లోకల్‌గా గుర్తిస్తూ.. వారి దరఖాస్తులను తిరస్కరించింది. వీరిలో సుమారు 400 మంది దరఖాస్తులు ఏపీలోనూ తిరస్కరణకు గురయ్యాయి. మరో 350 మంది వరకు ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో చదివిన స్థానికేతరులున్నారు. మిగతా 200 మంది వరకు విద్యార్థులు తెలంగాణ శాశ్వత నివాసితులు. వరుసగా నాలుగేళ్లు ఇక్కడ చదవని ఒకేఒక్క కారణంతో వీరు కౌన్సెలింగ్ అర్హతను కోల్పోయారు. దీనిపై 18 మంది విద్యార్థులు సుప్రీంకోర్టుకు వెళ్లారు. ఈ పిటిషన్లపై సోమవారం విచారణ జరగనుంది. గత కేసులో 135 మంది విద్యార్థుల మాదిరిగానే.. వీరికి కూడా కౌన్సెలింగ్‌కు అవకాశవిచ్చే అవకాశాలున్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఆర్థిక స్తోమత లేక.. కోర్టు మెట్లెక్కని విద్యార్థుల పరిస్థితి మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. వీరంతా ప్రభుత్వమే తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేడు సీట్ల కేటాయింపు

కన్వీనర్ కోటా మొదటి రౌండ్‌కు సంబంధించి వెబ్ ఆప్షన్ ప్రక్రియ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఎంపికైన విద్యార్థులకు కాలేజీల వారీగా సోమవారం మధ్యాహ్నం సీట్ల కేటాయింపు జరపనున్నారు. ఈ నేపథ్యంలో.. రెండేళ్లు బయట చదవడంతో స్థానికతను కోల్పోయిన విద్యార్థులు టెన్షన్ పడుతున్నారు. సీట్ల కేటాయింపునకు ముందే.. స్థానికతపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఒక్కసారి సీట్ల కేటాయింపు జరిగితే.. తమకు మంచి కాలేజీల్లో అవకాశాలు ఉండవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్

కులగణన వెంటనే చేపట్టాలి

(మొదటి పేజీ తరువాయి)

రోజుల్లో ఆ కులాల్లో మరింత ఐక్యత వస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలు కష్టపడి పని చేస్తే.. పదవులు మాత్రం అగ్రవర్ణాల వారు అనుభవిస్తున్నారని తెలిపారు. వారిని అధికారం నుంచి దించడం అంత తేలిక కాదని, అట్టడుగు స్థాయి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఏకమైతేనే అది సాధ్యమవుతుందని చెప్పారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. యూపీఏ హయాంలో సామాజిక కులగణన కోసం ప్రయత్నం జరిగిందని, దీనికోసం రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టారని తెలిపారు. దాని ప్రకారం 52 శాతం బీసీలు ఉన్నట్లు తేలిందన్నారు. అయితే ఇందులో అనేక తప్పులున్నాయంటూ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ఎన్డీయే ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసిందని చెప్పారు. కానీ, కమిటీకి నిధులు, విధులు ఇవ్వకపోవడంతో ఆ లెక్కలు అలాగే మరుగున పడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి కులగణన చేసే ఉద్దేశం కనిపించడం లేదని, ఈ పరిస్థితిలో మార్పు వచ్చేందుకు బీసీ సంఘాలు, మేధావులు ఏకతాటిపై నిలిచి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

రాజకీయాలను శాసించనున్న బీసీలు..

తెలంగాణకు రేవంత్‌రెడ్డే చివరి ఓసీ సీఎం అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. 2028లో బీసీ నేత ముఖ్యమంత్రి అవుతారన్నారు. తెలంగాణ రాజకీయాలను బీసీలు శాసించబోతున్నారని చెప్పారు. తనకు రెడ్లు, ఓసీల ఓట్లు వద్దని, బీసీల ఓట్లు చాలునని అన్నారు. ఓసీ నేతలు ఈ మాట చెప్పగలరా? అని సవాల్ విసిరారు. బీసీ ఉద్యోగులపై కొందరు ఆధిపత్య కులాలకు చెందిన అధికారులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఏసీబీకి పట్టిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో కులగణన చేయడంతోపాటు రిజర్వేషన్లలో బీసీలకు 42శాతం వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. బ్రాహ్మణులు, వైశ్యుల్లోని పేదలు కూడా బీసీలతో కలిసి నడవాలని పిలుపునిచ్చారు. దేవళ్ళ సమ్మయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో సంవిధాన్ సమ్మాన్ సమ్మేళన్ కన్వీనర్ అనిల్ జైహింద్, ప్రొఫెసర్లు పీఎల్ విశ్వేశ్వరరావు, సింహాద్రి, తిరుమలి, మురళీమనోహర్, తదితరులు కులగణన ఆవశ్యకతను నొక్కిచెప్పారు.



పురుషోత్తంరెడ్డి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న రేవంత్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి

పితృ వియోగం

నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు

హుజూర్‌నగర్, గచ్చిబౌలి, రాయదుర్గం, సెప్టెంబర్ 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి నలమాద పురుషోత్తంరెడ్డి (90) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. భార్య ఉషాదేవితో కలిసి మసీద్‌బండలోని సైబర్ మెడోస్‌లో కుమార్తె హితశ్రీరెడ్డి నివాసంలో ఉంటోన్న ఆయన ఆదివారం అస్వస్థతకు గురికావడంతో అపోలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నేతలు ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మందకృష్ణ మాదిగ, ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, రవిచంద్ర, మాజీ మంత్రి హరీశ్‌రావు, కేపీ వివేక్ తదితరులు నివాళులు అర్పించి సానుభూతిని తెలిపారు. అనంతరం రాయదుర్గంలోని మహాప్రస్థానంలో పురుషోత్తంరెడ్డి భౌతికకాయానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు, జీవన్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, వేం నరేందర్‌రెడ్డి, మండవ వెంకటేశ్వరరావు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పాల్గొన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తాటిపాములకు చెందిన నలమాద పురుషోత్తంరెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్దకుమారుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రి కాగా, చిన్న కుమారుడు గౌతం రెడ్డి పారిశ్రామికవేత్త. కుమార్తె హితశ్రీ గృహిణి. బీహెచ్ఈఎల్‌లో ఈడీగా పనిచేసిన ఆయన ఉద్యోగ విరమణ తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడ్డారు.

ఉప్పుడు బియ్యాన్ని తమిళనాడులో అమ్మేశారు!

(మొదటి పేజీ తరువాయి)

బియ్యం బకాయిలు 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఖరీఫ్ బకాయిలు 9 లక్షల టన్నులు కలిపి 29 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంది. ఇవికాకుండా గడిచిన నాలుగైదేళ్ల సీఎంఆర్ బకాయిలు మరికొన్ని లక్షల టన్నులు ఉన్నాయి. ఒకవైపు మిల్లర్లపై కేసులు నమోదవుతున్నా.. అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు. రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు రంగంలోకి దిగి తీగలాగితే డొంకంతా కదిలింది. తమిళనాడుకు బియ్యం పంపిన మిల్లర్లందరికీ నోటీసులు జారీచేశారు. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్, మెదక్, నిజామాబాద్, నల్లగొండ జిల్లాల మిల్లర్లకు నోటీసులు జారీ అయ్యాయి. ఇతర జిల్లాల మిల్లర్లకు కూడా ఇవ్వనున్నట్లు సమాచారం. "మీ రైస్‌మిల్లుకు ప్రభుత్వం అప్పగించిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ చేసి ఇవ్వకుండా దారి మళ్లించి అక్రమాలకు పాల్పడ్డారు. అనధికారికంగా మిల్లింగ్ చేసి, బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలించారు. బహిరంగ(అంతర్రాష్ట్ర) మార్కెట్లో ఆ బియ్యాన్ని అమ్ముకున్నారు. వరంగల్‌కు చెందిన మణికంఠ కన్వేయర్స్ ద్వారా రైల్వే వ్యాగన్లలో తమిళనాడుకు బియ్యం తరలించి, అక్కడ డెలివరీ చేసినట్లు మా విచారణలో తేలింది. బియ్యం రవాణాపై సమగ్ర విచారణకుగాను 2022-23 ఖరీఫ్, రబీ, 2023-24 ఖరీఫ్ సీజన్లకు సంబంధించిన మీ రికార్డులు, రిజిస్టర్లు మాకు సమర్పించాలి. ఒకవేళ మీరు సొంతంగా ధాన్యం కొనుగోలు చేసినట్లయితే.. ఆ వివరాలు, రిజిస్టర్లు, చెల్లింపులు చేసిన రశీదులు చూపించాలి. ధాన్యం మిల్లింగ్ వివరాలు, లోకల్ మార్కెట్, అంతర్రాష్ట్ర మార్కెట్ విక్రయాలు తదితర వివరాలన్నీ తీసుకొని స్వయంగా విచారణకు హాజరుకావాలి" అని విజిలెన్స్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు అక్రమాలపై విచారణ చేపడుతున్నట్లు కరీంనగర్ రీజియన్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు జారీచేసిన నోటీసులో పేర్కొన్నారు. మణికంఠ ఏజెన్సీకి కూడా నోటీసులు ఇచ్చారు. సంబంధిత జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులకు సైతం నోటీసు కాపీలను పంపించారు.

విజిలెన్స్ నోటీసులతో మిల్లర్లలో కలవరం

విజిలెన్స్ అధికారులు జారీచేసిన నోటీసులు కలకలం సృష్టిస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, నల్లగొండ జిల్లాల రైస్‌మిల్లర్లు నోటీసులు అందుకోగా.. ఇతర జిల్లాల్లో అక్రమాలకు పాల్పడిన మిల్లర్లలో కలవరం మొదలైంది. అసలు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన మిల్లర్ల సంఖ్య చాలా తక్కువ. మార్కెట్లో టర్నోవర్ అయ్యే ధాన్యం, బియ్యంలో 95 శాతం ప్రభుత్వం సేకరించి, ఇచ్చిందే కావడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు రికార్డులు ఎలా చూపించాలి? రశీదులు ఎలా తేవాలి? లేని రిజిస్టర్లు ఎలా చూపించాలి? అని మిల్లర్లు తలలు పట్టుకున్నారు. కొందరు మిల్లర్లు తప్పుడు రికార్డులు సృష్టించే పనిలో ఉన్నట్లు సమాచారం.

ఫార్మా సిటీ భూసేకరణలో అక్రమాలు!

- గోప్యంగా ఇంటెలిజెన్స్, సీఐడీ విచారణ
- అక్రమార్కుల గుండెల్లో గుబులు

యాచారం, సెప్టెంబరు 29: గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ భూసేకరణలో భారీగా అక్రమాలు జరిగాయని, కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు వచ్చిన ఆరోపణలపై ఇంటెలిజెన్స్, సీఐడీ అధికారులు గోప్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో ఫార్మాసిటీ కోసం ఇప్పటికే 8 వేల ఎకరాల పట్టా, అసైన్డ్ భూములను సేకరించారు. సెంటు భూమి లేని వారికి కూడా వారి ఆధీనంలో భూములు ఉన్నట్లు చూపుతూ పరిహారం ఇచ్చారని, ఇలా పెద్దమొత్తంలో నిధుల దుర్వినియోగం జరిగిందని గుర్తించినట్లు సమాచారం. తాటిపర్తిలో 104 సర్వే నెంబర్‌లో 250 ఎకరాల భూదాన్ భూములున్నాయి. వీటిపై కోర్టులో కేసులు ఉండగా, నిబంధనలకు విరుద్ధంగా 168 ఎకరాలకు పరిహారం ఇవ్వడంపైనా సీఐడీ విచారణ చేస్తున్నట్లు తెలిసింది. కొందరు స్థానికేతరులకు కూడా పరిహారం ఇచ్చారని అధికారుల దృష్టికి వచ్చింది. దీనికి మధ్యవర్తిత్వం వహించిందెవరు? ఎంత ముడుపులు తీసుకున్నారు? అని ఆరా తీస్తున్నారు. యాచారం రెవెన్యూ కార్యాలయంలో పలు రికార్డులను సేకరించినట్లు తెలిసింది. నాయకుల నుంచి రెవెన్యూ అధికారులు భారీగా ముడుపులు అందుకుని స్థానికేతరులకు పరిహారం అందజేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ జరుగుతున్నట్లు తెలియడంతో మధ్యవర్తులు గ్రామాలను విడిచి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు. అవకతవకలపై పక్కాగా విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. భూమి లేకున్నా నకిలీ పత్రాలతో ప్రభుత్వ ధనం కాజేసిన వారిని గుర్తించడానికి రిజిస్టర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

ఈడీ అదుపులో 'సాహితీ' లక్ష్మీనారాయణ

హైదరాబాద్, సెప్టెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రీలాంచ్ పేరుతో ప్రజల నుంచి పెద్దమొత్తంలో వసూళ్లకు పాల్పడ్డ కేసులో సాహితీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ఎండీ లక్ష్మీనారాయణను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా మనీ లాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో రూ.161 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే. ఈడీ అధికారులు విచారణలో భాగంగా లక్ష్మీనారాయణ నుంచి పలు అంశాలపై వివరాలు రాబట్టినట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ పేరుతో రూ.260 కోట్లు, అమీన్‌పూర్‌లో హైరైజ్ బిల్డింగ్‌ల పేరుతో రూ.89 కోట్లు సాహితీ సంస్థ వసూలు చేసినట్లు ఈడీ విచారణలో తేలింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.